తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
21 Glorious years

epaper.vaartha.com WWW.VAARTHA.COM హైదరాబాద్ సిటీ fb.com/vaartha

PUBLISHED FROM HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

29-8-2017 మంగళవారం సంపుటి :23 సంచిక : 209 పేజీలు :12 వెల : 5.00



సోమవారం న్యూఢిల్లీలో సుప్రీంకోర్టు కొత్త చీఫ్ జస్టిస్‌గా ప్రమాణం చేసిన దీపక్ మిశ్రాను అభినందిస్తున్న రాష్ట్రపతి కోవింద్

2 రేప్ కేసుల్లో... డేరా బాబాకు

20 యేళ్ల జైలు



డేరా కొత్త చీఫ్‌గా బాబా దత్తత కుమార్తె హానీప్రీత్!

భారీ శిక్ష విధించిన సిబిఐ ప్రత్యేక కోర్టు
రెండు కేసుల్లోనూ 15 లక్షల చొప్పున జరిమానా
హైకోర్టుకు వెళతామన్న బాబా న్యాయవాది

న్యూఢిల్లీ, ఆగస్టు 28: ఇరువురు మహిళలపై అత్యాచారం చేశారనే కేసులకు సంబంధించి వివాదాస్పద గురువు డేరా బాబా గుర్మీత్ సింగ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు చెప్పింది. రోహతక్ జైలులోని ప్రత్యేక సీబీఐ న్యాయస్థానం డేరా బాబా కేసులో తీర్పు వెలువరించింది. రెండు వేర్వేరు కేసుల్లో చెరో 10 ఏళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ సీబీఐ కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వీటితోపాటు 30 లక్షల రూపాయల జరిమానాను కూడా విధించారు. అలాగే బాధితులు ≫2

తెలుగు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల విభజన

సెప్టెంబరులో పూర్తి

పెండింగ్ అంశాలపై కేంద్రం ఆదేశం
డిఒపిటి కార్యదర్శి అజయ్ మిట్టల్ సమక్షంలో రెండు రాష్ట్రాల సిఎస్‌ల సమావేశం
ఇంకా తేలని 1302 మంది ఉద్యోగుల విభజన, సీనియారిటీయే ప్రధాన సమస్య
తెలంగాణకు కేటాయించిన ఎపి స్థానికత కలిగిన 24 మంది ఎస్‌ఒల ప్రస్తావన



తెలంగాణ సిఎస్ ఎస్పీ సింగ్, ఎపి సిఎస్ దినేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు సోమవారం హైదరాబాద్‌లో సమావేశమైన దృశ్యం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు28: సెప్టెంబర్ నెలా ఖరులోగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల విభజనను పూర్తి చేయాలని డిఒపిటి ఆదేశించింది. సెక్రటేరియట్ ఉద్యోగుల తుది విభజన పూర్త యినందున సెక్షన్ అధికారుల అంశంలో జోక్యం చేసుకోలేమని తెలి పింది. ఈ మేరకు ఉద్యోగుల విభజనపై డిఒపిటి కార్యదర్శి అజయ్ మిట్టల్ సమక్షంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ఎస్‌పి సింగ్ (తెలంగాణ), దినేష్‌కుమార్ (ఆంధ్రప్రదేశ్) హైదరాబాద్‌లో సమావేశమై చర్చించారు. ఉద్యోగుల విభజనలో మిగిలిన సమస్యల పరిష్కరించేందుకు డిఒపిటి కార్యదర్శి అజయ్ మిట్టల్ సోమవారం నాడు ఒక ప్రైవేట్ హోటల్‌లో రెండు రాష్ట్రాల సిఎస్‌లతో సమావేశ మయ్యారు. ఉద్యోగుల విభజన కమిటీకి చైర్మన్‌గా కొనసాగేందుకు కమల్‌నాథన్ నిరాకరించడంతో కమిటీకి డిఒపిటి కార్యదర్శి నేతృత్వం వహిస్తున్నారు. ఆయన సమక్షంలో రెండు రాష్ట్రాల ప్రధాన కార్యద ర్శులు, విభజన కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల విభజన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని డిఒ పిటి కార్యదర్శి రెండు రాష్ట్రాలను ఆదేశించారు. ఇప్పటి వరకు జరిగిన ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియను సమీక్షించారు. మొత్తం 90 విభాగాలు, 153 యూనిట్‌లలో 55వేల 870 మంది ఉద్యోగుల తుది కేటాయింపులు పూర్తయిందని సమావేశంలో రెండు రాష్ట్రాలు డిఒపిటి కార్యదర్శికి తెలియజేశాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 31,611 మంది ఉద్యోగులు, తెలంగాణకు 24,259 మంది ≫2



పంటల బీమాపై సమన్వయ కమిటీ

హైదరాబాద్, అగస్టు 28, ప్రభాతవార్త: పంటల బీమా పథకంపై రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ ఛైర్మన్ సి పార్థసారధి ఆధ్వర్యంలో సోమవారం సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సమావేశంజరిగింది. పంటల నోటిఫికేషన్, జిల్లాల్లో పిఎంఎఫ్‌బిఐ, డబ్ల్యు బిసిఐఎస్ పథకాల అమలు, గ్రామ, మండల స్థాయి బీమా యూనిట్లు, బీమాకు తేదీల ఖరారు, స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్, 2017-18 సంవత్సరంలో రబీ పంటల బీమా తదితర అంశాలపై ఈ సమావే శంలో చర్చించారు. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. రబీకి సంబంధించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి, జొన్న, మొక్కజొన్న, పెసర, మినుము, శెనగ, మిర్చి, పొద్దుతిరుగుడు, వేరుశెనగ, ఉల్లి, నువ్వులు, ఆర్‌డబ్ల్యుబిసిఐఎస్ కింద మామిడికి బీమా సౌకర్యం కల్పించాలి. ఈ 12 పంటలు కాకుండా వనపర్తి, నాగర్‌కర్నూలు జిల్లాల్లో వేరుశెనగ, ఆదిలాబాద్, గద్వేల్ జిల్లాలో శెనగలు, ఆసిఫాబాద్ జిల్లాలో జొన్న, 25 జిల్లాలో వరి పంటలకు గ్రామాన్ని యూని ట్‌గా తీసుకుని బీమాను అమలు చేయాలి. రబీలో పిఎంఎఫ్‌బిఐ పథకం కింద కొత్తగా నువ్వుల పంటలకు మండలాన్ని యూనిట్‌గా చేసుకుని బీమా కల్పించాలి. శెనగ పంటకు ≫2



వరద ప్రవాహం పెరగడంతో సోమవారం ఖమ్మం జిల్లా తాలిపేరు జలాశయం 16 గేట్లు ఎత్తివేసిన దృశ్యం

నిరుపేద బాలుడి కాలేయ మార్పిడికి కెసిఆర్ సాయం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 28: టిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. కాలేయ మార్పిడి చేయాల్సిన అవ సరం ఉన్నపేద బాలుడికి సిఎం కెసిఆర్ మానవతా హృదయంతో ముందుకొచ్చి ఆర్థిక సహాయం మం జూరు చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన హనుమాన్ దాస్ కుమారుడైన దేవసాని శ్రీమాన్ (11 నెలలు) పుట్టినప్పటి నుంచి అనా రోగ్యంతో బాదపడుతున్నాడు. వైద్య పరీక్షలు చేయించగా కాలేయానికి ≫2

మరో రెండు రోజులు భారీ వర్షాలు

తెలంగాణలో మోస్తరుగాను, కోస్తాలో భారీ వానలు

విశాఖపట్నం, ఆగస్టు 28, ప్రభాతవార్త: తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతవరణ కేంద్రం తెలిపింది. ఒడిశా తీరాన్ని, పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని అనుకొని అల్పపీడనం కొనసా గుతోంది. దీనికి తోడు అవర్తనం కూడ కొనసాగు తోంది. ఈ పరిస్థితుల్లో రుతుపవనాల కదలిక జోరుగా సాగుతోంది. ఈ ప్రభావం వల్ల రానున్న 48 గంటల్లో కోస్తాలోను, తెలంగాణాలోను, రాయలసీమలోను వర్షలు పడతాయని వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. కోస్తాలో భారీ వర్షాలు, తెలంగాణలోను, రాయలసీమలోను ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు.



ఎన్నికల గెలుపు పత్రంపై సంతకం చేస్తున్న టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానంద రెడ్డి, చిత్రంలో మంత్రి అఖిల ప్రియ, భూమా మౌనిక

నంద్యాల టిడిపిదే

భూమా బ్రహ్మానందరెడ్డి 27 వేల ఓట్లు పైగా భారీ మెజార్టీతో గెలుపు
వైఎస్సార్సీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి పరాజయం
డిపాజిట్ కోల్పోయిన కాంగ్రెస్

కర్నూలు, ఆగస్టు 28, ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఇక్కడి ఓటర్లు తెదేపాకు జై కొట్టారు. ఈ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా బరిలో దిగిన భూమా బ్రహ్మానందరెడ్డి తన సమీప ప్రత్యర్థి వైకాపా అభ్యర్థి శిల్పా మోహ న్‌రెడ్డిపై 27,466 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈనెల 23న జరిగిన ఉప ఎన్నికకు సంబందించి సోమవారం ఉదయం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ≫2



నంద్యాల గెలుపు కోసం టిడిపి ఖర్చు 200 కోట్లు

వైఎస్సార్సీ అధినేత జగన్ 2లో

మరి మాకేం దిక్కు?

సిట్టింగ్‌లకే టికెట్లన్న సిఎం ప్రకటనతో ఫిరాయింపుదారులు.. ఆశావహుల్లో అసంతృప్తి!
రాజకీయ భవిష్యత్ కోసం ప్రత్యామ్నాయాలపై.. తర్జనభర్జనలు?

హైదరాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: 2019 సార్వత్రికి ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మె ల్యేలందరికీ సీట్లు గ్యారంటీ అని.. వారి గెలుపు భాధ్యత కూడా తనదేనని సాక్షా త్తు టిఆర్ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ తాజాగా చేసిన ప్రకటన ఆపార్టీలోని ఫిరాయింపుదారులు..ఆశావాహులకు తీవ్ర అసంతృప్తికి గురి చేస్తోం ది. గత ఎన్నికల్లో కాంగ్రెస్, టిడిపి, ఇతర పార్టీల నుంచి గెలిచిన అనేక మంది ఎమె ్మల్యేలు తదనంతరం అధికార టిఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరిలో కిందరికి ప్రభుత్వ పదవులు..కార్పొరేషన్ల ఛైర్మన్లు దక్కినా..ఎక్కువ మందికి ఆశించిన స్థాయిలో ఆర్టీ అధినేత నుంచి ఆదరణ లేక ఉన్నారు. ఈదశలో 'ఉరిమి ఉరిమి మంగళం మీద పడ్డట్లు'..పార్టీ సిట్టింగులకే అన్న ముఖ్యమంత్రి కేసిఆర్ వ్యాఖ్య వారిలో తీవ్ర నైరాశ్యాన్ని కలిగిస్తోందని చెప్పవచ్చును. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సమయంలో విభజన చట్టంలో అసెంబ్లీ స్థానాలను పెంపు చేస్తారని పేర్కొ నడంతో నమ్మిన నేతలంతా టిఆర్ఎస్ కండువాను కప్పుకున్నారు. రానున్న ఎన్నికల తర్వాతే అసెంబ్లీ సీట్ల పెంపు ప్ర క్రియ ఉంటుందని ఇటీవలే కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో శనివారం తెలం గాణభవన్‌లో పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీ, పార్టీ ముఖ్యులతో నిర్వహిం చిన సమావేశంలో సిఎం కేసిఆర్ వచ్చే ఎన్నికల్లో సిట్టింగులకే సీట్లిస్తామని విస్పష్టంగా ప్రకటన చేయడం పార్టీ తీవ్ర చర్చకు తెరలేపింది. దీనితో చాలా మంది ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల భవిష్యత్‌పై బెంగపెట్టుకున్నారు. తమ రాజకీయ భవిష్యత్ కోసం ప్రత్యామ్నాయ పార్టీలు..మార్గాలను వారు అన్వేషి స్తున్నారనే ప్రచారం పార్టీలో జోరుగా ప్రారంభమైంది. టిఆర్ఎస్ పార్టీ అధి కారం చేపట్టిన తర్వాత 'ఆపరేషన్ ఆకర్ష్' పేరుతో ప్రారంభించిన ఫిరా యింపులకు..తాయిలాలకు ఆశపడి తమకు రాజకీయంగా జన్మనిచ్చిన..అందలం ఎక్కించిన పార్టీలను కాదని టిఆర్ఎస్‌లోకి మారిపోయారు.

ప్రధానంగా అత్యధికంగా తెలుగుదేశం పార్టీ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు..ఒక ఎంపీ సైకిల్ దిగి..కారెక్కారు. కాంగ్రెస్ నుంచి 6గురు..వైఎస్సార్ సిపి నుంచి ముగ్గురు.. సిపిఐ నుంచి ఒకరు.. బిఎస్‌పి నుంచి ఇద్దరు.. ఇలా వారి ప్రధాన అనుచరులందరూ ఆయా పార్టీలను వదిలి.. గులాబీ కండువా కప్పుకున్నారు. వీరే కాకుండా అనేక మంది నియోజకవర్గ, జిల్లాస్థాయి నేతలు కూడా టిఆర్ ఎస్‌లో పదవులను ఆశించి వచ్చి చేరారు. గతంలో 10 జిల్లాలు ఉన్న రాష్ట్రాన్ని ఇటీవల 31 జిల్లాలకు ప్రభుత్వం పెంచింది. ఇందుకనుగుణంగానే నియోకవర్గాల పెంపు కూడా ఉంటుందని అంచనా వేశారు. కానీ బిజెపి రాష్ట్ర నేతలు ఆపార్టీ జాతీయ నాయకత్వం వద్ద అసెంబ్లీ సీట్ల పెంపు అసలే వద్దనీ.. అది టిఆర్ఎస్‌కు మరింతగా రాజకీయంగా ప్రయోజనం చేకూరుస్తోందని ≫2

దేశానికే తెలంగాణ రోల్ మోడల్

భారీ నీటి పారుదల మంత్రి హరీష్ రావు

ధర్మపురి, ఆగస్టు 28, ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం రైతులకు సాగు నీరు అందించేందుకు వీలయినన్ని విధాలుగా కృషిచేస్తుందని ప్రభుత్వం నిర్మిస్తున్న ప్రాజెక్టులు లిఫ్ట్ ఇరిగేషన్లతో రైతుల సాగునీటి సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతుండడంతోపాటు తెలంగాణ దేశానికి రోల్ మాడల్‌గా నిలిస్తుందని భారీ నీటిపారుదల శాఖామంత్రి తన్నీరు హరీష్‌రావు, ≫2



సోమవారం ధర్మపురి మండలంలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి హరీష్‌రావు

నంద్యాల గెలుపు కోసం
టిడిపి ఖర్చు 200 కోట్లు
వైఎస్సార్సీపీ అధినేత జగన్

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: కర్నూలు జిల్లా నంద్యాల శాసనసభకు జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ 200 కోట్ల రూపాయలను ఖర్చు చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. అంతేకాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకున్న అధికారాన్ని అడ్డం పెట్టుకుని గెలిచారన్నారు. నంద్యాల ఉప ఎన్నికల ఫలితం సోమవారం లోటస్ పాండ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఇది చంద్రబాబు గెలుపు కాదని... అలా అనుకుంటే అది పొరపాటేనన్నారు. అధికార బలంతో ఓటర్లను పలు రకాలుగా బెదిరించి ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. టీడీపీ ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా, ప్రలోభాలకు గురిచేసినా భయభ్రాంతుల మధ్య పార్టీకోసం నిలబడి కష్టపడ్డ కార్యకర్తలతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్‌కు ఓట్లు వేసిన ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాలలో టీడీపీ గెలుపు దిగజారుడు రాజకీయాలకు నిదర్శమన్నారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చి తర్వాత ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకుఅలవాటన్నారు. ఇవి సాధారణ ఎన్నికలు కాదు కాబట్టి టీడీపీ గెలిచిందన్నారు. చం ద్రబాబు తనకున్న అధికారం అడ్డుపెట్టుకొని గెలిచారన్నారు. రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు లాక్కొని ఓట్లు వేయించుకున్నారని తెలిపారు. ఈ ఎన్నిక తమకు ఏ మాత్రం రెఫరెండం కాదన్నారు. తమ పార్టీ గుర్తుపై గెలిచి అనంతరం టీడీపీలో చేరిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలు నిర్వహించాలని జగన్ సవాల్ చేశారు. ఆ ఎన్నికలను తాము రెఫరెండంగా భావిస్తామని చెప్పారు. అధికార పార్టీలో తనకున్న పదవులకు రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన శిల్పా చక్రపాడిరెడ్డి, శిల్పామోహన్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. విలువలకు కట్టుబడి పదవులకు రాజీనామా చేసిన శిల్పా సోదరులను ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ ఇప్పుడే కాదు ఎప్పటికీ విలువలకు కటుబడి ఉంటుందన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ అధికార దుర్వినియోగం చేసిం దన్నారు. విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ చేయడంతో పాటు నంద్యాలప్రజలను భయభ్రాంతులకు గురిచేసిందని ఆరోపించారు.



గుజరాత్ నుంచి మోటార్ బైక్‌లపై వచ్చిన 'బైకింగ్ క్వీన్స్' సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీని కలిసిన దృశ్యం

నంద్యాల టిడిపిదే

≫ ఓట్ల లెక్కింపు చేపట్టారు. పోలైన మొత్తం 1,73,335 ఓట్లను లెక్కించేందుకు అధికారులు 19 రౌండ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ మొదలవగా 16వ రౌండ్లో మినహాయించి ప్రతి రౌండ్లో తెదేపా తన ఆధిక్యతను చాటుతూ వచ్చింది. ఈ ఎన్నికల్లో మొత్తం 97,076 ఓట్లు టిడిపి సాధించగా, వైకాపా 69,610 ఓట్లు సాధించింది. జాతీయ పార్టీ కాంగ్రెస్ కేవలం 1382 ఓట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో ఆపార్టీ డిపాజిట్ కోల్పోయింది. మొత్తం మీద ఈ ఎన్నికల్లో 51 శాతం ఓట్లను టిడిపి సాధించగా, 40 శాతం వైకాపా సాధించినట్లయింది. నియోజక వర్గంలోని నంద్యాల పట్టణంలో టిడిపి ఆధిక్యతను సాధిస్తుందని, నంద్యాల రూరల్, గోస్పాడు మండలంలో వైకాపా ఆధిక్యత సాధిస్తుందని రాజకీయ పరిశీలకుల అంచనాలు దీంతో తలకిందులయ్యాయి. మొత్తంగా అన్ని రౌండ్లు పూర్తయ్యే సరికి తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి 27,466 ఓట్ల మెజార్టీతో వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిపై విజయం సాధించారు. ఇక ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఓట్ల లెక్కింపులో మొదట ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లను లెక్కించగా మొత్తం 250 మంది ఉద్యోగులకు గాను 211 మంది ఏ పార్టీకి ఓటు వేయకుండా నోటాకు జై కొట్టడం గమనార్హం.

సెప్టెంబరులో పూర్తి

≫ ఉద్యోగులు కేటాయించబడ్డారు. మరో 1302 మంది ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియ ఆగి పోయిందని గుర్తించారు.సీనియారిటీ, కోర్టు కేసుల కారణంగా ఈ విభజన ఆగిపోయిందని తేలింది. అయితే సీనియారిటీ ఖరారు చేసే వరకు తుది కేటాయింపులు చేయరాదన్న హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ ప్రక్రియ చేపట్టలేదు. దీంతో సెప్టెంబర్ నెలాఖరు కల్లా సీనియార్టీ ఖరారు చేసి ఆ తర్వాత తుది కేటాయింపులు చేయాలని భేటీలో నిర్ణయంచారు. 1302 మంది ఉద్యోగుల్లో వివాదాలు లేని తొమ్మిది మంది తుది కేటాయింపులను పూర్తి చేశారు. 536 డిప్యూటీ, స్పెషల్ కలెక్టర్లు, 62 ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, 683 డిఎస్పీ, అడిషనల్ ఎసీ ్ల విభజన సీనియార్టీ కారణంగా నిలిచిపోయింది, దీనిపై స్పందించిన డిఓపిటి కార్యదర్శి అజయ్ మిట్టల్ సెప్టెంబర్ నెలాఖరులోగా సీనియార్టీ జాబితా రూపొందిస్తే విభజన ప్రక్రియను పూర్తి చేస్తామని సూచించారని తెలిసింది. తెలంగాణకు కేటాయించిన ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన 24 మంది సచివాలయ (ఎస్ఓలు) విభాగాధికారుల, నాలుగో తరగతి ఉద్యోగుల అంశం కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. అయితే ఈ రెండింటికి సంబంధించి ఇప్పటికే తుది కేటాయింపులు పూర్తయినందున కమిటీ పరిధిలోకి రావని అజయ్ మిట్టల్ స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే ఇద్దరు సిఎస్‌లు చర్చించుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఇంకా ఈ సమావేశంలో డిఓపిటి సంయుక్త కార్యదర్శి కిమ్‌బూంగ్ కిప్‌గెన్, తెలంగాణ ఆర్థిక ముఖ్యకార్యదర్శి ఎన్.రామకృష్ణారావు,ఆంధ్రప్రదేశ్ జిఎడి ముఖ్యకార్యదర్శి ఎల్. ప్రేమచంద్రారెడ్డి కూడా పాల్గొన్నారు.

కాలేయ మార్పిడికి కెసిఆర్ సాయం

≫ సంబంధించిన సమస్య తలెత్తిందని, కాలేయ మార్పిడి ఒక్కటే పరిష్కారమని వైద్యులు చెప్పారు. దీంతో అంత ఖర్చు భరించలేని తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈ విషయాన్ని పత్రికలలో వచ్చిన కథనాల ద్వారా ముఖ్యమంత్రి కెసిఆర్ తెలుసుకున్నారు. వెంటనే సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డితో మాట్లాడారు. అవసరమైన వైద్యాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.దీంతో కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి బాలుడి కుటుంబ సభ్యులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలేయ మార్పిడికి రూ.25లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి రూ. 25లక్షలను సిఎం సహాయనిధి నుంచి మంజూరు చేశారు.దీనికి సంబంధించిన చెక్కును సోమవారం కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి హైదరాబాద్ గ్లోబల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. మెరుగైన వైద్యం అందించాల్సిందిగా డాక్టర్లను కలెక్టర్ కోరారు.

సెప్టెంబర్ 6నుండి 'జలసిరికి హారతి'

రికార్డు స్థాయిలో పోలవరం పనులు..
ఎపి సిఎం చంద్రబాబు

విజయవాడ, ఆగస్టు28 ప్రభాతవార్త: వచ్చే నెల 6,7,8తేదీలలో 'జలసిరికి హారతి' కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. నదుల దగ్గర నుంచి చెరువుల వరు రాష్ట్రంలోని అన్ని జలవనరులను ఆ మూడు రోజులు పూజించుకునేలా, ఇందులో ప్రజలు భాగస్వామ్యులు అయ్యేలా చూడాలని సూచించారు. సోమవారం తన కార్యాలయంలో పోలవరం సహా 28 ప్రాజెక్టుల పనులపై జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో కలిసి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. 38వ సారి పోలవరం పనుల పురోగతిపై పర్సు వల్ ఇన్‌స్పెక్షన్ చేశారు. వర్షాల కారణంగా ఈ నెల మొదటి రెండు వారాల పనులు ఆలస్యమయ్యాయని, అయితే ఎన్నడూ లేనంతగా ఈ వారం మాత్రం రికార్డు స్థాయిలో 21,226క్యూబిక్ మీటర్ల వరకు స్పిల్‌వే, స్టిల్లింగ్ బేసిన్ కాంక్రీట్ పనులు జరిగాయని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

SINGAM KUIL YELLOW MONDAY
Draw No:116 DrawDate on:28/08/17

SINGAM SERIES	KUIL SERIES
1st Prize Rs.10.000/- S 796364	1st Prize Rs.10.000/- K 581009
2nd Prize Rs.7.000/- 83040	2nd Prize Rs.7.000/- 88505
3rd Prize Rs.3.500/-	3rd Prize Rs.3.500/-
01610 11608 43407 44489 49579	24620 33109 47619 50228 60403
50243 51758 68978 71967 80130	69621 71905 72929 86601 95929
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
0298 3168 3910 4872 5039 5207 6506	2618 3370 4347 5538 6270 8769 9232
6553 7246 9824	9241 9816 9980
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
0071 0979 4240 4775 4962 6109 6445	1881 2777 3453 3832 4168 4951 5200
6724 9426 9874	5617 7427 7507
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0265 1784 3415 4502 5944 7722 8929	0033 1605 3329 4566 6193 8247 9296
0285 1785 3423 4662 5961 7723 8946	0095 1672 3347 4660 6231 8314 9400
0437 1899 3425 4773 5999 7798 9278	0198 1674 3409 4739 6246 8349 9416
0468 1902 3471 4888 6159 7931 9303	0244 1774 3412 4884 6439 8415 9520
0598 1927 3517 4965 6296 8043 9529	0368 1918 3523 5010 6458 8429 9551
0748 1940 3623 5085 6425 8093 9629	0482 1937 3647 5012 6519 8461 9565
0788 2194 3849 5131 6508 8311 9686	0575 2354 3843 5019 6627 8588 9818
0819 2315 3924 5205 6711 8384 9766	0891 2661 3903 5102 7022 8621 9849
0989 2596 4085 5219 7059 8407 9865	0988 2694 3979 5120 7076 8711 9927
1058 2672 4094 5269 7144 8701 9881	0993 2854 3988 5158 7161 8723 9953
1090 2851 4218 5457 7203 8726	1084 2925 4074 5388 7329 8937
1105 2934 4312 5528 7256 8729	1155 2993 4117 5451 7348 9078
1309 3015 4314 5570 7460 8866	1257 3145 4323 5507 7865 9097
1370 3119 4357 5630 7611 8886	1289 3211 4437 6037 7876 9192
1615 3161 4379 5904 7705 8897	1316 3259 4506 6167 8033 9223

ROSA DEER ROYAL MONDAY
Draw No:116 DrawDate on:28/08/17

ROSA SERIES	DEER SERIES
1st Prize Rs.10.000/- R 721702	1st Prize Rs.10.000/- D 034024
2nd Prize Rs.7.000/- 43369	2nd Prize Rs.7.000/- 26123
3rd Prize Rs.3.500/-	3rd Prize Rs.3.500/-
13070 15805 30558 33052 42370	02982 17289 28750 32574 37133
44817 48404 50394 53433 94017	54160 66631 74911 92179 99667
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
0088 0439 0716 1642 1663 4073 4607	1356 1588 1730 3773 3886 4774 5212
6055 6758 7352	5312 6182 6934
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
0494 1849 3738 5036 5803 6057 6144	0651 1112 1982 2910 3131 3194 6353
7139 7479 9747	6812 8651 9806
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0134 1692 4030 4854 5970 7573 9283	0146 1607 2965 4175 6000 6914 8501
0280 1753 4086 4958 6050 7755 9398	0181 1717 2977 4428 6016 6965 8751
0366 1874 4190 4963 6255 7799 9560	0221 1770 3061 4439 6033 6999 8856
0445 2231 4205 5084 6434 8050 9679	0306 1823 3124 4592 6115 7261 8977
0646 2283 4245 5166 6582 8282 9690	0351 1936 3198 4677 6199 7325 9247
0845 2324 4260 5211 6612 8309 9712	0377 2133 3246 4681 6213 7408 9279
0846 2339 4368 5361 6684 8538 9839	0469 2154 3467 4897 6324 7615 9569
0873 2466 4369 5421 6717 8608 9898	0521 2193 3497 4934 6382 7777 9727
0907 2853 4375 5448 6765 8613 9942	1027 2451 3702 5028 6410 7780 9756
1044 3136 4568 5572 6864 8828 9959	1043 2546 3723 5215 6492 7816 9795
1065 3584 4603 5574 7117 8925	1059 2619 3936 5317 6646 7826
1126 3614 4615 5606 7185 8957	1199 2666 3989 5412 6677 7873
1236 3657 4686 5658 7361 9140	1360 2706 4046 5496 6751 8230
1449 3769 4767 5775 7406 9173	1376 2710 4091 5558 6871 8385
1515 3938 4833 5889 7461 9273	1535 2888 4098 5791 6912 8427

THANGAM NALLANERAM LUCK MONDAY
Draw No:116 DrawDate on:28/08/17

THANGAM SERIES	NALLANERAM SERIES
1st Prize Rs.10.000/- T 264645	1st orize Rs.10.000/- N 599768
2nd Prize Rs.7.000/- 08947	2nd Prize Rs.7.000/- 65362
3rd Prize Rs.3.500/-	3rd Prize Rs.3.500/-
04402 12972 18868 20836 24392	14909 16030 24436 35087 36940
30318 70396 71446 80147 92915	44607 59550 64759 82822 97133
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
0301 0622 0657 3002 3092 3397 3668	1509 3287 4299 4600 5935 7636 7913
4174 5653 6617	8281 8598 8972
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
0117 2271 2526 3898 4227 4413 7024	1825 2792 3844 5463 6177 6939 6997
7128 7790 9187	9255 9439 9452
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0110 1085 2410 5263 6701 8013 9289	0080 1285 2290 4296 6629 7543 9071
0155 1088 2861 5302 6803 8053 9350	0223 1389 2472 4393 6664 7801 9072
0206 1264 2966 5395 6811 8224 9572	0378 1406 2499 4418 6770 8048 9189
0208 1337 3364 5396 7027 8298 9616	0400 1426 2649 4519 6773 8049 9222
0258 1435 3539 5428 7137 8358 9701	0599 1512 3308 4744 6815 8253 9344
0370 1480 3756 5505 7366 8408 9748	0782 1558 3402 4780 6889 8316 9358
0393 1769 3792 5549 7441 8616 9751	0821 1630 3436 5143 6920 8345 9393
0407 1858 3822 5692 7480 8645 9930	0864 1662 3591 5260 6924 8445 9566
0498 1883 3914 5877 7547 8724 9982	0887 1847 3597 5555 7026 8515 9663
0518 1986 4025 5952 7627 8840 9989	0914 1871 3607 5610 7046 8543 9817
0553 2123 4069 6223 7678 8861	1017 1925 3731 6095 7178 8570
0679 2125 4083 6323 7794 9026	1029 2021 3764 6299 7232 8622
0769 2162 4604 6334 7832 9120	1035 2230 4045 6457 7298 8661
0771 2295 4894 6460 7853 9155	1091 2265 4057 6478 7354 8801
1063 2356 5126 6681 7997 9254	1246 2277 4294 6516 7525 8817

KUMARAN VISHNU SUN MONDAY
Draw No:116 DrawDate on:28/08/17

KUMARAN SERIES	VISHNU SERIES
1st orize Rs.10.000/- K 343658	1st orize Rs.10.000/- V 911945
2nd Prize Rs.7.000/- 93819	2nd Prize Rs.7.000/- 58471
3rd Prize Rs.3.500/-	3rd Prize Rs.3.500/-
07443 10479 11023 18753 24398	03676 10064 27095 33478 40950
27161 50773 62349 88694 91394	60342 62467 67334 73650 97506
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
0283 1060 1087 2590 3422 4124 6125	1496 1564 2014 2445 4837 5365 6227
7759 8191 8492	6982 7126 8833
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
0797 2291 2678 3446 3830 4234 6062	1372 3247 5004 5007 5315 5862 6432
6261 7942 8186	6461 7537 9257
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0065 1520 3117 4860 5745 7576 9118	0123 1872 3152 4258 6170 7418 9124
0158 1756 3135 4923 5850 7756 9228	0404 1889 3333 4313 6195 7483 9270
0173 1958 3165 4974 5907 7817 9262	0600 1900 3430 4396 6254 7595 9318
0405 2070 3187 4995 6010 8124 9343	0641 1923 3468 4630 6680 7655 9541
0559 2309 3229 5022 6018 8269 9349	0749 2018 3513 4709 6744 7716 9639
0638 2423 3372 5058 6085 8329 9367	1123 2165 3547 4834 6776 7786 9658
0703 2432 3654 5353 6192 8353 9548	1187 2210 3631 5147 6850 7962 9672
0807 2448 3748 5394 6469 8438 9787	1188 2486 3672 5164 6851 8012 9702
0817 2488 3851 5439 6592 8467 9880	1388 2564 3679 5455 6898 8173 9724
0852 2527 3904 5506 6685 8575 9890	1432 2717 3684 5627 6932 8765 9743
1103 2591 3986 5514 6712 8590	1569 2718 3962 5688 6935 8829
1106 2665 4304 5524 6886 8746	1597 2721 4027 5817 7011 8867
1192 2745 4470 5562 7293 8811	1754 2740 4058 5848 7049 9057
1325 3021 4729 5631 7485 8813	1781 2804 4157 5974 7186 9070
1417 3078 4794 5720 7558 8959	1851 2829 4195 6088 7377 9074

20యేళ్ల జైలు

≫ ఇరువురుకు 14 లక్షల రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని ఆదేశించారు. రెండు కేసుల్లోనూ విధించిన జైలు శిక్ష ఏక కాలంలో అమలు చేసే అవకాశం లేదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. డేరా బాబాకు సుదీర్ఘకాలం జైలు శిక్ష వేయాలని సీబీఐ తరపు న్యాయవాది న్యాస్థానాన్ని కోరారు. కాగా బాబా చేసిన సమాజ సేవలను గమనంలో ఉంచుకుని జైలు శిక్ష కాలాన్ని తగ్గించాలని ఆయన తరపు న్యాయవాది సీబీఐ కోర్టును కోరారు. రెండు కేసులకు సంబంధించిన శిక్షలను ఏక కాలంలో అమలు చేయాలని కోరినా అందుకు సీబీఐ కోర్టు న్యాయమూర్తి అంగీకరించ లేదు. సీబీఐ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టుకు వెళ్లనున్నట్లు డేరా బాబా తరపు న్యాయవాది వెల్లడించారు. న్యాయమూర్తి తీర్పు వెలువరించిన సమయంలో డేరా బాబా కోర్టులో భోరున విలపించారు. రెండు చేతులు జోడించి తనను క్షమించి శిక్ష తగ్గించాలని న్యాయమూర్తిని వేడుకున్నారు. తాను అమాయకుడినని, సామాజిక కార్యకలాపాలను చేస్తున్న నేపథ్యంలో తనను కరుణించాలని కోరుకున్నారు. అయితే గుర్మీత్ వేడుకను న్యాయమూర్తి తోసిపుచ్చారు. నమ్మివచ్చిన సాధ్వీపై ఇలా అత్యాచారానికి పాల్పడడం క్షమించరాని నేరమని న్యాయమూర్తి తీర్పునిచ్చారు. గుర్మీత్‌ను సాధారణ ఖైదీలాగానే చూడాలన్న జడ్జి రోహతక్ జైలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఐపీలాగే గుర్మీత్‌ను చూడడంపై అధికారులను మందలించారు. రేపిస్టులకు అదనపు సౌకర్యాలు కల్పిస్తారా అంటూ జైలు అధికారులకు చివాట్లు పెట్టారు. కోర్టు హాలు నుంచి బయటకు వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో పోలీసులు ఆయన్ని బలవంతంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం బాబాకు రోహ్‌తక్ జజైలులో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలు తదుపరి ఖైదీలకు ఇచ్చే దుస్తులను గుర్మీత్‌కు జైలు అధికారులు ఇచ్చి ప్రత్యేకసెల్‌ను కేటాయించారు. ఖైదీనెంబర్ 1997ను గుర్మీత్‌కు కేటాయించారు. ఇన్నాళ్లూ కళ్లు మిరుమిట్లు గొలిపేలా రంగురంగుల దుస్తులు వేసుకున్న బాబా నేటి శిక్ష ఖరారుతో మరో 20 ఏళ్లపాటు వాటికి దూరంగా ఉండాల్సిందే.

విమానంలో సీబీఐ న్యాయమూర్తి

అత్యాచార కేసులో దోషిగా తేలిన డేరా సచ్చా సౌధా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు శిక్ష ఖరారు చేసే సందర్భంగా సీబీఐ న్యాయమూర్తి కోర్టుకు విమానంలో వచ్చారు. తమపై డేరా బాబా అత్యాచారం చేశారని ఇరువురు మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 15 ఏళ్ల నాటి ఈ కేసులో గుర్మీత్‌ను దోషిగా తేలుస్తూ గత శుక్రవారం పంచకుల సీబీఐ కోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో గుర్మీత్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు అతనిని రోహ్‌తక్ జైలుకు తరలించారు. అయితే గుర్మీత్‌ను పంచకులలో కాకుండా రోహ్‌తక్‌లోనే విచారించారు. ఆయనను ఉంచిన జైలులోని ఓ గతిలోనే సీబీఐ కోర్టును ఏర్పాటు చేశారు. అతడిని దోషిగా తేల్చిన న్యాయమూర్తి జస్టిస్ జగ్దీప్‌సింగ్ జైలు శిక్ష విధించేందుకు కోర్టుకు విమానంలో చేరుకున్నారు.

బాబాకు ఉరిశిక్ష సరైంది: ఉత్తరప్రదేశ్ సాధువులు

అత్యాచార కేసులో దోషిగా తేలిన డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు ఉరి శిక్ష విధించాలంటూ ఉత్తరప్రదేశ్‌లో కొందరు సాధువులు ఆందోళనకు దిగారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వారణాసిలో ఆందోళన చేపట్టిన సాధువులు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ఆయనకు మరణదండన విధించాలని డిమాండ్ చేశారు.

ఆందోళనలకు దిగిన బాబా అనుచరులు

సీబీఐ న్యాయస్థానం డేరా బాబా కేసుకు సంబంధించిన తీర్పు వెలువడిన నేపథ్యంలో సిర్సాలో ఆందోళనకారులు భీభత్సం సృష్టిస్తున్నారు.గుర్మీత్ ప్రధాన ఆశ్రమంలోనూ బాబా అనుచరులు భారీగా చేరుకుని ఆందోళనలకు దిగారు. డేరా అనుచరులు ఇప్పటికే రెండు వాహనాలకు నిప్పు పెట్టారు. వాహనాలకు నిప్పు పెట్టిన సంగతి తెలియగానే డేరా ఛైర్ పర్సన్ విపస్సన ఇన్సాన్ స్పందించారు. అనుచరులంతా శాంతించాలని కోరారు. 15 ఏళ్ల క్రితం దాఖలైన ఓ అత్యాచార కేసులో డేరాబాబా దోషిగా తేల్చుతూ సీబీఐ తీర్పు వెలువడిన తర్వాత చెలరేగిన హింసలో ఇప్పటికే 28 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 200 మందికి పైగా గాయపడ్డారు. వందల సంఖ్యలో కార్లకు నిప్పు పెట్టారు. దీని ్న దృష్టిలో ఉంచుకుని జైలు వద్ద గుమిగూడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. హర్యానా, పంజాబ్, ఢిల్లీల్లో హైఅలర్ట్ ప్రకటించి కీలక ప్రాంతాల్లో భారీగా బలగాలను మోహరించారు. రోహ్‌తక్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు జిల్లా అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. గుర్మీత్ అనుచరులు విధ్వంసానికి పాల్పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఎక్కువ మంది ఒకే చోట గుమిగూడకుండా చూస్తున్నట్లు సీనియర్ పోలీస్ అధికారి నవదీప్‌సింగ్ తెలిపారు. అంతేకాకుండా శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా చూసేందుకు అవసరమైతే కాల్పులకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. పరిస్థితి చేయి దాటితే తుపాలకులను ఉపయోగించాల్సి వస్తుంది, ఆందోళనలను అడ్డుకునేందుకు కాల్పులు జరిపేందుకు అధికారులు తమకు అనుమతులు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. తీర్పు నేపథ్యంలో రోహ్‌తక్‌లో బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గుర్మీత్‌ను ఉంచిన జైలుకు 10కిలోమీటర్ల వరకూ భారీ బద్రతను ఏర్పాటు చేశారు. చట్టాన్ని అతిక్రమించి అల్లర్లకు పాల్పడితే ముందు వారిని హెచ్చరిస్తామని డిప్యూటీ కమిషనర్ అతుల్‌కుమార్ తెలిపారు. అయినప్పటికీ వినకపోతే వారు బుల్లెట్లను ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరించారు. అత్యవసరమైన పనులు ఉంటేనే తప్ప బయటివారు ఎవరూ జిల్లాలకు రావద్దని సూచించారు. అంతేకాకుండా రోహ్‌తక్‌కు వచ్చే వారు గుర్తింపు కార్డులను, స్పష్టమైన కారణాలను చెప్పాలని, లేదంటే వారిని కూడా అరెస్ట్ చేస్తామని అతుల్ తెలిపారు.

హర్యానా, పంజాబ్ సీఎంల అత్యవసర సమావేశం

లైంగిక వేధింపుల కేసులో డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రాం రహీం సింగ్‌లకు సీబీఐ ప్రత్యేక కోర్టు జైలు శిక్ష విధించడంతో హర్యానా, పంజాబ్ ముఖ్యమంత్రులు అప్రమత్తమయ్యారు. తీర్పు వెలువడిన వెంటనే చండీగఢ్‌లోని తన నివాసంలో హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను గూర్చి ఉన్నతాధికారులు, బీజేపీ నాయకులు, మంత్రులతో చర్చించారు. పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలిన, ఎలాంటి ఆందోళనలకు అవకాశం ఇవ్వరాదని ఖట్టర్ ఆదేశించారు. విధ ్వంసానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్‌సింగ్ కూడా పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తమ రాష్ట్రంలో పరిస్థితి అదుపులోఉందని, అవాంఛనీయ సంఘటనలను అదుపు చేసేందుకు భద్రతా దళాలు సిద్ధంగా ఉన్నాయని అమరీందర్‌సింగ్ తెలిపారు. గుర్మీత్‌కు కోర్టు విధించిన శిక్షను ప్రజలు ఆమోదించాలని, శాంతిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

దత్త కుమార్తెకు డేరా బాధ్యతలు!

డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రామ్ రహీం సింగ్‌కు సీబీఐ కోర్టు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పడంతో ఆయన దత్త కుమార్తె హనీప్రీత్ ఇన్సాన్‌కు సచ్చా సౌదా బాధ్యతలను స్వీకరించనుంది. దర్శకులు, ఎడిటర్, నటి అయిన



దత్తత కుమార్తె హనీప్రీత్‌తో డేరా బాబా

హనీప్రీత్ హర్యానాలోని ఫతేపూర్ సొంత ప్రాంతం. 1999లో హనీప్రీత్ డేరా అనుచరుడు విశ్వాస్ గుప్తాను వివాహం చేసుకుంది. అయితే తనని అత్తింటివారు హింసిస్తున్నారంటూ గుర్మీత్ సాయం కోరడంతో ఆయన హనీని 2009లో కూతురిగా దత్తత తీసుకున్నారు. తాను నటించే సినిమాల్లోనూ హనీకి అవకాశాలు ఇచ్చేవారు. ఇప్పుడు గుర్మీత్‌కు శిక్ష పడడంతో డేరాకు సంబంధించిన వ్యాపారాలన్నిటినీ హనీనే యజమానిగా వ్యవహరించే అవకాశాలు ఉన్నట్లు డేరా ప్రతినిధులు చెబుతున్నారు. అయితే జైలులో తనతోపాటు తన కుమార్తె హనీప్రీత్ ఇన్సాన్ కూడా ఉండాలని ఇప్పటికే గుర్మీత్ పిటీషన్ వేశారు. ఇద్దరం ఒకే జైలులో ఉండాలనుకుంటున్నట్లు గుర్మీత్ తన పిటీషన్‌లో పేర్కొన్నారు. ఇందుకు సీబీఐ న్యాయస్థానం ఒప్పుకోలేదు. ఆ విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని, తాము మాత్రం కలుగచేసుకోమని సీబీఐ కోర్టు తేల్చిచెప్పింది గుర్మీత్‌కు నడుం నొప్పి, మైగ్రేన్ ఉందని ఆయనకి తరచూ ఆక్యుప్రెజర్ చేస్తుండాలని హనీప్రీత్ న్యాయస్థానాన్ని కోరింది. ఇందుకు కోర్టు ఎంత మాత్రం అంగీకరించ లేదు. ఈనేపథ్యంలో డేరా బాధ్యతలు చేపట్టే వీలుందని బాబా అనుచరులు భావిస్తున్నారు.

పంటల బీమాపై సమన్వయ కమిటీ

≫ డిసెంబర్ 30వ తేదీని, మొక్కజొన్న, మామిడికి డిసెంబర్ 15వ తేదీని బీమా చేసేందుకు చివరి తేదీగా నిర్ణయించారు. 2016-17 రబీ సీజనులో నిర్ణయించినట్లుగా పంట నష్టంలో 80 శాతం చొప్పున పరిహారం వర్తింప చేయాలి. అదేవిధంగా ప్రస్తుత ఖరీఫ సీజనులో రాష్ట్రంలోని అన్ని జిల్లాలను ఆరు క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. క్లస్టర్ 1కింద ఆదిలాబాద్, మంచిర్యాల, కొమరంభీం, జయశంకర్ సిద్ధిపేట్, క్లస్టర్2 కింద నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి, రంగారెడ్డి, క్లస్టర్ 3 కింద పెదపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిశిల్లా, జనగామ, క్లస్టర్ 4 కింద ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట్, సంగారెడ్డి, మెదక్, క్లస్టర్ 5 కింద భద్రాద్రి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, వనపర్తి, క్లస్టర్ 6 కింద మేడిచర్ల, మహబూబ్‌నగర్, జోగులాంబ, వికారాబాద్, మహబూబాబాద్ జిల్లాలుగా విభజించారు. ప్రస్తుత ఖరీఫ్, రబీ సీజన్లలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ణయించే అధికారాన్ని తెలంగాణ రాష్ట్ర ఆప్కాబ్‌కు అప్పగించారు. దిగుబడి, నాణ్యత తదితర వాటి ఆధారంగా పంట కోత సమయాన్ని నిర్ధారించనున్నారు.

రెండు నుండి వెయ్యి హెక్టార్ల చొప్పున మండల్, లేక మండల గ్రూపుల వారీగా బీమా యూనిట్‌ను వర్తింప చేయనున్నారు. బీమాకు సంబంధించిన వివరాల డేటాను సంబంధిత కంపెనీలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఎం జగన్మోహన్‌తోపాటు, వ్యవసాయ బీమా కంపెనీల ప్రతినిధులు, ఎస్ఎల్‌బిసి, ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, ఇన్సూరెన్స్ భాగస్వాములు పాల్గొన్నారు.

దేశానికే తెలంగాణ రోల్ మోడల్

≫ అన్నారు. ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్, రాయపట్నం, గ్రామాల్లో రూ. 32.2 కోట్ల నిధులతో నిర్మించిన లిఫ్ ్టలను సోమవారం ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, పెద్దపెల్లి ఎంపి బాలుక సుమన్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం రాయపట్నం గోదావరి నది ఒడ్డున రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లంపెల్లి నిండు కుండగా ఉంటుందని దానితో గోదావరి తీరంపై నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్లతో రైతుల సమస్యలు తీరుతాయని అన్నారు. రాయపట్నం బ్రిడ్జ పూర్తిచేయడంతో 21 టిఎంసి నీటిని నిర్వ ఉంచే అవకాశం లభించిందని దానితో రైతులకు పుష్కలంగా నీటిని అందజేసే అవకాశం ఉందని కాలేశ్వరంతో ఎల్లంపెల్లికి లింక్ చేయడంతో నిండుకుండగా ఉంటుందని అన్నారు. అలాగే మిడ్‌మానేరు పూర్తిచేయడంతో మానకొండూర్, ఉస్నాబాద్, నియోజక వర్గాల రైతులకు నీరు అందుతుందని ఎల్లంపెల్లితో వేములవాడ, చొప్పదండి, మెట్‌పెల్లి నియోజక వర్గంలోని 1.60లక్షల ఎకరాలకు నీరు అందించే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. గత 50 ఏళ్ళ నుండి రోళ్లవాగును గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రోళ్ళవాగు ఆధునీకరణకోసం 60 కోట్లకు పైగా నిధులు కేటాయించి ఇటీవలన పనులు సైతం ప్రారంభిం చడం జరిగిందని అన్నారు. కాళేశ్వరం నుండి ఎస్ఆర్ఎస్పీని నింపడానికి రూ. 1000కోట్లతో ముఖ్యమంత్రి ఇటీవల చేపట్టిన బృహత్తర పథకం ఎంతో మంది రైతులకు లబ్దిచేకూరుతుందని ఎస్ఆర్ఎస్పీని నీటితో నింపడానికి వరద కాలువ కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్ని ఎంచుకుంటే 40వేల కోట్లు అయ్యేవని కేవలం వేయి కోట్లతోనే ఇది సాధ్యం కానుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒకవైపు రైతులకు సాగునీరు అందిస్తున్న ప్రయత్నంతోనే మరోవైపు టూరిజం మత్స్య సంపద అభివృద్ధి కోసం ప్రయత్నిస్తుందని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రాజెక్టు పనులపై వారికి చిత్తశుద్ధిలేదని గతంలో మంథెని నియోజకవర్గానికి నీరు ఇచ్చే కాలేశ్వరానికి అటవీ అనుమతి లభించలేదని ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్టుకు పరియావరణ శాఖ నుండి అనుమతి లభించలేదని మిడ్ మానేరుకు 9 ఏళ్ళ సమయం తీసుకొని కేవలం 106 కోట్లు వెచ్చించి పనులు మధ్యలోనే ఆపివేసారని విమరి ్శంచారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిర్లక్ష్యం చేసి వదిలివేసిన ప్రాజెక్టు పనులను టిఆర్ఎస్ ప్రభుత్వం ఒక బాధ్యతతో వాటిని పూర్తిచేయడానికి కృషిచేస్తుందని అన్నారు. ప్రస్తుత కాళేశ్వరం ప్రాజెక్టు పనులు శరవేగంగా నడవడంతో ఆంధ్రాకు చెందిన ఇంజనీర్లు హాశ్చర్యం వ్యక్తం చేస్తూ కాళేశ్వరానికి వచ్చి నిర్మాణ పనులు చూసి వెలుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఐడిసి చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వారం - వర్జ్యం

29-8-2017 మంగళవారం

హేవళంబి నామ సంవత్సరం,
దక్షిణాయనం, భాద్రపదమాసం, శుక్లపక్షం
అష్టమి రా. 2.10
అనూరాధ రా. 11.45
రా. ప. 3.00-4.30
వ. లేదు

మరి మాకేం దిక్కు?

≫ గట్టిగా అడ్డుకున్నారనీ ప్రచారం జరుగుతోంది. ఈదశలో సీట్ల పెరిగితే తమకు ఏదో నియోజకవర్గం నుంటి టికెట్ వస్తుందని ఆశపడిన సీనియర్ నేతలందరి నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్లయింది.

2014 శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో 63 ఎమ్మెల్యే సీట్లను గెలిచిన టిఆర్ఎస్అధికారం చేపట్టింది. అయితే భవిష్యత్‌లో ఎలాంటి రాజకీయ ముప్పు ఏర్పడకుండా సంఖ్య బలాన్ని పెంచుకునేందుకు అనంతర పరిణామాల్లో ఇతర పార్టీల్లోని ఎమ్మెల్యేలకు, ఎంపీలకు ఆకర్షమంత్రాన్ని ప్రయోగించి విజయవంతమైంది. కాంగ్రెస్ నుండి గెలిచిన 21 మంది ఎమ్మెల్యేల్లో..ఆరుగురు..టిడిపి నుంచి గెలిచిన 15 మంది ఎమ్మెల్యేల్లో 12 మంది, వైఎస్సార్సీ నుంచి గెలిచిన ముగ్గురు ఎమ్యేల్యేలు, బిఎస్‌పి నుంచి ఇద్దరు, సిపిఐ నుంచి ఒకరు ఇలా మొత్తం తన సంఖ్యా బలాన్ని 80 ప్లస్‌కు చేర్చుకుని ఎలాంటి ఢోకా లేకుండా టిఆర్ఎస్ అ గ్రనాయకత్వం చేసుకుంది. ఇప్పటికే దాదాపు మూడున్నర ఏళ్ల పాలన ముగించిన ఆపార్టీ..మిగిలిన ఏడాడిదిన్నర ఇంకా ముమ్మరంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు చేరువ అయ్యేందుకు ముమ్మర ప్రయత్నాలను మొదలుపెట్టింది. మరోవైపు ఎప్పటికప్పుడు తెలంగాణ ప్రాంతంలో సరే ్వలు చేసుకుని పార్టీ, ప్రభుత్వ పనితీరుపై సమీక్షలు చేసుకుంటుంది. ఇప్పటికే మూడు సర్వేలు చేయించిన పార్టీ అధినేత టిఆర్ఎస్ హవానే ఉన్నట్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ దశలో సిట్టింగ్‌లకే మళ్లీ అవకాశమంటూ సిఎం నుంచి ప్రకటన రావడంతో వారికి రెట్టింపు ఉత్సాహం పెరిగి నియోజకవర్గాల్లో చురగ్గా తిరుగుతున్నారు. ప్రభుత్వం తరుపున పథకాలను, ఆయా సంక్షేమ పథకాల చెక్కులను ఇంటింటికెళ్లి పంపిణీ చేస్తే తమ ఆదరణను పెంచుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇంకొపక్క భూసర్వే రికార్డుల మార్పు ప్రక్రియ కోసం ఎమె ్మల్యేలంతా డిసెంబర్ చివరి వరకు వారి వారి సొంత నియోజక వర్గాల్లోనే మకాంవేసి ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలకు హాజరై.. రైతులు..ప్రజలతో మరింతగా సాన్నిహిత్యంగా ఉండేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సిట్టింగ్‌లకే మళ్లీ అవకాశం ఇస్తామని సిఎం ప్రకటన చేయడతో ఫిరాయింపుదారులు..ఆశావాహులు ఇతర పార్టీల నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం మాత్రం ప్రస్తుతం పార్టీలో జోరుగా సాగుతోంది ఇంకా సార్వ త్రిక ఎన్నికలకు ఏడాదిన్నర సమయం ఉన్నా కూడా ఇప్పటి నుంచే టిఆర్ఎస్‌లోని ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలు మళ్లి కాంగ్రెస్, టిడిపి, బిజెపి పార్టీల నేతలతో రహస్యంగా సంప్రదింపులు జరుపుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మరో ఏడాది వరకు అధికార టిఆర్ఎస్‌లోనే ఉంటూపదవులను పొందటం..పొందినవారు వాటిని సద్వినియోగం చేసుకోవాలనే యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఎన్నికలకు రెండు, మూడు నెలల ముందు అప్పటి రాజకీయ పరిస్థితిని బట్టి..జంప్‌లను చేయడానికి సిద్దపడుతున్నారు. ఈదశలో టిఆర్ఎస్‌లోని అసంతృప్తులకు గాలం వేసే పనిలోని ఆయా ప్రధాన ప్రతిపక్ష పార్టీల్లో నేతలు కూడా పడిపోయారు.

తెలంగాణ పోలీసుశాఖలో పదోన్నతుల వివాదానికి తెర

- డిఎస్పీ ప్రమోషన్లలో 1995 బ్యాచ్ అధికారులకు నిరాశ
- నాన్ కేడర్ ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డిఎస్పీల ప్రమోషన్లకు సర్కారు అంగీకారం

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: తెలంగాణ పోలీసుశాఖలో పదోన్నతుల వివాదానికి సర్కారు ఎట్టకేలకు తెరదించింది. పెద్ద సంఖ్యలో ఖాళీగావున్న నాన్ కేడర్ ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డిఎస్‌పిల పోస్టులను భర్తీచేసేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో దీనిపై హోం శాఖ కసరత్తులు చేపట్టి సర్కారుకు ఒక నివేదిక ఇచ్చినట్లు సమాచారం. హోంశాఖ నివేదికకు సర్కారు ఆమోదం చెప్పిందని తెలిసింది. మరోవైపు ఈ ప్రమోషన్లలో 1995 బ్యాచ్ అధికారులకు నిరాశ ఎదురవడం గమనార్హం. డిఎస్‌పి పదోన్నతుల్లో ఈ బ్యాచ్ అధికారులను ఇప్పుడు పరిగణలోకి తీసుకోరాదని హోం శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పోలీసుశాఖలో మరోసారి భారీఎత్తున పదోన్నతులు ఇచ్చేందుకు సర్కారు రెడీ అయ్యింది. ప్రస్తుతం 50కి పైగా నాన్‌కేడర్ ఎస్పీ, అదనపు ఎస్పీ పోస్టులతోపాటు 186 డిఎస్పీ పోస్టులు ఖాళీగావున్నాయి. ఇందులో నాన్‌కేడర్ ఎస్పీ, అదనపు ఎస్పీ పోస్టులకు 1985, 1989 బ్యాచ్ అధికారులు అర్హులు. ఈ రెండు బ్యాచ్‌లలో నాన్‌కేడర్ ఎస్పీ, అదనపు ఎస్పీ పోస్టులకు అర్హులైన అధికారుల పేర్లను హోంశాఖ రెండు నెలలక్రితమే ఖరారు చేసినప్పటికీ అనేక కారణాలవల్ల ఇది ఆగిపోయింది. నాన్‌కేడర్ ఎస్పీ పదోన్నతుల విషయంలో 1985, 1989 బ్యాచ్ డైరక్ట్ రిక్రూటీ ఎస్ఐలు 2007 గ్రూప్ వన్ డిఎస్‌పిల మ ధ్య వివాదం ఏర్పడడం ఒక కారణం. నాన్ కేడర్ ఎస్పీ పోస్టుల్లో మెజారిటీ పోస్టులు తమకే కావాలని 2007 గ్రూప్ వన్ డిఎస్‌పిలు కోరడం, దీనికి 1985, 1989 బ్యాచ్ డైరక్ట్ రిక్రూటీ ఎస్ఐలు ససేమిరా అనడంతో ఇంతకాలం స్తబ్దత నెలకొంది. ఇక అదనపు ఎస్పీ పోస్టుల విషయంలో 2011 గ్రూప్ వన్ డిఎస్‌పిలు 1989 బ్యాచ్ డైరక్ట్ రిక్రూటీ ఎస్ఐల మధ్య మరో వివాదం తలెత్తడంతో ఈ పదోన్నతులు కూడా ఆగిపోయాయి. ఇక డిఎస్‌పిల పదోన్నతుల వివాదం మం రకంగా వుండడం గమనార్హం. మొత్తం 186 డిఎస్‌పి పోస్టులు ఖాళీగావుండగా ఇందులో 106 మంది 1991 బ్యాచ్ అధికారులు వున్నారు. అయితే మిగతాపోస్టుల్లో వీరి తరువాత బ్యాచ్ అయిన 1995 అధికారులకు కేటాయించేందుకు రెండు నెలలక్రితం హోంశాఖ సిద్ధమయ్యింది. ఈ విషయమై 1991, 1995 బ్యాచ్ అధికారుల మధ్య ఒక అంగీకారం కూడా కుదిరింది. హోంశాఖ ఈ రెండు బ్యాచ్‌ల అధికారుల మధ్య రాజీకుదిర్చింది. అయితే ఇదే సమయంలో కొందరు యాక్సిలేటర్ ప్రమోటీలు కూడా ఈ పో స్టులకు పోటీ పడడంతో వివాదం ఏర్పడింది. ఇదే సమయంలో పది రోజులక్రితం 1991 బ్యాచ్ అధికారులు సచివాలయానికి వచ్చి చీఫ్ సెక్రటరీ ఎస్‌పి సింగ్‌ను కలిసి పదోన్నతుల విషయంలో తమకు న్యాయం చేయాలని కోరడంతోపాటు మౌనంగా నిరసనకుదిగి సంచలనం రేపారు. వంద మంది వరకు 1991 బ్యాచ్ అధికారు లు సచివాలయంలో చీఫ్ సెక్రటరీ ఛాంబర్ బయట నిరసనకు దిగడం పోలీసు శాఖలో కలకలం రేపింది. తమకు పదోన్నతులు ఇచ్చే విషయంలో ఇక ఎంతమాత్రం ఆ లస్యం చేసినా తామంతా సామూహిక సెలవులపై వెళతామని సర్కారుకు అల్టిమేటం ఇచ్చారు. ఇలా పోలీసు శాఖలో వివిధ కేడర్‌ల పదోన్నతుల విషయంలో ఏర్పడ్డ ప్రతిష్టంభనపై హోంశాఖ అన్ని కోణాల్లో విచారించి చివరకు ప్రమోషన్లు ఇచ్చేందుకు నిర్ణయించింది. ఇందులో మొదట నాన్‌కేడర్ ఎస్పీలు, అదనపు ఎస్పీ పోస్టులను నిబంధనల మేరకు గ్రూప్‌వన్ అధికారులు, డైరక్ట్ రిక్రూటీల మధ్య వివాదానికి తావులేకుండా వుండేలా భర్తీ చేసేందుకు హోంశాఖ నిర్ణయించింది. దీని తరువాత కీలకమైన డిఎస్‌పి పోస్టుల భర్తీపైనా హోంశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పోస్టులభర్తీలో మొదట 1991 బ్యాచ్ అధికారులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఈ బ్యాచ్‌కు చెందిన అధికారులు తెలంగాణలో మొత్తం మీద 106 మంది వరకు వున్నారు. వీరికి మొదట డిఎస్‌పిలుగా నియమించిన తరువాత మిగతా ఖాళీలను మూడు నెలల వ్యవధి తరువాత 1995 బ్యాచ్ అధికారుల చేత భర్తీ చేయాలని హోంశాఖ నిర్ణయించింది. దీనిపై హోంశాఖ సర్కారుకు తన నిర్ణయాన్ని తెలపగా ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. దీనిపై రెండు మూడు రోజుల్లో ఆదేశాలు వచ్చే అవకాశాలున్నాయి.

1995 బ్యాచ్ అధికారులకు నిరాశ
కోర్టుకు వెళ్లే ఆలోచనలో కొందరు అధికారులు

ఇదిలావుండగా డిఎస్‌పిల ఖాళీలభర్తీలో 1995 బ్యాచ్ అధికారులకు నిరాశ తప్పలేదు. రెండు నెలలక్రితం హోంశాఖ పేషీ అధికారులు మొత్తం ఖాళీలను ఒకేసారి భర్తీచేస్తామని, ఇందులో తమకు కూడా న్యాయంచేస్తామని హామీ ఇచ్చారని, తీరాఇప్పుడు ఇలాచేయడం ఎంత మాత్రం సరిగ్గా లేదని 1995 బ్యాచ్ అధికారులు వాపోతున్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత 2014లో ఒకసారి డిఎస్‌పిల పోస్టులకు ప్రమోషన్లు ఇచ్చారని మళ్లీ మూడేళ్లకు ఇప్పుడు ఇస్తున్నారని వారు తెలిపారు. ఇప్పుడు ఇచ్చే పదోన్నతుల తరువాత మరోసారి ప్రమోషన్లు రావాలంటే మళ్లీ రెండు లేదా మూడేళ్లు ఆగాల్సి ఉంటుందని, ఇది కచ్చితంగా తమకు అన్యాయం చేసేదేనని వారు వాపోయారు. ఈ విషయమై హోంశాఖ అధికారులు పునరాలోచించాలని వారు కోరుతున్నారు. హోంశాఖ నిర్ణయంపై ఈ బ్యాచ్‌కు చెందిన కొందరు అధికారులు ఆగ్రహంతో ఉన్నారు. హోంశాఖ తన నిర్ణయాన్ని తిరిగి పరిశీలించి తమకు కూడా న్యాయం చేయనిపక్షంలో వారు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఇదే జరిగితే మొత్తం పదోన్నతుల ప్రక్రియ ఇబ్బందుల్లోపడే అవకాశాలున్నాయి.

సమీకృత మత్స్య అభివృద్ధి: మంత్రి తలసాని



సోమవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, అగస్టు 28, ప్రభాతవార్త: తెలంగాణలో మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని ఆ శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. ఇందుకు రాష్ట్రంలో సమీకృత మత్స్య అభివృద్ధి పథకాన్ని అమలుచేయనున్నట్లు ఆయన తెలిపారు. సచివాలయం సి బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సమీకృత మత్స్య అభివృద్ధి పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య (టిఎస్‌సిఒఎఫ్) ద్వారా 2017-18, 2018-19 సంవత్సరాల్లో వెయ్యి కోట్ల రూపాయల ప్రణాళికతో అమలు చేస్తామన్నారు. ప్రధానంగా మత్స్య విత్తన అభివృద్ధి, మత్స్య సంపద అభివృద్ధి, చేపల వేట పరికరాలు, మార్కెటింగ్ సదుపాయాలు, వినూత్న కార్యక్రమాలు, మౌళిక సదుపాయాల అభివృద్ధి, శిక్షణ, క్షేత్ర సందర్శనలను ఏర్పాటుచేస్తామని వివరించారు. సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద జిల్లా సహకార సంఘాలు, ప్రాథమిక మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు, అందులోని వ్యక్తిగతసభ్యులు, సభ్యులతో ఏర్పాటైన గ్రూపులు లబ్దిపొందేందుకు అర్హులని ఆయన తెలిపారు. ఇందుకుగాను మత్స్య పారిశ్రామ ఇక సహకార సంఘం అధ్యక్షులకు వర్క్‌షాప్‌ను నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. మత్స్యశాఖలో ఖాళీగా ఉన్న వాటిలో 214 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఇందులో తొమ్మిది పోస్టులు డైరక్ట్ రిక్రూట్‌మెంట్‌ద్వారా, 189 పోస్టులు కాంట్రాక్టు పద్ధతిన, మరో 16 పోస్టులు ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీచేయనున్నట్లు ఆయన చెప్పారు. 2017-18 సంవత్సరంలో రాష్ట్రంలోని 77 జలాశయాలు, 4,647 మత్స్యశాఖ చెరువులు, 20,391 గ్రామ పంచాయితీ కుంటలకు ఉచితంగా 69 కోట్ల 66 లక్షల చేప పిల్లలను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ ప్రొక్యూర్‌మెంట్‌ద్వారా టెండర్లు పిలిచి చేపపిల్లల కొనుగోలు ధరలను నిర్ణయించామన్నారు. గత ఏడాది రాష్ట్రంలోని 3,939 జలాశయాలు, చెరువుల్లో 22 కోట్ల రూపాయలు ఖర్చుచేసి 27 కోట్ల చేప పిల్లలను విడుదల చేసినట్లు తెలియచేశారు. ఆరు నుండి ఎనిమిది మాసాల వరకూ నీరు నిల్వ ఉండే చెరువులకు చేప పిల్లల పంపిణీలో మొదటి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. పంపిణీ చేయబడిన చేప పిల్లల నాణ్యతా ప్రమాణాలు, పరిమాణం విషయాల్లో టెండర్‌లో ఇవ్వబడిన ప్రకారం లేకుంటే వెంటనే తిరస్కరిస్తామన్నారు. చేప పిల్లలను లెక్కించేందుకు బెల్జియం దేశం నుండి యంత్రాన్ని కొనుగోలుచేసి దిగుమతి చేసుకునేందుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి వివరించారు.

రైతులకోసం పైలట్ ప్రాజెక్టు

ఆధునిక సేద్యంపై రైతుకు అవగాహన: వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి రాజశేఖర్



సోమవారం విజయవాడలో రైతులకోసం నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రాజశేఖర్

హైదరాబాద్, అగస్టు 28, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లోని రైతులకోసం పైలట్ ప్రాజెక్టును చేపట్టినట్లు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ వెల్లడించారు. ఇందులోభాగంగా ఆధునిక సేద్యంపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. విజయవాడలోని ఒక హోటల్‌లో ఇక్రిశాట్ ఆధ్వర్యంలో సోమవారం రైతులకోసం రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిధిగా పాల్గొన్న రాజశేఖర్ మాట్లాడుతూ ఆధునిక యాంత్రిక పద్ధతులను ఉపయోగించి రైతు వ్యయాన్ని తగ్గించి, ఉత్పత్తినిపెంచి ఏవిధంగా లాభాలను ఆర్జించవచ్చునో తెలియచెప్పాల్సి ఉందన్నారు. అప్పుడే రైతు సంతోషంగా వ్యవసాయాన్ని చేయగలుగుతారని తెలిపారు. రైతులకోసం పైలట్ ప్రాజెక్టును ఇక్రిశాట్ రాష్ట్రంలోని వివిధ గ్రామాలు, జిల్లాల్లో చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో జరిగిన టెస్ట్ ప్రాక్టీస్‌ను వేరే ప్రాంతాల్లో ఏవిధంగా అవలంబించాలనే విషయాలపై చర్చించినట్లు ఆయన చెప్పారు. ముఖ్యంగా పైలట్ ప్రాజజెక్టులో వివిధ పంటల వంగడాలు, ప్రత్యామ్నాయ పంటల వివరాలు, ఆధునిక యంత్రాలను ఉపయోగించే విధానాలను, పద్ధతులను రైతులకు వివరించడంతోపాటు, వాటిని అమలుచేసినట్లు తెలియచేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఉన్న మండలాలు, గ్రామాల్లో పలువురు రైతులను ఈ పైలట్ ప్రాజెక్టుకింద ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. ఇటువంటి వర్క్‌షాప్‌ల్లో చర్చించిన విషయాలను సక్రమంగా అమలు చేసినప్పుడే రైతులకు మేలు జరుగుతుందన్నారు. వ్యవసాయశాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్ మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని వివిధ టెస్ట్ పద్ధతులను అవలంభించి లాభాలను ఆర్జించేవిధంగా చేసేందుకు రైతులకోసం చేపట్టిన పైలట్ ప్రాజెక్టు ఏవిధంగా మార్గదర్శకంగా నిలుస్తుందో అనే విషయాలను గూర్చి ఈ వర్క్‌షాప్‌లో చర్చి జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రాల్లో వరదలు, కరవులను తట్టుకునే ధంగా వివిధరకాల పంట పద్ధతులను గూర్చి చర్చిస్తారని తెలిపారు. అంతేకాకుండా ఏవిత్తనాలను ఉపయోగిస్తే దిగుబడి పెంచవచ్చునో అనే అంశాలను చర్చకు వస్తాయన్నారు. వీటితోపాటు ముఖ్యంగా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు అనుసరించాల్సిన బెస్ట్ మెకనైజేషన్, మంచినీటి నిర్వహణ పద్ధతులు, భూసారాన్నిపెంచే విధానాలను గూర్చి వర్క్‌షాప్‌లో కూలంకుషంగా చర్చిస్తారని తెలిపారు. కాలానికి అనుగుణంగా భూమి పద్ధతులను దృష్టిలో ఉంచుకుని సరైన విత్తనాలను వేసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడంవల్ల రైతులకు పెట్టుబడి వ్యవయం తగ్గడంతోపాటు, దిగుబడి పెరిగే వీలుందని చెప్పారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతులు అవలంభించి ఖర్చులను తగ్గించుకోవాలని రైతులకు కమిషనర్ సూచించారు. ఇక్రిశాట్ సమన్వయ అధికారి డాక్టర్ సుహాస్ పి.వాణి మాట్లాడుతూ ప్రాథమిక సెక్టార్ మిషన్‌లో భాగంగా రైతులకోసం ప్రాజెక్టులో వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానవనం, మత్స్య, వాటర్ షెడ్‌లు సహకారంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ దీన్ని నిర్వహిస్తామన్నారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్రంలోని ఒక్కొక్క జిల్లాలో 10 వేల హెక్టార్లను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుకింద ఉత్తమ నీటి విధానాలు, సాయిల్ హెల్త్ మ్యాపింగ్, లోకాస్ట్ మెకనైజేషన్స్, ష్రెడ్డింగ్ చేయడం తదితర వాటిని చేపడుతున్నామని తెలిపారు. అంతకుముందు టెస్ట్ ప్రాక్టీస్‌లో వచ్చిన ఫలితాలను గూర్చి ఇక్రిశాట్ ఒక పుస్తక రూపంలో తీసుకురాగా, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి రాజశేఖర్ దాన్ని ఆవిష్కరించారు. ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల వ్యవసాయశాఖ జెడిలు, ఇక్రిశాట్ కో-ఆర్డినేటర్లు, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, హార్టీకల్చర్ విశ్వవిద్యాలయానికి చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో భద్రత, పరిశుభ్రతకు పెద్దపీట

దక్షిణ మధ్య రైల్వే అదనపు జిఎం జాన్ థామస్

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: దక్షిణ మధ్య రైల్వేలో భద్రతతోపాటు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్ తెలిపారు. ప్రస్తుత వర్షాకాలానికి అనుగుణంగా భద్రత విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరిపి నివారణకు తక్షణచర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో రైల్వే ఉన్నతాధికారులతోపాటు జోన్ పరిధిలోని ఆరు డివిజన్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైల్వే స్టేషన్లతోపాటు రైళ్ళల్లో పరిశుభ్రత అంశానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీనలు జరపాలని డివిజనల్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీనల్లో రైల్వే ఉన్నతాధికారులు కూడా పాల్గొనాలని తెలిపారు. తమ పరిధిలో పరిశుభ్రతను పాటించని వారిపై తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు శు భ్రతకు అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. భద్ర త విషయంలోనూ క్షేత్రస్థాయి పరిశీనలు జరపాలన్నారు. సిగ్నల్, లాకో ఫెయిల్యూర్‌లతోపాటు ఇతర ప్రమాదకర పరిస్థితులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతకు సంబంధించిన అంశంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని పాటించవద్దన్నారు. రైల్వే ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వే ఉద్యోగులు, సిబ్బందితోపాటు అర్హత కలిగిన వారికి సరైన వైద్యసేవలు అందించాలన్నారు. అందరికీ అవసరమైనప మందులనుకూడా సరఫరా చేయాలని సూచించారు. ఇందులో అలసత్వాన్ని ప్రదర్శించరాదన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు పద్మిని రాధాకృష్ణన్, ఎం.జి.గుణశేఖరన్, ఎ.ఎ.ఫాడ్కే, డి.కె.సింగ్, ఎస్.వి,రమణరెడ్డి, కె.హెచ్.కె.దొర పాల్గొన్నారు.

నంద్యాల ఉప ఎన్నికతో ఖంగుతిన్న కాంగ్రెస్

- కాంగ్రెస్ ఉనికికే ప్రమాదం, గత ఎన్నికలకంటే తగ్గిన ఓట్లు - అబ్దుల ఖాదర్‌కు వచ్చింది కేవలం 1,382 ఓట్లు

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: నంద్యాల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యల్పంగా ఓట్లు రావడంతో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఉనికికే ప్రమాదంగా మారింది. నంద్యాల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగిన అబ్దుల్ ఖాదర్‌కు కేవలం 1382 ఓట్లు మాత్రమే రావడంతో పార్టీ ఇప్పటల్లో కోలుకోలేని పరిస్థితిని స్పష్టం చేస్తోంది.

2014 సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క సీటు రాకుండా తుడుచుకుపెట్టుకుపోయిన కాంగ్రెస్ పార్టీ నంద్యాల ఉప ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వాలని తీవ్రంగా ప్రయత్నించింది. అయినప్పటికీ ఆపార్టీకి నంద్యాల ఓటర్లు కోలుకోలేని షాక్ ఇచ్చారు. రాష్ట్ర విభజన అనంతరం జరిగిన 2014 ఎన్నికల్లో దారుణంగా ఓటమి చవిచూసిన కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎమ్మెల్యే, ఎంపి సీటును కూడా గెలుచుకోలేక పోయింది. అయితే గత ఎన్నికల్లో ఇదే నంద్యాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన రాకేష్‌రెడ్డికి కేవలం 2459ఓట్లు మాత్రమే వచ్చాయి. కాగా తాజా ఉప ఎన్నిక ఫలితాల్లో కాంగ్రెస్‌కు 1382ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే దాదాపు సగానికి పడిపోయింది. దీంతో కాంగ్రెస్ పార్టీకి ఎపిలో పుంజుకుంటుందని భావించిన ఆపార్టీ నేతల ఆశలు గల్లంతైయ్యాయి. నంద్యాల ఉప ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ నేతలు రాకపోయినా ఎపిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి, స్థానిక సీనియర్ నేతలతో ప్రచారం నిర్వహించినా ఫలితం లేకుండ ఆపోయింది. ప్రధానంగా నంద్యాలలో అత్యధిక జనాభా కలిగిన ముస్లీం సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి అదే సామాజిక వర్గానికి చెందిన అబ్దుల్ ఖాదర్‌ను రంగంలోకి దించింది. అయినప్పటికీ ఆ సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీపై కనికరం చూపకపోవడంతో కేవలం 1382ఓట్లకు మాత్రమే పరిమితం కావాల్సి న దుస్థితి ఏర్పడింది. ఒకప్పుడు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మారింది. ఇదే నియోజవర్గం నుంచి గెలిచిన శిల్పా మోహన్‌రెడ్డి ఆయన మంత్రివర్గంలో మంత్రిగా పని చేశారు. అయితే గత 2009 ఎన్నికల్లో ఆయన 67430 ఓట్లు సాధించి 46శాతం ఓట్లుతో గెలుపొందారు. గత 2004ఎన్నికల్లోనూ శిల్పామోహన్‌రెడ్డి 89612ఓట్లు అంటే 66శాతంకు పైగా ఓట్లు సాధించి కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అలాంటి నేపథ్యం ఉన్న కాంగ్రెస్ పార్టీకి నేడు కనీసం రెండువేల ఓట్లు మించకపోవడం ఆపార్టీ ఘోర పరాభవాన్ని స్పష్టం చేస్తోంది. దీంతో కాంగ్రెస్ పార్టీ ఇక్కడ గెలవడం సమీప భవిష్యత్తులో కనిపించడం లేదనేది నిర్వివాదాంశం.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి: సురవరం

హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 28, ప్రభాతవార్త: సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉధృతంగా ఉద్యమాలు కొనసాగించాలని, 17 సంవత్సరాలక్రితం కొనసాగిన విద్యుత్ ఉద్యమం స్ఫూర్తిని నింపిందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి చెప్పారు. ప్రపంచబ్యాకు సామ్రాజ్యవాద విధానాలు ప్రజలపై బలవంతంగా ప్రభుత్వాలు రుద్దుతున్నాయని ఆయన ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ ఉద్యమం కొనసాగి 17 సంవత్సరాల అయిన సందర్భంగా సోమవారం బషీర్‌బాగ్‌లో విద్యుత్ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా శ్రద్ధాంజలి ఘటించిన తరువాత ఆయన ప్రసంగించారు. నాడు విద్యుత్ ఉద్యమం కొనసాగిందని, ఈ ఉద్యమం ఇంకా ముగియలేదని, విద్యుత్ ఉద్యమంతో ఎన్.చంద్రబాబునాయుడు ప్రభుత్వం పతనం ప్రారంభమైందని, విద్యుత్ ఉద్యమ అమర వీరుల స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య హక్కులు, పౌరహక్కులను నిరాకరించాయని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన సూచించారు. సిపిఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు ప్రసంగిస్తూ నాటి విద్యుత్ ఉద్యమం పోరాట ఫలితంగా ఛార్జీలు పెరగకుండా నిరోధించామని, కాని ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలపై పాలకులు భారం మోపుతున్నారని ఆరోపించారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటుపరం చేయాలని నీతి అయోగ్ పేర్కొందని, దీని ఫలితంగా విద్యుత్ సంస్థలు కార్పోరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు విధానాలకు వ్యతిరేకంగా పోరు కొనసాగించాలని, విద్యుత్ ఉద్యమం ప్రజల్లో ఉత్తేజాన్ని నింపిందని ప్రజలపై భారంమోపితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర నాయకురాలు పశ్య పద్మ, సీతారాములు (సిపిఎం), వి.సంధ్య, గోవర్ధన్, ఝాన్సీ (సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), బండా సురేందర్‌రెడ్డి (పార్వర్డ్ బ్లాక్), సిహెచ్ మురహరి (ఎస్‌యు సిఐ), తాంద్ర కుమార్ (ఎంసిపిఐ), గుర్రం విజయ్‌కుమార్ (సిపిఐ లిబరేషన్), జానికిరాములు (ఆర్ఎస్‌పి) తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పిసిసి ఘనంగా నివాళులు

బషీర్‌బాగ్‌లోని విద్యుత్ ఉద్యమం అమరవీరుల స్మారక స్థూపం వద్ద తెలంగాణ పిసిసి నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. అర్పించిన వారిలో తెలంగాణ పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి వినోద్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శారద, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్, పిసిసి లింగ్విస్టిక్ మైనారిటీ సెల్ ఛైర్మన్ ఠాకూర్ హృదయనాథ్ సింగ్ తదితరులున్నారు.

65 వేల కోట్ల జిఎస్‌టి రిటర్నులు దాఖలు

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: జిఎస్‌టి పన్ను వ్యవస్థ మొదలైన తరువాత 36 లక్షల మంది వ్యాపారులు ఇప్పటి వరకు పన్ను రిటర్నులను దాఖలు చేసినట్లు సంబందిత శాఖ అధికారులు వెల్లడించారు.ఇంకా కొన్ని ఫైలింగ్స్‌కు పెండింగ్‌లో ఉన్నాయి.దీంతో ఖచ్చితమైన సంఖ్య వెల్లడికావడం లేదు.వాస్తవానికి చెల్లింపుల గడువు 25 వరు ముగిసినప్పటికి ఆగస్టు 28 వరు పొడగించిన సంగతి తెలిసిందే.జిఎస్‌టి తరువాత పన్నుల నుంచి సుమారు 65 వేల కోట్లు రిటర్నులు దాఖలైనటుల ఒక అంచనా.ట్రాన్సిషనల్ క్రెడిట్ సౌకర్యం ఉపయోగించుకున్న వ్యాపారులు గడువు పొడగించారు.అయితే 25వ తేదీ లోపు స్వయం ధృవీకరణలను సమర్పించిన వారికి మాత్రమే ఆ వీలు ట్రాన్సిషనల్ క్రెడిట్ సౌకర్యం కలి ్పంచారు.జిఎస్‌టి అమలు ప్రారంభం నుంచి వ్యాపారస్థులు పన్ను చెల్లింపులను ఆన్‌లైన్‌లో చేపట్టడంతో పాటు రిటర్నులను ఆన్‌లైన్‌లోనే చేయాల్సి ఉంటుంది.ఇందులో నెలవారి వి క్రయాల వివరాలు ఉండాలి.ఇది ఖచ్చితంగా చేయాలి కాబట్టి కంపెనీలకు ప్రభుత్వం ఎక్కువ సమయం ఇచ్చింది.దీంతో ఇప్పటి వరకు 36 లక్షల మంది వ్యాపారులు ఇప్పటి వరకు మొదటి పన్ను రిటర్న్లు గూడ్స్ అండ్ సర్విస్ ట్యాక్ పాలసీ కింద దాఖలు చేశారు.ఆగస్టు 25న ఎక్సైజ్ సుంకం,సేవా

18 శాతం ఫైన్‌తో వ్యాపారులకు అవకాశం

పన్ను,వ్యాట్‌తో సహా 12 కు పైగా రాష్ట్ర,కేంద్ర పన్నులను ఏకీకృతం చేసే కొత్త పరోక్ష పన్ను విధానం జిఎస్ఇ కింద మొదటి నెలవారీ రిటర్న్,పన్ను చెల్లించాలి.అయితే వ్యాపారులు ఈ అవకాశాన్ని సోమవారం వరకు వినియోగించుకున్నారు.దీంతో సుమారు 36.32 లక్షల రాబడి దాఖలైంది.అన్ని రిటర్నులు వచ్చిన తరువాత తుది పన్నుల వసూళ్లు నమోదు చేయబడతాయని తెలుస్తుంది.జిఎస్‌టి నెట్ వర్క్,పన్ను దాఖలు ఉపకరణం నిర్వహణ సంస్థ జులై 1న జిఎస్‌టి దిగుమతికి ముందు చెల్లించిన పన్నులపై క్రెడిట్ క్లేయిమ్ చేయడం కోసం పోర్టల్‌లో ట్రాన్-1ను అప్లోడ్ చేసింది.జిఎస్‌టి చట్ట ప్రకారం రిటర్న్ల చెల్లింపుపై గడువు తేది ముగిసన తరువాత ప్రతి రోజు 100 నుంచి 5000 వరకు ఫైన్ రూపంలో కట్టవలసి వస్తుంది.18 శాతం వడ్డీతో గడువు పూర్తయిన ఫైన్ రూపంలో వ్యాపారస్థులు చెల్లించే వీలు కలిగించారు.

ఎమ్మెల్యే అభివృద్ధి నిధికింద 120 కోట్లు విడుదల

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: నియోజవకర్గ అభివృద్ధి నిధి కింద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 120 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఇందులో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకోసం 105 కోట్లు కాగా గవర్నర్ నామినేట్ చేసిన ఎమ్మెల్సీలతోపాటు ఎమ్మెల్యేలు ఎన్నుకున్న 20 మంది ఎమ్మెల్సీల కోసం మరో 15 కోట్ల రూపాయలను విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం విడుదల చేసిన 105 కోట్లలో జనరల్ నిధుల ను ంచి 7924.35 లక్షలు, ఎస్సీ నిధుల నుంచి 1622.25 లక్షలు, ఎస్టీ నిధుల నుంచి 953.40 లక్షలను విడుదల చేసింది. నియోజకవర్గాల అభివృద్ధి నిధిలో రెండవ విడతగా ఈ మొత్తాన్ని విడుదల చేస్తూ ప్రభుత్వం వేర్వే రు ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఒక్కో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి 75 లక్షల రూపాయలను విడుదల చేసింది. ఇందులో 56,60,250 రూపాయలను జనరల్ నిధుల నుంచి విడుదల చేస్తుండగా ఎస్సీ నిధుల నుంచి 11,58,750, ఎస్టీ నిధుల నుంచి 6,81,000 రూపాయలను విడుదల చేసింది. 2017 -18 ఆర్థిక సంవత్సరానికి విడుదల చేసి న ఈ నిధులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఖర్చు చేయాలని ప్రభుత్వం సూచించింది. గవర్నర్ నామినేట్ చేసిన ఎమ్మెల్సీలతోపాటు ఎమ్మెల్యేలు ఎన్నుకున్న ఎమ్మెల్సీల 20 మందికి ప్రత్యేకంగా మరో 15 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీల నిధుల నుంచి కొంత మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసింది.

వార్త

ఏ దేశం అభివృద్ధి చెందిందన్నా అద్దాల మేడలు, రంగు గోడలు అనికాదు అర్థం. పౌరుల నైతికాభివృద్ధి.

-మహాత్మా గాంధీ

అదుపు తప్పిన కాలుష్యం

కాలకూటవిషంగా మారిన కాలుష్యం నుంచి తమను రక్షించాల్సిందిగా కోరుతూ మూసీ తీరప్రాంతాలకు చెందిన వేలాది మంది బాధితులు చేస్తున్న అభ్యర్థనలు, ఆవేదనలు అరణ్యరోదనగా మారిపోయాయి. దశాబ్దాలుగా వారు చేస్తున్న విజ్ఞప్తులను పరిశీలిస్తాం, పరిష్కరిస్తామంటూ పాలకులు హామీలిస్తున్నారేతప్ప ఆచరణాత్మకమైన చర్యలు ఇప్పటివరకూ తీసుకోలేకపోయారు. ఈ సమస్యను పరిష్కరించడంలో గత రెండు మూడు దశాబ్దాలుగా పాలకులు విఫలమవుతున్నారనే చెప్పవచ్చు. గత వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో హైదరాబాద్ నగరం పరిసర ప్రాంతాల్లోని చిన్న నీటి వనరులలోకి, లోతట్టు కాలనీల్లోకి వర్షపునీటితోపాటు మురికినీరు, కాలుష్యకారక పరిశ్రమలు వదులుతున్న ఘన, ద్రవ, రసాయనిక వ్యర్థాలతో కూడిన నీరు ప్రవేశించడంతో కాలుష్య మేఘాలు ఆ ప్రాంతాన్ని కమ్మేస్తున్నాయి.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 185 చెరువులుండగా అందులో 120 చెరువులకు పైగా ఈ కాలుష్యపు నీరు ఎంతో కొంత చేరుకుంటూనే ఉన్నది. నగర పరిధిలో దాదాపు పదిహేను వందల కిలోమీటర్లమేర ప్రవహిస్తున్న నాలాలతోపాటు మూసీలోకి ప్రవేశిస్తున్న ఈ కలుషిత రసాయనికాలతో కూడిన నీరు కూకట్‌పల్లి ప్రాంతంలో ఆదివారం ఒక్కసారిగా తెల్లటి నురగతో నీరు చుట్టుముట్టడంతో ప్రజలు ఆందోళన చెందారు. నగరంలోని పలు పరిశ్రమల యజమాన్యాలు వ్యర్థాలను లారీలతో, భారీ కంటైనర్లతో నాలాల్లోకి వదిలివేస్తున్నారు. ఫలితంగా ఇటు ఆ ప్రాంతంలో కాకుండా మూసీ నది పూర్తిగా కలుషితమైపోతున్నది. విషపూరిత రసాయనిక కలుషిత జలాలను శుద్ధిచేయకుండా మూసీలో కలుపుతున్న పరిశ్రమలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని కాలుష్యనియంత్రణ మండలి పదేపదే ప్రకటనలు చేస్తున్నా... అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. వాస్తవానికి ఈ సమస్య కొత్తగా పుట్టుకొచ్చింది కాదు. రానురాను పెరుగుతుండడమే ఆందోళన కలిగించే అంశం. కొందరు అధికారుల అవినీతి, అసమర్థత, నిర్లక్ష్యం కారణంగా ఈ సమస్య పెరగడానికి ప్రధాన కారణంగా చెప్పొచ్చు. ఈ పరివాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లోని చెరువుల్లో ఒకనాడు మంచినీరే తాగేవారు. అంతకంటే ముందు చరిత్రను పరిశీలిస్తే.. ఇక్కడి చెరువుల్లో నుండి కాకతీయుల కాలంలో మంచినీటిని వరంగల్ తీసుకుపోయేవారని చెప్తారు. రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ గ్రామంలో ఉన్న చెరువును ఇందుకు ఉదహరించవచ్చు. మంచినీటినేకాక వందలాది బెస్త కుటుంబాలకు ఇది జీవనాధారంగా ఉండేది. ఈ చెరువేకాదు ఇక్కడ అనేక చెరువులు వ్యవసాయానికి, చేపల పెంపకానికి ప్రధాన వనరులుగా ఉండేవి. 'శకవర్షంబుల్ 1515 (క్రీ.శ. 1593) శ్రీముఖనామ సంవత్సరం నందు మాఘమాసంలో శుక్లపక్షం పౌర్ణమాస గురువారంనాడు సర్వజనుల శ్రేయస్సు అభివృద్ధినిగాంచి వేదవిజ్ఞులు, పురాణాజ్ఞులు పండిత సమక్షంలో సముద్రంను తలపించేను, తటాకం నిర్మించెను. ఈ ప్రాంతమంతా స్వచ్ఛమైన చల్లని గాలులతో పుష్పవాసనలతో లక్ష్మీనారాయణుల నివాసమేమో నన్న తలంపు తెచ్చుకున్నాడు' తదితర వ్యాఖ్యాలు నేటికీ ఏదులాబాద్‌లో ఉన్న శిలాశాసనంపై దర్శనం ఇస్తాయి. ఇలాంటి చెరువులు ఎన్నో కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. ఇంకా మారిపోతున్నాయి. నీటిని పశువులు కూడా ముట్టలేని పరిస్థితులు. బట్టలు ఉతకడానికి, స్నానం చేయడానికి కూడా పనికిరావడం లేదు. పొలాలకు నీరు పారిస్తే.. పంట తాలుగా మారిపోతున్నది. చివరకు తాటి చెట్ల కల్లులో కూడా రసాయనికాలు చేరుకుని రంగులు మారుతున్నాయి.


గతంలో హైదరాబాద్ నగరం నడిబొడ్డులోని ఫోలిక్ పూల్‌లో కలుషిత నీటితో పది మందికిపైగా మరణించగా మరెందరో ఆస్పత్రుల పాలయ్యారు. ఈ కలుషిత నీటి కారణంగానే ముప్పై ఆరు రకాల వ్యాధులు సోకుతున్నాయని డాక్టర్లు స్పష్టంచేస్తున్నారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంటున్నా అధికారులు ఈ విషయంలో ఆసరం మేరకు చర్యలు తీసుకోలేకపోతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శలు వస్తున్నాయి. చిన్నస్థాయి పారిశ్రామికవేత్తలకు ఇది ఒక వేధింపు మండలిగా మారిపోయింది. అసలు వాస్తవంగా కేసులంటూ పెట్టాల్సి వస్తే హైదరాబాద్‌మున్సిపల్ కార్పొరేషన్‌పైనే ముందుగా కేసులు పెట్టాల్సి ఉంటుంది. ప్రతి రోజు హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్ని కోట్ల లీటర్ల మురికి నీరు వెలువడుతోంది? అందులో ఎంతనీరు శుద్ధిచేసి మూసీలోకి వదలుతున్నారు? ఎసటిపోతాలపైగా వ్యర్థజలాలను ఏమాత్రం శుద్ధి చేయకుండా మూసీలోకి వదలుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. నీరు ప్రవహిస్తున్న నగరంలోని పలు ప్రాంతాల్లో కూడా ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. దీనికితోడు ఏ పరిశ్రమ నుంచి ఎంత మొత్తంలో ఏయే రసాయనిక జలాలు వస్తున్నాయో సమగ్రమైన సమాచారం లేకపోవడం కూడా పెద్ద లోపంగా చెప్పొచ్చు. కలుషిత జలాలను ఉత్పత్తి చేస్తున్న పరిశ్రమలు సొంతంగా, ఎఫ్ల్యుయెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను, కేంద్ర పర్యావరణశాఖ ఇచ్చిన ఉత్తర్వులను కూడా పలువురు పారిశ్రామికవేత్తలు ఖాతరు చేయడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి వాస్తవ పరిస్థితులను గ్రహించి ముందుగా కాలుష్య నియంత్రణ మండలిని ప్రక్షాళన చేయాలి. వ్యర్థరసాయనాలు మూసీలోకి, ఇతర నాలాల్లోకి కలవకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా పరిస్థితి మరింత జటిలంగా మారే ప్రమాదం ఉంది.

"చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునేవారు, హింసాత్మక ప్రవృత్తిని అనుసరించేవారి విషయంలో ఈ దేశం, ఏ ప్రభుత్వమైనా చూస్తూ ఊరుకోదు."



■ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

"వైద్యం, శాస్త్ర పరిశోధన రంగం ఏదైనా భారత మేధావులు లేని అభివృద్ధి చెందిన దేశమేదీ నేడు ప్రపంచంలో లేదు."



■ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

ప్రజావాక్కు



ఉత్తమ విద్యార్థులను తయారుచేయాలి

నేటి విద్యావిధానం లోపభూయిష్టంగా ఉంది. ఉపాధ్యాయులు కేవలం విద్యార్థులకు చదువుబాగా నేర్పాలి, వారికి ఉత్తమ మార్కులు లేదా గ్రేడ్ లక్ష్యంగా కృషి చేస్తున్నారు. వారి నైతికప్రవర్తన విషయం ఎంతమంది పట్టించుకుంటున్నారు. భాషలు బోధించేటప్పుడు నీతిపద్యాలు చదవడం, కంఠస్తం చేయడమే ముఖ్యంకాదు. ఆ పద్యాలలోని నీతిని నిత్యజీవితంలో విద్యార్థి ఆచరించేలా చేయాలి. మహాత్ముల చరిత్ర చెప్పినా అంతే. వారిలోని విశిష్ట గుణాలను విద్యార్థులు గ్రహించి, వారు ఆ బాటలో నడిచేలా చేయాలి. ఉపాధ్యాయులు విద్యార్థుల చదువుకంటే ఉత్తమ గుణాలను పెంపొందింపచేసే లక్ష్యంతో కృషి చేయాలి. ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలలు ఈ విషయాన్ని గమనించాలి.

● ఎస్. శ్రీనివాసరాజు, వనస్థలిపురం

మతవిద్వేషాలు మానండి

అందరూ అనుకున్నట్లుగానే మతకలహాలు మొదలయ్యాయి. ఒకరిపై ఒకరు పరుషంగా మాటలతో దాడులు చేసుకోవడం ఆరంభించారు.ఇది అనారోగ్యకరమైన పరిణామం.అసలు సృష్టికర్త అంటూ లేకుండా ఇంతటి మహావిశ్వం ఆవిర్భావం జరిగి ఉండేదికాదు. ఇది సత్యం. ఇది వాస్తవం. నమ్ముకున్న దైవాన్ని ఆరాధించుకుంటూ సాగడంలోఎటువంటి ఇబ్బందులు ఉండవు. అయితే ఇతర మతాలను విమర్శిస్తూ, ద్వేషిస్తూ, ఎద్దేవా చేస్తూ సాగడం ఆమోదంకాదు.మనది సెక్యులర్‌రాజ్యం. అన్ని మతాలు సోదరభావంతో సఖ్యతతో కలిసిమెలిసి ఒక్కటిగా సాగాలి.

● బి.ఎన్.సత్యనారాయణ, హైదరాబాద్

సంతోషమే కానీ...

ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు గెలవడం సంతోషకరం. కానీఈ మధ్య కాలంలో మన తెలుగు మీడియా వెంకయ్య నాయుడు తెలుగు వాడని ఆకాశానికి ఎత్తుతున్నాయి. ఒకప్పుడు నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగా ఉన్నారు. పి.వి. నరసింహారావు ప్రధాని అయ్యారు. వీరు తెలుగు రాష్ట్రానికి చేసిందేమీ లేదు. 11 నెలలు దేవగౌడ ప్రధాని అయి కర్ణాటక రాష్ట్రానికి ఆల్మట్టి డ్యాం నిర్మించుకున్నారు. వెంకయ్య నాయుడు కర్ణాటక రాష్ట్రం నుంచి రెండు,మూడు పర్యాయాలు రాజ్యసభకు వెళ్లారు. అయినా ఆల్మట్టిడ్యాం నిర్మాణం ఆపలేకపోయారు. వెంకయ్యనాయుడు తెలుగువారు అయినప్పటికీ మనకు లాభం ఏమిటి?

● సరికొండ రవిప్రకాశ్‌రాజు, మునగాల సూర్యాపేట

డిటెన్షన్ విధానం మంచిది

డిటెన్షన్ విధానం మళ్లీ తెరమీదకు వచ్చింది. ఇది చాలా మంచిది.అయితే ఐదవతరగతిలో డిటెన్షన్ విధానంవల్లచాలా మంది విద్యార్థులు చదువు మానేసే ప్రమాదం ఉంది. కాని ఎనిమిదోవ తరగతిలో డిటెన్షన్ విధానం చాలా శ్రేయస్కరం. తప్పిన వారికి కూడా మార్కులలిస్టు, పుట్టిన తేదీతో పాటు ఇవ్వాలి. డిటెన్షన్ విధానం వల్ల విద్యార్థులకు చదువుపట్ల శ్రద్ధ పెరుగుతుంది.

● ఆర్. కేశవరావు, కంచరపాలెం,విశాఖపట్నం

నిబంధనలు పాటించని ఉత్సవాలు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలతో జలాలు కాలుష్యం బారిన పడుతుంటే మరోవైపు వీధివీధికీ గణేశ మంటపాల వద్ద పెద్దపెద్ద స్పీకర్లు, డీజె బాక్సులు పెట్టి ప్రజలకు ప్రశాంతత లేకుండా ఊదర గొట్టేస్తున్నారు. వినాయక చవితి రోజున ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల వద్ద బాక్సుటైపు స్పీకర్లనే ఉపయోగించాలనీ, రాత్రి పది గంటల తర్వాత స్పీకర్లు ఆఫ్ చేయాలనీ, భక్తి పాటలు మాత్రమే వినిపించాలనీ, ఆ శబ్దం పది అడుగుల దూరాన్ని మించి వినబడకూడదని ఉత్సవాల ప్రారంభానికి ముందు పోలీసులు ఎన్నో ఆంక్షలు విధించారు. అయితే విధించిన ఆంక్షలలో ఒక్కనిబంధనను కూడా అమలు చేయలేకపోవడాన్ని చూస్తుంటే ఇది రాజకీయ స్వప్ర యోజనం కోసం ప్రభుత్వం ఉత్సవ నిర్వాహకులతో రాజీపడిందో అర్థంకావడం లేదు.

● జి.అశోక్, గోదూర్, జగిత్యాలజిల్లా

ప్రభుత్వం వెంటనే పనులు చేపట్టాలి

విశాఖ జిల్లాలో ముఖ్య వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన అనకాపల్లిలో పలుసమస్యలు తాండవిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. పట్టణంలో సరైన మురుగు పారుదల వ్యవస్థ లేకపోవడం వలన కాస్త వర్షానికే కాల్వలలోని మురుగు అంతా రోడ్లపై ప్రవహిస్తుంటుంది. వీధిదీపాలు పనిచేయడం లేదు. ట్రాన్స్ ఫార్మర్లు అన్నీ శిథిలావస్థకు చేరి విద్యుత్ సరఫరాకు నిరంతరం ఆటంకం కలుగుతోంది.మూడేళ్ల క్రితంకోర్టు సముదాయం,సబ్‌రిజిస్ట్రార్,ఆర్డీవో,అగ్నిమాపక కేంద్రంవంటి కార్యాలయాలకు శంకుస్థాపనలు చేసా రు. కానీ నిర్మాణాలు చేపట్టలేదు.ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి.

● సి.ప్రతాప్, శ్రీకాకుళం

ప్రజాపక్షమే పార్టీల అజెండా

ఏప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజలను రకరకాల పన్నులతో ముక్కుపిండి వసూలుచేయడం మినహాసౌకర్యాల కల్పన, నిత్యావసర సరుకుల ధరలు తగ్గింపు,సామాన్యుల జీవనవిధానంపై దృష్టి సారించిన జాడలేదు. సేవా, విలువ ఆధారిత, వస్తుసేవా వంటి వాటితో వినియోగదారునినడ్డివిరచడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. అవినీతి అంతమొందించామని పదేపదే వల్లె వేస్తున్నారు. కానీ అవినీతి ప్రతి స్థాయిలోను మర్రిఊడలుగా విస్తరించుకుంటున్నది. కేంద్రంలో ప్రతిపక్షం నైరాశ్యంవీడి ప్రజాపక్షం వహించకపోతే రాబోయే ఎన్నికలలో కనుమరుగు చేయగలరు.

● యర్రమోతు ధర్మరాజు, ధవళేశ్వరం

సినీహీరోలు ఆదర్శంగా ఉండాలి

కొందరు సినిమా హీరోలుఅహంకారంతో గర్వంతో సాటి మనిషిని పురుగును చూసినట్టుగా చూస్తుంటారు. తరచు కోపావేశాలను ప్రదర్శిస్తూ తిట్టడం, కొట్టడం చేయడమేకాక మద్యం సేవించిన సమయంలో మరింత రెచ్చిపోయి ప్రవర్తిస్తుంటారు. ఇలాంటి పనులు తమ ఇమేజ్‌ను పాడు చేస్తాయని తెలుసుకోలేకపోతున్నారు. తాము తెర మీద మాత్రమే హీరోలమని నిజ జీవితంలో కాదని నిరూపించుకుంటున్నారు. హీరోలు తమను అందరు ఆదర్శంగా తీసుకునేలా ప్రవర్తించాలి.

● ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

ఎడిట్ పేజీకి... ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

ప్రాంతీయ విమానాలకు 'ఉడాన్' రెక్కలు

పి.వి.ఆర్.మూర్తి

ప్రాంతీయ అనుసంధానం కోసం ఉద్దేశించిన ఉడాన్ పథకం విమానరంగంలో నూతన అధ్యాయాన్ని ఆవిష్కరిస్తోంది. దాదాపు నగరాలు అన్నిటికీ విమానయానం చాలా సులువుగా అందుబాటులోకి వస్తోంది. విమానాలకు ఉడాన్ రెక్కలు తొడుగుతుండడంతో చాలా తక్కువ ధరాలకి విమానయానం చేయగల అవకాశం లభిస్తోంది. ఈ పథకం రెండోదశ బిడ్లకు కేంద్ర పౌరవిమానయాన శాఖ తెరతీసింది. ఆగస్టు 24 నుంచే బిడ్ల దాఖలుకు అవకాశం కల్పించింది. ఇదివరకు 150 కిలోమీటర్లకు పైగా దూరం ఉన్న విమానాశ్రయాలకు మాత్రమే అవకాశం కల్పించింది. ఇప్పుడు ఆ లోపు దూరం ఉన్న ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి కూడా బిడ్డింగ్ దాఖలు చేయడానికి అవకాశం లభిస్తోంది. ఈ రెండో దశలో హెలికాప్టర్లను ఈ పథకం కిందకి తీసుకొచ్చారు. మరో 21 విమానాశ్రయాల నుంచి సెప్టెంబర్ 30లోపు మొదలవుతాయి. ఉడాన్ 2లో 150 కిలోమీటర్ల పరిమితిని ఎత్తివేసినందున వరంగల్- హైదరాబాద్, మైసూర్- బెంగళూరు, మధ్య విమానాలు నడవడానికి ఎవరైనా బిడ్డింగ్ దాఖలు చేసే అవకాశం లభించింది. వరంగల్, మైసూర్‌లనుంచి వేరేనగరాలకు కూడా విమానాలు నడపవచ్చు. విజయనగరం జిల్లా భోగాపూరం విమానాశ్రయాన్ని ప్రపంచస్థాయిలో నిర్మించాలని ఎయిర్‌బోర్డు ఆథారిటీ ఆఫ్ ఇండియా భావిస్తోంది. ఇందుకోసం ప్రపంచస్థాయి కన్సల్టెంట్లను నియమిస్తామని ఎఎఐ ఛైర్మన్ తెలిపారు. నిర్మాణం ప్రారంభమైతే పూర్తికావడానికి నాలుగేళ్లు పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ బిడ్‌ను ఖరారు చేసి ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. ప్రాంతీయ అనుసంధాన పథకం కింద కడప విమానాశ్రయం నుంచి రాకపోకలు బాగానే సాగుతున్నాయి. ఈపథకం వల్ల ప్రాంతీయ విమానాశ్రయాలకు మహర్దశ పట్టనున్నది.

విమానాల్లో సామాన్యులు కూడా ప్రయాణించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం జాతీయ పౌరవిమానయాన విధానాన్ని రూపొందించింది. ఇప్పటి వరకు విమానాలు నడపని విమానాశ్రయాలను అభివృద్ధి చేసి నిత్యం ప్రయాణించడానికి వీలు కల్పించడమే దీని లక్ష్యం. ఈ మేరకు గంటపాటు ప్రయాణించే వారు చాలా తక్కువలో టిక్కెట్ల ధర చెల్లించే వెసులుబాటు కలుగుతుంది. రూ. 2,500 టిక్కెటు ఛార్జీ కన్నా మించకూడదని ఇంతకంటే తక్కువ ధరకే ఎవరైనా అవకాశం కల్పిస్తే బాగుంటుందని కేంద్రం సూచిస్తోంది. దీని వల్ల మధ్యతరగతి ప్రయాణికులకు చాలా సౌకర్యం కలుగుతుంది. ఈ కొత్త సర్వీసులు ఎవరైతే నిర్వహిస్తారో వాళ్లకు నిధుల సర్దుబాటు కేంద్రమేచేస్తుంది. విమాన నిర్వహణ, మరమ్మతుల సేవలకు సంబంధించి90శాతం విమానాలను ప్రస్తుతం విదేశాలకు పంపుతున్నారు. దీనికోసం ఏటా ఐదువేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టవలసి వస్తుంది. అందువల్ల స్వదేశంలోనే విమానాల నిర్వహణ, మరమ్మతు, సేవలకు వీలుగా భారత్‌ను ప్రపంచస్థాయి కేంద్రంగా మార్చడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు తగిన వనరులు, వసతులు సమకూరిస్తే వ్యయం బాగాతగ్గుతుంది. కొన్నివేల మందికి ఉద్యోగవకాశాలు లభిస్తాయి.

2025 నాటికి భారత పౌరవిమానయానరంగంలో 3.3 లక్షల అదనపు ఉద్యోగులు అవసరం అవుతారని కేంద్ర ప్రభుత్వం తాజాగా అంచనా వేసింది. దీనివల్ల తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు చాలా వరకు ప్రయోజనం కలుగుతుంది. ప్రాంతీయ విమానాశ్రయాలతోపాటు అంతర్జాతీయస్థాయి విమానాశ్రయాలు అభివృద్ధి చేయడానికి వీలవుతుంది. తెలంగాణకు సంబంధించి హైదరాబాద్‌లోనే అంతర్జాతీయ విమానాశ్రయంశంషాబాద్‌లో అందుబాటులోఉంది. నిజాం కాలం నాటి ఆదిలాబాద్, నిజామాబాద్, రామగుండం, వరంగల్ విమానాశ్రయాలు ఇప్పుడు ఉపయోగంలో లేవు. హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాతోపాటు అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే మరోఅంతర్జాతీయ విమానాశ్రయం అవసరమవుతుంది. కేంద్ర ప్రభుత్వ నూతన విధానం వల్ల ఈ ఆరు ప్రాంతాల్లో కొత్త విమానాశ్రయాలు ఏర్పడగలవన్న ఆశలురెక్కలు తొడుగుతున్నాయి. నల్గొండ, మహబూబ్‌నగర్ కూడా ప్రాంతీయ విమానాశ్రయాలకు అనుకూలమైన ప్రాంతాలుగా భావిసున్నారు. తెలంగాణ వైమానిక రంగం అభివృద్ధి దిశగా ర్కెలు తొడుగుతోంది. హైదరాబాద్ శివారులోని ఆదిభట్ల ప్రాంతంలో ఏరోస్పేస్ సెజ్, హెలికాప్టర్ల తయారీ కేంద్రం నడుస్తోంది. విమాన సాంకేతిక పరిజ్ఞానం, నిర్వహణ, బోధన శిక్షన కోర్సులు, పరిశోధనలకు తెలంగాణ అనుకూల ప్రాంతంగా పరిగణించబడుతోంది. ఇక ఆంధ్రప్రదేశ్ విషయాన్ని పరిశీలిస్తే ప్రస్తుతం విశాఖ, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి విమానాశ్రయాలు మాత్రమే ఉన్నాయి. భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పడుతుంది. కడప విమానాశ్రయంతోపాటు ఒంగోలు, నెల్లూరు, తాడేపల్లిగూడెం, కర్నూలు, బొబ్బిలి ప్రాంతాల్లో విమానాశ్రయాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగా పెద్ద విమానాశ్రయాలే కాదు, చిన్న నగరాలు, పట్టణాల్లోనూ విమానాశ్రయాలు రెక్కలు విప్పనున్నాయి. ప్రయాణ సేవలతోపాటు ఆర్థికాభివృద్ధి కేంద్రాలుగా అవి మార్పు చెందే అవకాశాలు విస్తరిస్తాయి. విజయవాడ విమానాశ్రయాన్ని పరిశీలిస్తే దీని అవసరాలు రానురాను పెరగనున్నాయి. మూడేళ్ల క్రితం హైదరాబాద్ నుంచి వచ్చే వారికి మాత్రమే ఈ విమానాశ్రయం ఉపయోగపడేది. ఇప్పుడు వివిధ వర్గాల రద్దీ పెరిగింది. అమరావతి రాజధానికి వచ్చే ప్రముఖుల రాకపోకలు పెరిగాయి. ప్రస్తుతం హైదరాబాద్, విశాఖలతోపాటు ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, తిరుపతి, వారణాసి, తదితర ప్రధాన నగరాలన్నిటికీ ఇక్కడ నుంచే సర్వీసులు నడుస్తున్నాయి. అహ్మదాబాద్, కోల్‌కతా, కోచి వంటి నగరాలకు కనెక్టివిటీ సర్వీస్‌లు ఉన్నాయి. ప్రయాణికుల వృద్ధి రికార్డు స్థాయిలో పెరిగింది. తాజా గణాంకాల ప్రకారం 2015-16లో 4.04 లక్షల మంది గన్నవరం విమానాశ్రయం నుంచి రాకపోకలుసాగించగా, 2016-17లో సంఖ్య 6.5 లక్షలకు పెరిగింది. అలాగే విమాన సర్వీస్‌లు 2015-16లో 7710 ఉండగా, 2016-17లో 11,631కి చేరాయి. ఇప్పుడిప్పుడే అధునాతనభవనాలు నిర్మాణమవుతున్నాయి. రూ.160కోట్లతో అధునాతన టెర్మినల్ భవనాన్ని నిర్మించారు. పాత టెర్మినల్‌లో ఏడాదికి లక్షన్నర మంది వరకు వచ్చిపోయే వీలుండగా, తాజా టెర్మినల్ భవనంవల్ల ఏటా 15 లక్షల మంది వచ్చి వెళ్లేందుకు సౌకర్యాలున్నాయి. ఒకేసారి 300 కార్లను పార్కింగ్ చేయవచ్చు. కార్గో సర్వీస్‌ల కోసం కార్గో భవనాలు నిర్మించారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి, ఒంగోలు, జిల్లాల నుంచి ఏటా 25 లక్షల మంది విదేశాలకు వెళ్లి వస్తుంటారు. త్వరలో ఇక్కడనుంచి అంతర్జాతీయ సర్వీసులను నడిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం 550 ఎకరాల్లో విమానాశ్రయం ఉండగా, మరో 700 ఎకరాలు సమకూరాయి. దీంతో మొత్తం 1250 ఎకరాల్లో విమానాశ్రయ అభివృద్ధికి వెయ్యి కోట్లతో ప్రణాళిక రూపొందింది. ప్రస్తుతం 2286 మీటర్ల పొడవున్న రన్‌వేను 4430మీటర్లకు విస్తరిస్తున్నారు. బ్రెజిల్, మెక్సికో, కెనడా, రష్యా, అర్జెంటీనా, కొలంబియా తదితర దేశాలు వైమానిక రంగాన్ని అభివృద్ధికి మార్గంగా ఉపయోగించుకొంటున్నాయి. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో విమానాల రద్దీ తక్కువనే చెప్పక తప్పదు. ఆయా దేశాల్లో ప్రజారవాణాలో అంతర్భాగంగా వైమానిక రంగం మార్పు చెందినా మనదేశంలో ఇంకా అటువంటి పరిస్థితి ఏర్పడలేదు. కొత్త విమానాశ్రయాలకు సంబంధించి ఏ దేశంలో లేని నిబంధనలు మనదేశంలోనే ఉన్నాయి. దేశంలోని ప్రస్తుత విమానాశ్రయాలు భవిష్యత్తు అవసరాలకు ఏమాత్రం సరిపోవని ప్రణాళిక సంఘం కేంద్రానికి సూచించింది. కొత్తగా 180కిపైగా విమానాశ్రయాలు అవసరమని నివేదించింది. పదో పంచవర్షప్రణాళికలో 67 వేల కోట్ల రూపాయల వరకు పెట్టుబడులు సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా22వేలకోట్లు మాత్రమే సమీకరించుకోగలిగారు. గడచిన పదేళ్లలో కేవలం 23 విమానాశ్రయాలు మాత్రమే కొత్తగా నిర్మాణం అయ్యాయి. కేంద్రప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకోవడంవల్లనే పౌరవిమానయానం అభివృద్ధిపథంలోకి దూసుకెళ్తోంది. అత్యవసర వైద్యసేవల కోసం, రవాణా కోసం హెలికాప్టర్లను వినియోగంలోకి తెస్తే మరిన్ని సౌకర్యాలు సమకూరుతాయి.

గిడుగు ముందడుగు తెలుగుకు కొత్త వెలుగు

పి. సూర్యకుమార్

అమ్మ ఒడిలో బిడ్డ మొదట పలికే పదం అమ్మ. ఆ మాటతోపాటు ఎన్నో పదాలను నేర్చుకుని తియ్యగా పలికే భాష తెలుగు. అమ్మభాష అంటే మన తెలుగు భాష. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్ని భాషలు నేర్చుకున్నా మన అమ్మ భాషను ఎవరూ మరిచిపోలేం. క్రీస్తు పూర్వం అయిదో శతాబ్ది నాటికే తెలుగు వాడుకలో ఉండేదని పురాతన శాసనాలు రుజువు చేస్తున్నాయి. ఛందస్సు, వ్యాకరణం సాహిత్యంతో దాదాపు కొన్ని శతాబ్దాలుగా గ్రాంధికంగా సాగిన భాష ఇతిహాసాలు, ప్రబంధాల రచనలతో ఎన్నో మలుపులు సొంపులు చేకూర్చుకుంది. అయితే పండితులపరంగా గ్రాంధిక పదాలే ఎక్కువగా చోటు చేసుకోవడంతో నిరక్షరాస్యులకు సామాన్యులకు ఆ పదాల అర్థాలు ఒకంతట తెలిసేవికావు. ప్రజలు నిజజీవితంలో మాట్లాడే వ్యావహారిక భాషకు, కవితా సాహిత్యంలో వినిపించే భాషకు పొంతన ఉండేదికాదు. అటువంటి గ్రాంధిక దిగ్బంధం నుంచి విముక్తి కలిగించడానికి వ్యావహారిక భాషా ఉద్యమం సాగించిన వారిలో మొదటి అడుగువేసింది గిడుగురామమూర్తి పంతులే.

గిడుగు కృషివల్లనే తెలుగు సాహిత్యంలో వాడుక భాషకు ప్రాధాన్యం పెరిగింది. ప్రాచీన కావ్యాల ప్రభావం నుంచి బయటపడి తెలుగు కవిత్వం ఆధునిక సొబగులతో ముందుకుపోడానికి వ్యావహారిక భాషే కొత్త ఊపిరిని అందించింది. ఆ మహనీయుడు గిడుగు రామమూర్తి సాగించిన ఉద్యమం తెలుగు సాహిత్యంలో అభ్యుదయాన్ని నవీనయుగాన్ని సృష్టించింది. అందుకే గిడుగు జయంతి అయిన ఆగస్టు 29న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగుభాషా దినోత్సవాన్ని జరుపుకొంటోంది. కోస్తాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా పర్వతాల పేటలో 1863 ఆగస్టు29న వీర్రాజు,వెంకమ్మ దంపతులకు గిడుగు రామమూర్తి జన్మించారు. గిడుగురామమూర్తి పంతులూ, గురజాడ అప్పారావు వీరిద్దరూ చిన్ననాటినుంచి సహాధ్యాయులే. ప్రాచీన తెలుగు కావ్యాలను బాగా అధ్యయనం చేసిన గిడుగు గ్రాంధిక భాషాద్వేషి కాదు. ఏరచనయినా,ఏ కావ్యమయినా పండితులకే పరిమితం కాకుండా ప్రజల వాడుకలో ఉంటేనే భాషాపరంగా అందరికీ సులువుగా అర్థం అవుతుందని, ఎక్కువ మందికి ఆ రచనల సమాచారం అందుతుందని గిడుగు పూర్తిగా నమ్మేవారు. దీని వెనుక సామాజిక దృక్పథం ఉండేది.అయిన ఉద్యోగ రీత్యా సవరలు ఎక్కువగా నివసించే పర్లాకిమిడిలో ఉండేవారు. అందుకే సవరల గురించి ముమ్మరంగా పరిశోధనలు సాగించారు. సవర భాషకు లిపిని రూపొందించింది గిడుగురామమూర్తే. వాడుక భాషా ఉద్యమానికి అంకితమైన గిడుగు గ్రాంధిక వాదులైన జయంతి రామయ్య పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి,వేదం వెంకటరాయి శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి వంటి కవిపండిత ప్రకాండులతో వాదానికి తరచుగా దిగవలసి వచ్చేది. గిడుగు ఆశయాలకు గురజాడ సంస్కరణ భావాలు అండగా ఉండేవి. 1911లో ప్రారంభమయిన ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రాంధిక వాదానికే మద్దతు ఇచ్చేది. అయినా గిడుగు వెనుకడుగు వేయకుండా తన తెలుగు పత్రిక ద్వారా వ్యావహారిక వాదాన్ని ఆయుధంగా చేసుకుని గ్రాంధిక వాదాన్ని ఖండించేవారు. వ్యాసావళి, బాలకవి శరణ్యం, పండిత భిషక్కుల భాషాభేషజం, సూర్యరాయాంధ్ర నిఘంటు విమర్శనం మొదలైన గ్రంధాలు రచించి కవి పండితులకు దీటుగా నిలబడ్డారు. అదే సమయంలో కొన్ని పత్రికలు, గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకం తెలుగు వ్యావహారిక భాషకే పట్టం గట్టి ప్రజా బహుళ్యాన్ని ఆకట్టుకోగలిగాయి. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి సారథ్యంలోని ప్రబుద్ధాంధ్ర పత్రిక, నవ్యసాహిత్య పరిషత్తు వారి 'ప్రతిభ' పత్రికలు గిడుగుభాషా ఉద్యమానికి దన్నుగా నిలిచాయి. కొండకోనల్లో అనాగరికంగా జీవించే సవరుల కోసమే సవర భాషలో వ్యాకరణం రచించి చరిత్ర సృష్టించారు. సవరలకు చేరువగా వారితో మమేకమై వారి జీవితాల్లోని వాస్తవాలను లోకానికి తెలియచేయాలన్న ఆసక్తితో సవర భాషను నేర్చుకున్నారు. పుట్టి పెరిగింది సనాతన బ్రాహ్మణ కుటుంబంలోనే అయినప్పటికీ కుల మతాలను పట్టించుకోకుండా వారికి దగ్గరై పరిశో ధన సాగించారు. హరిజనోద్ధరణ ఉద్యమం పుట్టకముందే అంటే 40 సంవత్సరాల ముందే 1894లో గిరిజనులు కూడా అంటరాని వారిగా భావించే సవరలను అంటే శబరులను తన ఇంటిదగ్గరే పెట్టుకుని సవర భాష నేర్చుకోవడం ఆనాడు ఒక సాహసమే. కులాల కట్టుబాట్లు దృఢంగా ఉండే ఆ రోజుల్లో రామమూర్తి చర్యలు సాటి బ్రాహ్మణ వర్గానికి గిట్టేవికావు. సమాజంలో బాగా అట్టడుగున అనాగరికంగా బతికే వారికి అర్థమయిన భాషలో విజ్ఞాన బోధ చేయడమే గిడుగు వ్యావహారిక భాషా వాదంలోని పరమార్థంగా భావించేవారు.ఎ మెమోరాండం ఆన్ మోడర్న్ తెలుగు (1913)లో ఈ లక్ష్యం కనిపిస్తుంది. గురజాడ మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించిన డిసెంటు పత్రం (అసమ్మతి పత్రం)లో ఉన్న వాదనే గిడుగు వాదనలోనూ కనిపిస్తుందని భాషావేత్తలు అభిప్రాయపడుతున్నారు. కవిత్రయం రచించిన మహాభారతాన్ని ఎంతగా ఇష్టపడేవారో ఈ సఫ్ కథలనా అంతే ఇష్టం ఉండేది. అందుకే ఈసఫ్ కథలను సవర భాషలోకి అనువదించారు.



నేడు గిడుగు జయంతి
తెలుగు భాషా దినోత్సవం

1919లో 'తెలుగు' పేరుతో పత్రికను స్థాపించారు. గ్రాంధిక వాదుల విమర్శలకు దీటుగా ఈ పత్రిక ద్వారా తన వాదాన్ని వినిపించేవారు. రచన సాహిత్యం వ్యావహారిక భాషలో ఉంటేనే పాఠకులకు ప్రయోజనం కలుగుతుందన్న సంకల్పంతో 'నిజమైన సంప్రదాయం' పేరుతో చిన్న పుస్తకం రాశారు. సాహిత్యం ద్వారా భాషా వ్యాప్తి కలుగుతుందనే ఆశయంతో 1932లో 'అప్పకవీయ విమర్శనం'తాళపత్ర కావ్యాలను పూర్తిగా పరిశీలించి గ్రంధరచన చేశారు. అలాగే పరవస్తు చిన్నయ సూరి 'నీతిచంద్రిక' రెండవ ముద్రణను ప్రచురించారు. శాసనాల ఆధారంగా, కావ్యాల ఆధారంగా ముఖలింగ క్షేత్రం కాశీ వంటిదని వెల్లడించారు. ఈక్షేత్రాన్ని పూర్వం 'జయంతి పురం' అని పిలిచేవారని నిరూపించారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం సమీపాన గల కొంకుదురు గ్రామంలో 1887లో దొరికిన శాసనాన్ని పరిశీలించి అందులోని అంశాలు అమలాపురం దగ్గర్లోని వెదిరేశ్వరం, పలివెల, ముమ్మిడివరం గ్రామాలకు సంబంధించినవని నిర్ధారించగలిగారు. వ్యావహారిక భాషా ఉద్యమనేతగా ఎంత పేరు గడించారో సవరలపై సాగించిన పరిశోధనల్లోనూ ఆయనకు అంతే ఖ్యాతి వచ్చింది. సవరల సంస్కృతిని పరిరక్షించడానికి అహర్నిశలూ కృషి చేశారు. సవరలకు సంబంధించి ఐతరేయ బ్రాహ్మణం నుండి అనేక కావ్యాల నుంచి ఎన్నో విశేషాలను వెలుగులోకి తెచ్చారు. రామాయణంలో శబరి, ఈ సవరలకు సంబంధించిందే అని మహాభారతం శాంతిపర్వంలో వీరి ప్రస్తావన ఉందని, విశ్వామిత్రుని శాపం పొందిన వారిలో సవరలున్నారని, భారతం, హరివంశం తదితర కావ్యాల్లో వీరి ప్రస్తావన ఉందని తెలుసుకుని పాఠకులకు వెల్లడించారు. వేటలో ప్రవీణులైన సవరలు స్వతంత్ర జీవనం కొనసాగిస్తూ విశాఖజిల్లా,ఒడిశా, బెంగాల్, సంబల్‌పూర్, తదితర ప్రాంతాల్లో ఉండేవారని పేర్కొన్నారు. సవర సంస్కృతిని వెలుగులోకి తేవడం వల్లనే ప్రభుత్వం వారిని గిరిజనులుగా గుర్తించింది. గిడుగు వ్యావహారిక భాషా ఉద్యమ వ్యాప్తికి చేసిన కృషి ఆయన జీవించిన కాలంలోనే సంపూర్ణంగా విజయవంతం కాలేదు. గిడుగు దీనికి ఆవేదన పడేవారు. కానీ తరువాత కాలంలో ఈ ఉద్యమం సత్ఫలితాలను అందించింది. పరీక్షల్లో వ్యావహారిక భాషలోనే రాయడం అమలయింది. రచనలు వ్యావహారిక భాషలోనేరావడం ప్రారంభమయింది. అంతవరకూ గ్రాంధిక భాషలోనే సంపాదకీయాలు రచించే పత్రికలు తమ పంథామార్చుకొన్నాయి. 'గిడుగు రామమూర్తి వ్యావహారిక భాషావాదం లేవనెత్తడంతో తెలుగు కావ్యభాషా స్వరూపం మారిపోయింది' అని శ్రీశ్రీ ప్రశంసించడం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం ఎంతయినా సముచితం.

నయవంచన పెట్టుబడి... లక్షల కోట్ల రాబడి

కనుకుల యాదగిరిరెడ్డి

ప్రపంచవ్యాప్తంగా మనుషుల అక్రమరవాణా వ్యాపారం ఏటాపదిలక్షల కోట్లరూపాయలకు మించిసాగుతోంది. మాదకద్రవ్యాలు, ఆయుధాల తరువాత కొన్ని కోట్ల రూపాయలు నేర సామ్రాజ్యానికి అందిస్తున్న వ్యాపారం మనుషుల అక్రమ రవాణాయే. వెట్టిచాకిరి, వ్యభిచారాలే లక్ష్యంగా సాగే ఈ రాకెట్‌కు కూడలిగానే కాక సరఫరా వ్యవస్థగా భారతదేశం మారిపోయిందని అమెరికా విదేశాంగ శాఖ ఒక నివేదికలో వ్యాఖ్యానించిందంటే అర్థం చేసుకోవాల్సిందే. ఈ అక్రమ రవాణా 90 శాతం దేశంలోని రాష్ట్రాల మధ్యే సాగుతోంది. బంగ్లాదేశ్ నుంచి యువతులను ఉద్యోగాలు, సినిమాల్లో అవకాశాల పేరున నమ్మించి కోల్‌కతాకు రప్పించి చివరకు వ్యభిచార కూపంలోకి నెట్టివేస్తున్నారు. వయస్సు మళ్లిన తరువాత వారి మూత్రపిండాలు, కాలేయాలతో లక్షల రూపాయల లాభాలతో వ్యాపారం సాగిస్తున్నారని 2014 మార్చిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కళ్యాణ్ జ్యోతిసేన్ గుప్తా వెల్లడించడం వాస్తవ సంఘటనలకు దర్పణం పడుతుంది. ఇటువంటి అక్రమాలు, నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. ఢిల్లీనే కేంద్రంగా చేసుకుని నాలుగువేల మంది యువతుల రక్తమాంసాలతో వ్యాపారం సాగిస్తూ కొన్ని కోట్లు గడించిన ఓ జంట నిర్వాకం నాలుగైదు నెలల క్రితం బయటపడింది. ఈ జంట ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాలపై దృష్టి పెట్టి ఏజెంట్ల వ్యవస్థతో దేశమంతటా వ్యవహారాలు నిర్వహించి పదేళ్ల కాలంలోనే 250 కోట్లు గడించారంటే ఆశ్చర్యం కలుగుతుంది. మంచి ఉద్యోగం ఇప్పిస్తామని, పెళ్లి చేయిస్తామని, సినిమా నటులుగా మారుస్తామని మాయమాటలు చెప్పి యువతులను లొంగదీసుకుంటున్నారు. అంతకూ వారు దారికి రాకపోతే బెదిరించి హింసిస్తున్నారని తీస్‌హజారీ కోర్టులో పోలీసులు దాఖలు చేసిన 3895పేజీల అభియోగపత్రాలే వాస్తవాలు వెల్లడిస్తున్నాయి. దక్షిణ, తూర్పు ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లోని మానవ అక్రమరవాణాలో సగానికి సగం లైంగిక దోపిడీ కోసమే సాగుతున్నాయని యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్‌డ్రగ్స్ అండ్ క్రైమ్ (యుఎన్‌ఒడిసి) వెల్లడించింది. భారతదేశంలో ప్రతి ఎనిమిది నిమిషాలకు ఓ బాలిక తప్పిపోతున్నట్టు అంతర్జాతీయ కార్మికసంస్థ గత ఏడాది జనవరిలో ప్రకటించింది. ఇంతవరకు కొన్ని లక్షల మంది ఈ విధంగా వంచనకు గురై పడుపువృత్తికి బలయి ఉంటారని కార్మిక సంస్థ అభిప్రాయపడింది. ఈ విషసంస్కృతిని నివారించడమేకాదు, ఇందులోంచి బయటపడినవారికి తగిన పునరావాసం కల్పించాలని ఐక్యరాజ్య సమితి సూచించింది. ఇటువంటి దురాగతాలను అరికట్టడానికి యువతులకు రక్షణ కల్పించడానికి గత ఏడాది జూన్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బిల్లు ముసాయిదాను సిద్ధం చేసింది.

అక్రమ రవాణాను నియంత్రించడానికి మూడంచెల వారీగా కమిటీలు, కేసులు విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు, నేరస్తులకు పదేళ్ల జైలు శిక్ష, జరిమానా తదితర ప్రతిపాదనలతో బిల్లు రూపొందించింది. అయితే ఈ బిల్లు సమగ్రంగా లేదన్న విమర్శలు రావడంతో బిల్లు వాయిదాపడింది. నేషనల్ క్రైమ్ రికార్డ్సు బ్యూరో వివరాల ప్రకారం 2014లో మనుషుల అక్రమరవాణా కేసులు 5466 నమోదు కాగా 2015లో 6877 కేసులు నమోదయ్యాయి. అత్యధిక కేసులు అస్సాంలోనే నమోదయ్యాయి. తరువాత స్థానంలో పశ్చిమబెంగాల్ ఉంది. మనుషుల అక్రమ రవాణా అనేక రూపాల్లో సాగుతోంది. ముఖ్యంగా 76శాతంలైంగిక సంబంధ నేరాలే. దేశంలో వెట్టిచాకిరీ కింద అనేక మంది నలిగిపోతున్నారు. 2016లో వెలువడిన ప్రపంచ బానిసత్వ సూచిక ప్రకారం భారతదేశంలోనే అత్యధికంగా బానిస జీవితాలు ఉన్నట్టు స్పష్టమయింది. 1.3 బిలియన్ జనాభాలో 18.35మిలియన్ జనాభా వెట్టిచాకిరీలోనే మగ్గిపోతున్నారు. 1.2 మిలియన్ బాలికలుబలవంతంగా వ్యభిచారంలోకి నెట్టివేయబడుతున్నారు. ఇది గ్రామాల్లోని నిరుపేద కుటుంబాల్లో ఎక్కువగా కొనసాగుతోంది. కటికపేదరికం, చదువులేకపోవడం, తదితర కారణాల వల్ల బాలికలు తమ కుటుంబాలకే తాము భారంగా ఉన్న అభిప్రాయంకలుగుతోంది. తరచుగా వీరినివిక్రయించడం లేదా యుక్త వయసు రాకముందే ఎవరికో ఒకరికిచ్చి పెళ్లిచేయడం జరుగుతోంది. చివరకు లైంగిక సంబంధ రవాణాకు దారితీస్తోంది. వీధుల బడి అడుక్కోవడం కన్నా ఈ విధంగా ఏదో పనిచేస్తూ బతకడమే నయం అన్న నమ్మకం అణగారిన బడుగువర్గాల్లో వెంటాడుతోంది. వీరికి వ్యభిచారం చేయాలన్న ఉద్దేశ్యం లేకపోయినా సమాజం వారిని తమ బలహీనతలకు అనుగుణంగా వినియోగించుకుంటోంది. ఇటువంటి నేరాలకు పాల్పడిన వారిపై దేశంలో తక్కువగానే కేసులు నమోదవుతున్నాయి. తగిన సమాచారం లేక, కోర్టుల చుట్టూ తిరగలేక, చాలా కేసులు తరచుగా రద్దవుతున్నాయి. మనుషుల అక్రమ రవాణా కేసులను వాదించే న్యాయవాదులు ప్రత్యేకశిక్షణ తీసుకోవాల్సిన అవసరం ఉంది. సమాచార సేకరణ సమర్థంగా ఉండాలి. విచారణ మరింత పకడ్బందీగా జరగడానికి తోడ్పడాలి. అప్పుడే బాధితులకు న్యాయం అందుతుంది.

టిడిపికి నంద్యాల కిక్కు

- ఉపకరించిన అభివృద్ధి తాయిలాలు
- ఉపయోగపడిన పదవుల పంపిణీ
- ఊతమిచ్చిన సానుభూతి పవనాలు

బల్లేపల్లి శ్రీనివాసరావు/అమరావతి

నంద్యాల ఉప ఎన్నికల్లో సాధించిన విజయం తెలుగుదేశం పార్టీలో నూతనోత్సాహాన్ని నింపింది. ఇంటా, బయటా అనేక సమస్యలతో పోరాడుతున్న ఆ పార్టీ అధిష్ఠానానికి నంద్యాల ఓటర్లు నూత సత్తేజాన్ని ఇచ్చారు. ఒకవైపు కేంద్రం ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ దక్షిణాదిన పాగా వేయాలన్న లక్ష్యంలో భాగంగా రాజకీయంగా ఇబ్బందులు సృష్టిస్తుండడం, కేంద్రం నుంచి నిధుల విడుదల విషయంలో జాప్యం చోటు చేసుకుంటుండడంవల్ల తలెత్తుతున్న సమస్యలు. ఇంకోవైపు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ తర్వాత సొంత పార్టీలోనే ధిక్కారస్వరాలు పెరిగిపోవడం, కొందరు నాయకులు ప్రతిపక్ష పార్టీ అధినేతతో టచ్‌లో ఉంటున్నారన్న ప్రచారాలు, నియోజక వర్గాల పునర్విభజన జరగదని తేలిపోవడం, కాపు రిజర్వేషన్ల కోసం ముద్రగడ పద్మనాభం చేపట్టిన ఉద్యమం, మరోవైపు ఇటీవలనే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్లీనరీ విజయవంతం కావడం రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ దూకుడు ప్రదర్శిస్తుండడం తెలుగుదేశం పార్టీ నాయకత్వాన్ని ఇబ్బందిపెడుతున్నాయి. ఇంటా, బయటా ముట్టుముడుతున్న సమస్యలతో సతమతమవుతున్న సమయంలో నంద్యాల ఉప ఎన్నికల్లో లభించిన విజయం అధికారపార్టీని అనేక సమస్యల నుంచి గట్టెక్కించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎన్నికలంటే పెద్ద ఆసక్తి చూపని తెలుగుదేశం పార్టీకి భూమా నాగిరెడ్డి మరణంతో అనివార్యమైన నంద్యాల ఉప ఎన్నికలు రావడం కొంత ఇబ్బందికరంగానే మారాయి. నంద్యాలలో పోటీచేసే అవకాశంకోసం జరిగిన వర్గ పోరు నేపథ్యంలో, మూడేళ్ళ నుంచి పార్టీకి అండగా ఉన్న శిల్పా మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయి, ప్రత్యర్థిగా మారడం, కొందరు స్థానిక సీనియర్ నేతలకు, మంత్రి భూమా అఖిల ప్రియకు మధ్య తలెత్తిన విభేదాలు తెలుగుదేశం పార్టీని ఎన్నికల ప్రకటనకు ముందు కొంత చికాకు పరిచాయి. అయితే, సుదీర్ఘ రాజకీయ అనుభవం, ఎన్నికల ప్రణాళిక, నిర్వహణలో దిట్టగా పేరు గాంచిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీ శ్రేణులన్నింటినీ సమష్టిగా నడిపించడంతోపాటు, ఎవరికి ఏ వరమిస్తే కరుణిస్తారో గ్రహించి మరీ సందర్భానుసారం నిర్ణయాలు ప్రకటించి నంద్యాలలో విజయవంతమయ్యారు. రాష్ట్ర కేబినెట్‌లోని మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు, సీనియర్ నాయకులు, యువ బృందాలను నంద్యాలకు తరలించి ఓటర్లను తెలుగుదేశం వైపు తిప్పడంలో కృతకృత్యులయ్యారు.

అచ్చొచ్చిన అభివృద్ధి నినాదం

నంద్యాల పారిశ్రామిక, వ్యవసాయ, వాణిజ్య కేంద్రం. ఇక్కడ ప్రజల్లో ఎక్కువ మంది సాధారణ, పేద కుటుంబాల వారే ఎక్కువ. రోజువారీ పనులు చేసుకుని జీవించే వారు ఎక్కువ. అభివృద్ధి నినాదంతో ముందుకుపోయిన తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రకటనకు ముందు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి కొన్ని పనులు చేపట్టడం ద్వారా ఆశలు కల్పించారని చెప్పవచ్చు. మూడు సంవత్సరాలుగా అభివృద్ధికి కొంత దూరంగా ఉన్న నంద్యాల ప్రజలు తీవ్ర అసంతృప్తిగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో అందివచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలనే అభిప్రాయం అంతర్గతంగా ప్రజల్లో బాగా చొప్పుకుపోయింది. ఈ ఉప ఎన్నికల్లో ఎవరు గెలిచినా ఏడాదిన్నరే ఉండేది. 2019 ఎన్నికల్లో ఎలాగైనా చూసుకోవచ్చు, ప్రస్తుతం తెలుగుదేశం పార్టీని గెలిపించి అభివృద్ధి పనులు చేయించుకుందాం అనే అభిప్రాయం ఎక్కువగా వ్యక్తమయ్యింది. ఒకవేళ వైసీపీని గెలిపిస్తే నంద్యాలలో పనులు జరగవన్న ప్రచారం బాగా జరిగింది. ముఖ్యంగా ఈ ప్రభావం తటస్థులపై ఎక్కువగా ఉండడం అధికార పార్టీకి కలిసొచ్చిన అంశం.

భూమా కుటుంబంపై సానుభూతి

నంద్యాలలో టిడిపి భూమా బ్రహ్మానందరెడ్డి విజయం సాధించడంలో కలిసొచ్చిన ప్రధాన అంశాల్లో సానుభూతి పవనాలు. భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డి మరణంతో వారి పిల్లలు అనాథలయ్యారు, వారిపై పోటీపెట్టడమేమిటి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా వ్యవహరిస్తుందంటూ తెలుగుదేశం పార్టీ చేపట్టిన ప్రచారం బాగానే పనిచేసింది. మంత్రి భూమా అఖిలప్రియ, అభ్యర్థి బ్రహ్మానందరెడ్డితోపాటు భూమా నాగిరెడ్డి మరో ఇద్దరు పిల్లలు, వారి కుటుంబం ప్రతి ఓటరును కలిసే వేయడం ఓటర్లపై బాగా ప్రభావం చూపింది. భూమా కుటుంబం మొత్తం బాగా కష్టపడింది. ఈ ఎన్నికల్లో భూమా బ్రహ్మానందరెడ్డి విజయం సాధించకపోతే రాజకీయంగా ఆ కుటుంబానికి బాగా ఇబ్బందులుంటాయన్న విశ్లేషణలు కొంత సానుభూతిని తెచ్చిపెట్టాయి.

సామాజిక వర్గాలకు వరాలు

నంద్యాలలో అత్యధికంగా ఉన్న ముస్లిం సామాజిక వర్గాన్ని ఆకట్టుకోవడానికి ముఖ్యమంత్రి ప్రకటించిన తాయిలాలు ఉపయోగపడ్డాయి. నంద్యాలకు చెందిన సీనియర్ నాయకుడు, మైనార్టీ వర్గానికి చెందిన ఎన్.ఎండీ.ఫరూక్‌ను గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యునిగా నామినేట్ చేయడంతోపాటు, నౌమాన్, జలీల్‌ఖాన్ వంటి వారికి పదవులు ఇవ్వడం, ముస్లింలకే శాసనమండలి ఛైర్మన్ పదవి ఇస్తానని చెప్పడం ఆ సామాజికవర్గంపై పనిచేసింది. వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోఆర్డినేటర్‌గా, కేబినెట్‌లోని పలువురు మంత్రులు, నేతలు రంగంలో దిగి అమలు చేసిన పక్కా ప్రణాళిక, కులాలవారీగా నిర్వహించిన ఆత్మీయ సమావేశాలు ఫలించాయి. వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరి చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో చోటుదక్కించుకున్న చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి ప్రభావం కొంత పడిందని చెప్పవచ్చు. గోస్పాడు నియోజకవర్గంలో వీరి బంధువర్గం తెలుగుదేశానికి చేరువైందని చెప్పవచ్చు. తెలుగుదేశం పార్టీ ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహించి, వెనువెంటనే లోపాలను సవరించుకుంటూ అమలుచేసిన వ్యూహాలు ఫలితాలు ఇచ్చినట్లే.

జగన్‌కు ఇక రాజకీయ సన్యాసమే

నంద్యాల ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారు: మంత్రి దేవినేని



సోమవారం సిఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి దేవినేని ఉమ

విజయవాడ, ఆగస్టు 28, ప్రభాతవార్త: నంద్యాల నియోజకవర్గ ప్రజలు చాలా వివేకంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలనకు పట్టం కట్టే విధంగా తీర్పును ఇచ్చారని, ఈ విజయం ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. సోమవారం ఉదయం నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి అఖండ మెజార్టితో విజయం సాధించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి మంత్రి దేవినేని ఉమ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహిస్తున్న జగన్‌కు చెంపపెట్టు అన్నారు. జగన్‌కు నంద్యాల ప్రజలు ఇచ్చిన తీర్పు రాజకీయ సన్యాసమేనని పేర్కొన్నారు. నంద్యాల ప్రజల తీర్పుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దుకాణం మూత పడిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా జగన్ పార్టీ నాయకులు నోరుమూసుకోవాలన్నారు. ప్రత్యేక హోదా సాధనకోసం తమ ఎంపీలను రాజీనామా చేయిస్తానని ప్రకటించిన జగన్ ఉబలాటపడ్డాడని, మటా తప్పని, మడమ తిప్పని వంశమన్నాడు. ఎంపీలతో రాజీనామా చేయించమనండి ఆ ఎన్నికల్లో తేల్చుకుందామని మంత్రి ఉమ జగన్‌కు సవాల్ విసిరారు. అంతిమ విజయం తమదేనని, 2019ఎన్నికల్లో కూడా విజయం సాధిస్తామని తెలిపారు. ప్రజలు అభివృద్ధిని, సంక్షేమ కారయ్రక్రమాలు కోరుకున్నారని, నంద్యాల ఎన్నిక ప్రచారంలో జగన్ దుర్మార్గంగా మాట్లాడారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడిని కాల్చేయాలని, ఉరి వేయాలని మాట్లాడిన మాటలు నంద్యాల ప్రజలు విన్నారని పేర్కొన్నారు. ఓటు అనే ఆయుధంతో వైసీపీకి బుద్ధి చెప్పారన్నారు.ఇప్పటికైనా తన పార్టీని మూసేసి కేసుల వ్యవహారం చూసుకోవాలని హితవు పలికారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో అడ్డుపతున్నారని, అమరావతి విషయంలో కూడా కోర్టుల్లో కేసులు వేస్తున్నారని తెలిపారు. మొత్తంగా వైసీపీ దుకాణం మూతపడిందని తెలిపారు. నంద్యాల నియోజకవర్గ ప్రజలు ముఖ్యమంత్రి మీద నమ్మకంతో చేస్తున్న అభివృద్ధి పనులకు గుర్తింపుగా భూమా బ్రహ్మానందరెడ్డిని భారీ మోజార్టీతో గెలిపించారన్నారు.

2019లో టిడిపి ఘనవిజయం

ఖాయం: మంత్రి అమరనాథరెడ్డి



సోమవారం పలమనేరులో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు రూరల్, ఆగస్టు 28, ప్రభాతావార్త: 2019లో జరుగబోయే ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం ఖాయమని పరిశ్రమల శాఖా మంత్రి అమరనాథరెడ్డి తెలిపారు. సోమవారం చిత్తూర్రు జిల్లా పలమనేరులోని టిడిపి పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించడం ఖాయమనడానికి నంద్యాల ఉప ఎన్నికల టిడిపి ఘన విజయమే నిదర్శనమని తెలిపారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని తప్పుడు ప్రచారాలు చేసిన ప్రతిపక్ష పార్టీకి ప్రజలే గుణపాఠం చెప్పారన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్నందువల్లే గెలిచారని ప్రతిపక్ష నాయకులు మాట్లాడడం సరికాదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమనే నంద్యాల ప్రజలు టిడిపిని గెలిపించారని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికై ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జగదీష్ నాయుడు, కౌన్సిలర్ కుట్టి, నాయకులు గిరి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వర్షాభావంతో ఎండిపోతున్న పంటలు

- ఆయిల్ సీడ్ 65 శాతం సాగు
- చెరుకు 73 శాతం - ముందుకు సాగని ఖరీఫ్

హైదరాబాద్, అగస్టు 28, ప్రభాతవార్త: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు కురియక వేసిన చేలు సైతం ఎండిపోతున్నాయని రైతాంగం ఆందోళన చెందుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజనులో నాట్లు వేసే సమయం ముగియనుండగా, పలు జిల్లాల్లో 70 శాతం కూడా పంటలు సాగు కాలేదు. విజయనగరం జిల్లాలో 52 శాతం, విశాఖపట్నంలో 60 శాతం, గుంటూరు లో 68 శాతం, ప్రకాశంలో 46 శాతం, నెల్లూరులో 44 శాతం, కడప జిల్లాలో 45 శాతం, అనంతపురంలో 48 శాతం చొప్పున ఖరీఫ్ సాగు వేశారు. మిగిలిన జిల్లాల్లో 80 శాతంపైగా నాట్లు పడినా ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయి. రాష్ట్రంలో మొత్తం మీద ఆయిల్ సీడ్స్ 56 శాతం, ఆహార ధాన్యాలు 68 శాతం చొప్పున సాగయ్యాయి. వీటిలో వరి 67 శాతం, రాగి 54 శాతం, పెసలు 55 శాతం, మిర్చి 24 శాతం, చెరకు 69 శాతం, ఉల్లి 50 శాతం, సోయాబీన్, పొద్దుతిరుగుడు 12 శాతం చొప్పు సాగయ్యాయి. కాగా పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను సరఫరా చేశామని ప్రభుత్వం చెబుతున్నా పశ్చిమ డెల్టా రైతులు దాన్ని పట్టించుకోలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 13,38,035 ఎకరాలు కాగా, ఇప్పటి వరకూ 7,83,765 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో 4,63,527 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. గత ఏడాది ఇదే సమయానికి 1,02,105 ఎకరాల్లో మిర్చి సాగు చేయగా, ఈసారి కేవలం 29,810 ఎకరాల్లో మాత్రమే సాగైంది. నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలో ఈ ఏడాది వరి సాగు చేసే అవకాశం లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా పత్తి సాగు చేస్తున్నారు. అపరాలు వేసేందుకు కూడా ఆసక్తి చూపడం లేదు. అదేవిధంగా తూర్పుగోదావరి జిల్లాలో ఖరీఫ్ వరి నాట్లలో జాప్యం కొనసాగుతూనే ఉంది. మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో నాట్లు వేసేందుకు సరిపడా నీరు అందుబాటులో లేక అక్కడి రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఇక్కని కొన్ని జలాశయాల నుండి జూలై మూడో వారంలో నీటిని విడుదల చేయపోవడంతో కొంత మేర నాట్లు ప్రారంభమైనా ఇంకా మందకొడిగానే సాగుతున్నాయి ఇప్పటి వరకూ డెల్టా ప్రాంతలో దాదాపు 95 శాతం నాట్లు పూర్తికాగా, మెట్ట ప్రాంతంలో 60 శాతం మేర జరిగినట్లు అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో రైతులకు సాగు నీటి విడుదలలో ఆలస్యం కావడంతో నాట్లకు ఇబ్బందులు తలెత్తాయి. జూలై చివరి వారం, అగస్టు నుండి వరి నాట్లు ఊపందుకున్నా శివారు ప్రాంతాలకు సాగు నీటి సమస్య వెంటాడుతోంది. మెట్ట, ఏజెన్సీలో 2,32,502 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటి వరకూ 1.94 లక్షల హెక్టార్లలో నాట్లు పడ్డాయి. అలాగే విజయనగరం జిల్లాలో వ్యవసాయ సీజన్‌లో వర్షపాతంలో లోటు ఏర్పడింది. దీని ప్రభావం సాగుపై పడింది. నేటికి రైతులు పర్తి స్థాయిలో సాగుకు సన్నద్ధం కాలేదు. జిల్లాలో ప్రధాన వరి పంట 1.18 లక్షల హెక్టార్లలో సాగవుతుండగా, ఇప్పటి వరకూ 2,250 హెక్టార్లలో మాత్రమే సాగు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక నెల్లూరు జల్లాలో రైతులు వరుణుడి కోసం ఆర్తిగా ఎదురు చూస్తున్నారు. వర్షాలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు వేరుశెనగ విత్తనాలు నాట లేదు. ఈనెల ఆరంభం నుండి వాతావరణంలో తేమ ఉంటున్నా ఆశించినంత స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో మెట్ట ప్రాంత రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వరి నాట్లు వేసిన రైతులు, విత్తలు పూర్తి చేసిన ఇతర పంటలు ఎండిపోవడంతో ఇప్పటి వరకూ పెట్టిన పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. కాగా కేసీ కెనాల్ లక్ష ఎకరాలకు పైగా సాగునీరును అందిస్తోంది. ఈ ప్రాజెక్టుల కింద ఈ సారి సాగు ప్రశ్నార్థకంగా తయారైంది. వీటికి అదనంగా శ్రీశైలం నుండి నిర్మించిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ కూడా ఉంది. అయితే ఖరీఫ్‌కు సరిపడా నీరు అందించే అవకాశాలు లేకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని మరో జిల్లా కడపలో 50 మండలాలకుగాను 17 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, 27 మండలాల్లో వర్షపాతం తక్కువగా నమోదైంది. ఈ జిల్లాలో 1,51,120 హెక్టార్ల సాధారణ విస్తీర్ణంకాగా, ఇప్పటికి 61,822 హెక్టార్లలో సాగైంది. ఖరీఫ్ సాగు గడువు దగ్గర పడుతున్నా ఇప్పటికీ వర్షాభావంతో నామమాత్రంగానే పంటలు సాగు చేశారు. సాగు నీటి ప్రాజెక్టులు ఉన్నా వాటిలో నీరు లేదు. కృష్ణా జలాలు ఈ ఏడాది జిల్లాలో సరఫరా అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. నదులన్నీ ఎండిపోగా, చెరువుల్లో చుక్కనీరులేక నెర్రెలు బారాయి. వేసిన పంటలు కూడా ఎండిపోతున్నాయి. వేరుశెనగ రైతుల పరిస్థితి అయోమయాన్ని ఎదుర్కొంటున్నారు. దుక్కులు పూర్తయి అయినా వర్షాలు లేకపోవడంతో విత్తనం గింజలు ఇళ్లలోనే మగ్గుతున్నాయి. దీంతో ఈ జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు మండలాల వారీగా అధ్యయనం చేస్తున్నారు.

టిడిపి పాలనపట్ల ప్రజల్లో పూర్తి విశ్వాసం

- బ్రహ్మానందరెడ్డి గెలుపు అభివృద్ధికి మలుపు
- ఎన్నికల ప్రచారంలో భయానక వాతావరణం సృష్టించిన వైఎస్సార్సీ
- అభివృద్ధికి అడ్డుపడుతున్న జగన్: మంత్రి శిద్దా



గుంటూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త ప్రతినిధి: నంద్యాలలో టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిని గెలిపించటం ద్వారా నంద్యాల ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన పట్ల ప్రజలు పూర్తి విశ్వాసాన్ని, నమ్మకాన్ని వ్యక్తం చేశారని ఇది ప్రజా విజయమని అటవీశాఖా మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. నంద్యాల కౌంటింగ్ పూర్తయిన తరువాత సోమవారం ఆయన సచివాలయంలో ఒక ప్రకటన విడుదల చేశారు.ఇదే స్ఫూర్తితో 2019 ఎన్నికల్లో కూడా విజయం సాధిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధికి,అభివృద్ధి నిరోధకలకు మధ్య జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు తేదేపా పక్షాన నిలబడి చారిత్రాత్మక తీర్పు వెలువరించారని హర్షంవ్యక్తంచేశారు. నంద్యాలలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలకు ఈ విజయం మరింత ఊతం ఇస్తుందని అభిప్రాయపడ్డారు.నంద్యాలలో ఓటమిని అంగీకరించకుండా జగన్ విలువలు,విశ్వసనీయత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అసభ్యపదజాలంతో దూషించటం ద్వారా నంద్యాలలో భయానక వాతావరణం సృష్టించి దాని ద్వారా లబ్ది పొందాలనుకున్న జగన్ భంగపడ్డారని, ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని ప్రజలు తమ విలక్షణ తీర్పులో పేర్కొన్నారన్నారు. నంద్యాలలో విజయం సాధిస్తామని డాంబికాలు పలికిన జగన్ అండ్‌కో ఇప్పుడు ప్రజలకు ఏమని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. భూమా నాగిరెడ్డి కలలు కన్న విధంగా నంద్యాలను అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి కార యక్రమాలకు జగన్ అడ్డుపడి, అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ఇదెంత మాత్రం హర్షణీయం కాదన్నారు. రాష్ట్రంలో జరిగే అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు జగన్ అడ్డుపడితే ప్రజా కోర్టులో దోషిగా నిలబడాల్సి వస్తుందని మంత్రి హెచ్చరించారు. రాష్ట్రంలో వైకాపా త్వరలో కనుమరుగుకానుందని జోస్యం చెప్పారు. అభివృద్ధి మంత్రంతోనే నంద్యాలలో తెలుగుదేశం పార్టీ విజయబావుటా ఎగురవేసిందని మంత్రి సిద్దా రాఘవరావు అన్నారు.

నంద్యాలలో టిడిపి గెలుపునకు అభివృద్ధి మంత్రం

- పనిచేసిన భూమా నాగిరెడ్డి మరణ సానుభూతి
- కలిసొచ్చిన ముఖ్యమంత్రిపై వైఎస్సార్సీనేత అనుచిత వ్యాఖ్యలు

కర్నూలు, ఆగస్టు 28, ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన నంద్యాల ఉప ఎన్నికల్లో తెదేపా,వైకాపా నువ్వా,నేనా అంటూ పోటీపడగా ఈ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానంద రెడ్డి ఘన విజయం సాధించారు. ఈ విజయం వెనుక టిడిపికి చెందిన మంత్రుల వద్ద నుంచి అపార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వివిధ సామాజిక వర్గాల కృషి విశేషంగా పనిచేసిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా నంద్యాల నియోజకవర్గంలో రూ.1550కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టడం కూడ కలిసొచ్చింది. అలాగే దివంగత ఎంఎల్ఏ భూమా నాగిరెడ్డి ఆకస్మిక మరణం ఆపార్టీకి తీరనిలోటుగా మిగలగా ఈ ఎన్నికల్లో భూమా అన్న కుమారుడైన భూమా బ్రహ్మానందరెడ్డిని రంగంలో దించడంతో సానుభూతి కలిసి వచ్చింది. ముఖ్యంగా మంత్రి భూమా అఖిల ప్రియతో పాటు వారి కుటుంబం మొత్తం నంద్యాల ఎన్నికల రంగంలోకి దిగి విస్తృతంగా ప్రచారం నిర్వహించడం,బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని ఇంటింటా తిరిగి ప్రచారం చేయడం కలిసొచ్చింది. వైకాపా అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఉప ఎన్నికల్లో 15 రోజుల పాటు నంద్యాల్లో ప్రచారం నిర్వహించి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన మంత్రి వర్గంపై అనుచితంగా మాట్లాడటం కూడ ఓటర్లు టిడిపి వైపు చూసేందుకు కారణమైంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబును నడిరోడ్లో ఉరితీయాలి, కాల్చిపారేయాలి, బట్టలు ఊడదీస్తా అన్న వ్యాఖ్యలు ఓటర్లను తీవ్రంగా ఆలోచింప చేశాయి. అదే విధంగా ఈ ఎన్నికల్లో ఇరు పార్టీలు పెద్ద ఎత్తున నోట్లను పంపిణీ చేసినట్లు ప్రచారం వుంది. అయితే రెండువైపుల నోట్లను తీసుకున్న జనం మౌనంగా తమ ఓటును టిడిపికి వేసి గెలిపించినట్లు వాదన వినిపిస్తుతంది. ప్రచారానికి ముందు నంద్యాల్లో ఇరుపార్టీల్లో మెజార్టీ ఎవ్వరికి వస్తుందన్న అంశంలో ఓ విధంగా ఉండగా, ప్రచారం ముగిసిన తర్వాత పోలింగ్ రోజుకు మరో విధంగా ట్రెండ్ మారింది. ఈ క్రమంలోనే నంద్యాల పట్టణంలో తెదేపాకు మెజార్టీ వస్తుందని భావించగా, ఇక గ్రామీణ ప్రాంతాల్లో వైకాపా ఆధిక్యం వస్తుందని అందరు బావించారు. అయితే ఓటర్లు వీటన్నింటిని కాదని మౌనంగా ఓటు వేశారు. ఈ క్రమంలోనే నంద్యాల పట్టణంలో 20వేల ఓట్ల ఆధిక్యత రాగా,నంద్యాల రూరల్, గోస్పాడులో మండలంలో 7వేల ఓట్లకుపైగా ఆధిక్యతను సాధించిందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. వీటితో పాటు ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో తెదేపా పార్టీ ఉండటం కూడ ఈ ఎన్నికల్లో ఆపార్టీని ఆదరించేందుకు కారణమైందని అభిప్రాయం వుంది. ప్రస్తుతం వైకాపాకు ఓటు వేసి గెలిపించిన ఎటువంటి ప్రయోజనం ఉండదని, ఇదే తెదేపాకు ఓటు వేస్తే నంద్యాల పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలు అభివృద్ధి జరుగుతుందనే అభిప్రాయం ఓటర్లకు కలుగడం కూడా ఓ కారణంగా పేర్కొనవచ్చు. ఒక వేళ వైకాపా గెలిపిస్తే నంద్యాల పట్టణంలో అభివృద్ధి నిలిచిపోతుందనే భయం కూడ ఓటర్ల లో ఉండటం తెదేపా గెలిచేందుకు కారణంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంతేగాకుండా నంద్యాల నియోజక వర్గంలో అధికంగా ఉన్న ముస్లిం, మైనార్టీలు, బిసిలు, వ్యాపారస్తులు, కాపులు, ఇతర వర్గాల వారితో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశం కావడం, ఆయా వర్గాలకు ఎన్నికల అనంతరం అదరించనున్నట్లు పేర్కొనడం వంటి అంశాలు ఇక్కడ కలిసొచ్చాయి. వీటితో పాటు ఈ ఎన్నికల్లో జిల్లా ఇంచార్జీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, ఉప ముఖ్యమంత్రి కెఇ క్రిష్ణమూర్తి, మంత్రులు ఆదినారయణరెడ్డి, సోమిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు టిజి వెంకటేశ్, ఇపిఐడిసి చైర్మన్ కెఇ ప్రభాకర్, టిడిపి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు యాదవ్, జెడ్‌పి చైర్మన్ మల్లేల రాజశేఖర్, ఇలా మొత్తంగా తెదేపా శ్రేణులంతా ఐక్యంగా కలిసి పనిచేయడం వల్ల అ పార్టీ ఘన విజయం సాదించేందుకు దోహదపడింది.

బిసి ఫెడరేషన్‌ల ఆర్థిక సహకార పథకాలకు నూతన మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని 10 బిసి ఫెడరేషన్స్ ఆర్థిక సహకార పథకాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త మార్గ దర్శకాల ప్రకారం బిసి ఫెడరేషన్ స సభ్యులకు ఇచ్చే రుణాల యూనిట్ సబ్సిడీని 50 శాతానికి పెంచింది. రెండు లక్షల లోపు రుణానికి సబ్సిడీని 50 శాతానికి, అదే 15 మంది సభ్యులు గల సొసైటీకైతే రూ.30 లక్షల వరకు రుణానికి సబ్సిడీని 50 శాతానికి పెంచారు. మిగితా 50 శాతం బ్యాంకు రుణంగా ఇస్తుంది. మొత్తానికి ఒక్కో సభ్యుడికి రెండు లక్షలు , సొసైటీకైతే 30 లక్షలు రుణంగా అందజేయడం జరుగుతుంది. గతంలో ఇది ఒక్కో సభ్యుడికి రుణం రూ.50 వేలు, సొసైటీలకైతే రూ. 7 లక్షల 50 వేలు ఇచ్చేవారు. అందులో సబ్సిడీ 50 శాతం ఇవ్వడం జరుగుతోంది. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటి సమావేశంలో పాల్గొన్న 11 బిసి ఫెడరేషన్లు 5గురు సభ్యుల సొసైటీలను యూనిట్‌గా రుణాలు ఇవ్వాలని కోరారు. ఐదు గరు సభ్యులు గల గ్రూపులకు కొలటరల్ సెక్యూరిటీ అవసరం లేకుండా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని పరిగణలోకి తీసుకోవడం జరుగుతుంది. యూనిట్ కాస్ట్ 10 లక్షల ఉన్నట్లైతే సబ్సిడీ గరిష్టంగా 5 లక్షల వరకు అనుమతిస్తారు.

సిఎం చంద్రబాబును కలిసిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ ఎల్వీఎస్కార్కే ప్రసాద్



విజయవాడ, ఆగస్టు 28, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్, జాతీయ మీడియా కమిటీ సమన్వకర్త ఎల్వీఎస్ఆర్కే ప్రసాద్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన నంద్యాల ఉప ఎన్నికలో టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి అఖండ మెజారిటీతో విజయం సాధించడంపట్ల సిఎంకు శుభాకాంక్షలు తెలిపారు.

సోమవారం ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎల్వీఎస్ఆర్కే ప్రసాద్

ప్రయోగానికి సిద్ధమవుతున్న పిఎస్ఎల్‌వి సి-39 రాకెట్

- 31న అంతరిక్షంలోకి 8వ మార్గదర్శి ఉపగ్రహం



ప్రయోగానికి సిద్ధమైన పిఎస్ఎల్‌వి సి-39 రాకెట్

శ్రీహరికోట (తడ), ఆగస్టు 28, ప్రభాతవార్త: శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) మరో రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. ఈ నెల 31న పిఎస్ఎల్‌వి సి-39 రాకెట్‌ను షార్ రెండవ ప్రయోగ వేదిక నుంచి గగనతలానికి గురిపెట్టనున్నారు. భారతీయ 8వ మార్గదర్శి ఉపగ్రహం ఐఆర్ఎన్ఎస్ఎస్ 1హెచ్ ఈ రాకెట్ ద్వారా కక్ష్యలోకి చేరనుంది. స్వదేశీ నావిగేషన్ సేవల కోసం ఇస్రో శాస్త్రవేత్తలు ఇప్పటికే ఏడు నావిగేషన్ ఉపగ్రహాలను ప్రయోగించి ఉన్నారు. ఈ నెల 31న రాకెట్ ప్రయోగానికి 29 గంటల ముందు కౌంట్‌డౌన్ ప్రారంభించనున్నారు. ఇప్పటిదాకా రాకెట్ ప్రయోగ సమయాన్ని 31న సాయంత్రం 6.59 గంటలకు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అంతరిక్షంలో నావిగేషన్ ఉపగ్రహాలు ప్రయోగించేటప్పుడు సాధారణంగా సాయంత్రం లేదా రాత్రి సమయాలనే ఇప్పటిదాకా తీసుకున్నారు. ఒక్కో ఉపగ్రహానికి సమాంతర శ్రేణిలో మరో నావిగేషన్ ఉపగ్రహాన్ని చేర్చి అన్నింటి సాయంతో ఒకేసారి ఈ సేవలను అందించడానికి ఇస్రో సిద్ధమైంది. వాస్తవానికి గత ఏడాదితోనే నావిగేషన్ ఉపగ్రహాల శ్రేణి పూర్తయినప్పటికీ అవి ఇంకా అందుబాటులోకి రాని కారణంగా మరో ఉపగ్రహం అవసరమైంది. ఈ 8వ ఉపగ్రహం విజయవంతంగా కక్ష్యకు చేరినట్లయితే భారత భూభాగంపై, సముద్ర మార్గంపై, ఆకాశ మార్గంపై కూడా నావిగేషన్ సేవలు మన పరిజ్ఞానంతోనే స్వయంగా అందుకునే అవకాశముంది. ఇప్పటిదాకా విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నావిగేషన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన భారత్ ఇకముందు మన ఉపగ్రహాల ద్వారా సేవలందుకునే అవకాశాల కోసం యావత్ భారతదేశం ఎదురుచూస్తోంది. ఈ ప్రయోగ విజయం కోసం షార్‌లో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఇస్రో పెద్దలు షార్ కేంద్రాన్ని చేరుకొని రాకెట్ ప్రయోగ సన్నాహాల్లో పాల్గొంటున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది

నూతన హాంగులతో పశువులకు, రైతులకు వసతులను ఏర్పాటు చేస్తాం: ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

సంగారెడ్డి, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి: పాలిటెక్నిక్ కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కడియం శ్రీహరి అన్నారు. సోమవారం సంగారెడ్డి మండలం కలబ్‌గూర్ గ్రామంలో పశువుల క్రయ విక్రయాల సంతను, ఇస్మాయిల్‌ఖాన్ పేట పరిధి లోని దాసుగడ్డ తాండలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా విద్యార్థుల అవసరం ఈ పాలిటెక్నిక్ కళాశాల తీరుస్తుందని అన్నారు. ప్రతి పాలిటెక్నిక్ కళాశాలలో బయోమెట్రిక్, ఆర్.ఓ.లు పెట్టామని, అదే విధంగా అన్ని సబ్జెక్టులకు కాంట్రాక్టు లెక్చరర్‌లను నియమించడం జరిగిందన్నారు. దాదాపు, రూ. 325 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాలలకు కొత్త భవనాలు నిర్మించామన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 95 నుండి 98 శాతం విద్యార్థులు ప్రవేశాలు పొందారని, ప్రైవేట్ కళాశాలలో 60 శాతం కూడ నిండలేదని ఆయన పేర్కొన్నారు. శ్రద్ధగా పని చేస్తే ప్రభుత్వ సంస్థల పని తీరు ఏ విధంగా ఉంటుందో తెలియడానికి ఇది ఒక మచ్చుతునక లాంటిదని అన్నారు. పార్లమెంట్ సభ్యులు ,స్థానిక శాసనసభ్యుల చొరవతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ యేడాది 50 వేలమంది విద్యార్థులు నమోదు పెరిగిందని అన్నారు. కళాశాలకు చాల పనులు చేయాల్సిన అవసరముందన్నారు. కళాశాలకు ప్రహారీ గోడ ,అప్రోచ్‌రోడ్డు, బాలికలకు వసతి గృహం లేదని, ఊరికి దూరంగా కళాశాల ఉన్నందున వసతి గృహా నిర్మాణం చేపట్టాల్సిన అవసర ముందన్నారు. రోడ్డు, బాలికలవసతిగృహం, కళాశాల మొదటి అంతస్తు నిర్మాణాలకు 6 నుండి 7 కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా రోడ్డు నిర్మాణం ప్రహారీ గోడకు అంచానా ప్రతిపాదనలు పంపినట్లైతే పరిపాలన మంజూరీ ఇస్తామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. కలబ్‌గూర్‌లో పశువుల సంత ప్రారంభించిన అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ పశువుల క్రయ విక్రయాలు నిర్వహించేందుకు రూ. 75 లక్షల నిధులతో నూతన హాంగులతో పశువులకు,రైతులకు వసతులను ఏర్పాటు చేశామన్నారు. అందులో భాగంగా పశువులకోసం విశాలమైన మైదానం, ప్రహారి గోడ, రైతుల కోసం షెడ్లు, త్రాగు నీటి కోసం బోరు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. పూర్తి ఆధునాతనంగా పశువుల సంతను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ సంతతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రాజమణి మురళీయాదవ్, పార్లమెంట్ సభ్యులు కొత్తప్రభాకర్‌రెడ్డి, నియోజక వర్గ శాసన సభ్యులు ప్రభాకర్, జాయింట్ కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, కొండల్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, విద్యార్థులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



పాలిటెక్నిక్ కళాశాల భవన ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

రైతన్నకు అండగా రైతు సమన్వయ సమితులు ఏర్పాటు

వ్యవసాయ ఇంజనీరింగ్ కోర్సు చేసే విద్యార్థులు మంచి పేరు తెచ్చుకోవాలి - రైతుకు నాలుగు విధాలుగా సహాయం చేయాలి

రైతు రుణం తీసుకునే స్థితి పోయి రాజుగా ఎదగాలి: వ్యవసాయ మంత్రి పోచారం

సంగారెడ్డి, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి: రైతన్నకు అండగా నిలిచేందుకు రైతు సమన్వయం సమితులను ఏర్పాటు చేసి వారిని సంఘటితం చేసేందుకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కందిమండల కేంద్రంలో వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులలో విద్యార్థుల వసతి గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భగా మంత్రి మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయివరకు రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసి రైతు సమస్యలను తెలుసుకోవడమే కాకుండా పరిష్కరించేందుకు చర్యలు చేపట్లనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ రైతు సమన్వయ సమితులలో అన్ని వర్గాలతో పాటు 1/3 మహిళలకు సభ్యత్వాన్ని కేటాయించడం జరిగిదన్నారు. ఈ సమితులలో అనుభవం ఉన్న రైతులను సభ్యులుగా చేర్చి సలహా సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామ, మండల సమన్వయ రైతులు ఏర్పాటు చేయడమే కాకుండా సమావేశాలు నిర్వహించి ఏ పంట వ్యవసాయం చేస్తున్నారు. విత్తనాలు ఎంత అవసరం పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం తదితర అంశాలపై చర్చిచడం జరుగుతుందన్నారు. రైతు సమన్వయ సమితి సభ్యులను నామినేట్ చేసేందుకు ఇంచార్జ్ మంత్రులకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ మొత్తం ప్రక్రియ సెప్టెంబర్ 9,2017 నాటికి పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. సుమారు రూ 7.30 కోట్ల వ్యయంతో విద్యార్థులకు వసతి గృహాల నిర్మాణం చేపట్టి ప్రారంభించడం జరిగిందన్నారు. కళాశాల ఏర్పడినప్పటి నుండి మౌళిక సదుపాయాల కోసం సుమారు రూ. 25 కోట్లు ఖర్చు చేశామని, మంత్రి తెలిపారు. వ్యవసాయ ఇంజనీరింగ్ కోర్సును అభ్యసించే విద్యార్థులు ఉన్నతమైన భావాలతో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. మౌళిక సదుపాయాలు కల్పించాక అంశాలను అర్థం చేసుకొని బాగా చదువుకోవాల్సిన భాద్యత విద్యార్థులపైన ఉంటుందన్నారు. వ్యవసాయం చేయాలంటే రైతుకు నాలుగు విధాలుగా సహాయం చేయాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయ పడ్డారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు ప్రభుత్వం సరఫరా చేయాలి, పెట్టుబడి, అధికదిగుబడి వచ్చే వంగడాలను సృష్టించడం, కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర వచ్చేలా చర్యలు తీసుకోవడం అని మంత్రి పేర్కొనారు. రైతుల ఆర్థిక స్వాలంభన కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాబోయే రోజులలో బ్యాంకులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రైతులకు ఋణాలు ఇచ్చే పరిస్థితి రావాలని ఆయన ఆశాబావం వ్యక్తం చేశారు.



వసతి గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

చింతపండుపై జిఎస్‌టిని మినహాయించాలి

తెలంగాణ టామరిండ్ మర్చంట్స్ అసోసియేషన్



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యసలహాదారుడు దడువై రాఘవేందర్, అధ్యక్షుడు దడువై ప్రకాష్‌రావులు

హైదరాబాద్,(మలక్‌పేట), ఆగస్టు 28 ప్రభాతవార్త: చింతపండుపై జిఎస్‌టిని మినహాయించాలని తెలంగాణ టమరిండ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దడువై ప్రకాష్‌రావు, ముఖ్యసలహాదారుడు దడువై రాఘవేందర్‌లు డిమాండ్ చేశారు. మలక్‌పేట మహబూబ్‌మాన్షన్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి చింతపండుపై వాట్‌లేదని తెలిపారు. జిఎస్‌టిలో హెచ్ఎస్‌కోడ్ 0810 ప్రకారం చింతపండును ఫ్రూట్‌గా చూపించి చింతపండుపై జిఎస్‌టిని మినహాయించారన్నారు. కాగా హెచ్ఎస్ కోడ్ 0813లో డ్రై టమరిండ్ పై 12శాతం ట్యాక్సు విధించడం జరిగిందని, చింతపండు అనేది డ్రై టమరిండ్ కాదని, కొంతమంది అధికారులు పక్కదోవ పట్టిస్తూ డ్రై టమరిండ్ అంటూ గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. చింతపండు తేమతో కూడుకుని ఉంటుందని, కావున చింతపండుపై జిఎస్‌టిని మినాహాయించాలని డిమాండ్ చేశారు. చింతపండు చెట్టుపై పెరుగుతుందని, వాతావరణ పరిస్థితులను బట్టి చింతపండు చెట్లపై లభిస్తుందని, సిజనల్ ప్రకారంగా చింతపండు లభిస్తుందని వివరించారు. భారీ సంఖ్యలో పేద ప్రజలు చింతపండుపై కుటీర పరిశ్రమగా ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. జిఎస్‌టి సమావేశంలో కేంద్రమంత్రి అరుణ్‌జైట్లి మాట్లాడుతూ వాట్‌లేని వస్తువులపై కొత్తగా జిఎస్‌టి విధించడం జరగదని పేర్కొన్నడం జరిగిందని, చింతపండుపై జిఎస్‌టిని మినాహాయించాలని కోరారు. ఇంతకముందు వాట్ మినాహాయింపు ఉన్న అల్లం, ఎల్లిగడ్డ, బెల్లం మొదలగు కొన్ని వస్తువులపై జిఎస్‌లో కూడా మినాహాయింపు ఇవ్వడం జరిగిందని, కాని చింతపండుకు మినహాయింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ భారతదేశంలో సాంబారు, రసం, పచ్చిపులుసు, పచ్చడి తదితర చింతపండుతో కూడిన వంటకాలతో పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు పూట గడుపుకుంటారన్నారు. పేదప్రజలందరు ఎక్కువగా చింతపండును ఉపయోగిస్తుంటరని, కావును చింతపండుపై జిఎస్‌టిని మినహాయించాలని కోరారు. చింతపండుపై జిఎస్‌టిని మినాహాయించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఈటెల రాజేందర్, కేంద్రమంత్రి బండారు దత్తత్రేయ,తెలంగాణ జిఎస్‌టి కమిషనర్ అనిల్‌కుమార్, ప్రిన్సిపల్ సెక్రటరి సోమేష్‌కుమార్‌లను కలిసి వినతి పత్రాలు సమర్పించి చింతపండుపై జిఎస్‌టిని మినహాయించాలని కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణ, కోశాధికారి దేవత అశోక్, ఉపాధ్యక్షుడు కాలేరు శ్రీనివాస్, సలహాదారుడు దడువై రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎడ్‌సెట్ కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: తెలంగాణలో బీఈడి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎడ్‌సెట్ కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సోమవారం విడుదల చేసింది. ఈనెల 30న కౌన్సిలింగ్ ప్రకటన జారీ చేయనున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 7 నుంచి 12 వరకు అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన, సెప్టెంబర్ 9 నుంచి 16 వరకు ఆప్షన్ల నమోదు ప్రక్రియను చేపట్టనున్నారు. సెప్టెంబర్ 17న వెబ్ ఆప్షన్లను మార్చుకునే అవకాశం కల్పించనున్నారు. సెప్టెంబర్ 20న అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తారు. అలాగే సెప్టెంబర్ 25 నుంచి బీఈడి తరగతులు ప్రారంభం అవుతాయని ఉన్నత విద్యా మండలి తెలిపింది.

ఎన్టీఆర్ భవన్‌లో టి.టిడిపినేతల నంద్యాల సంబురాలు

హైదరాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: నంద్యాల ఉపఎన్నికలో టిడిపి ఘన విజయం సాధించిన సందర్భంగా సోమవారం ఎన్టీఆర్‌భవన్‌లో తెలుగుదేశం తెలంగాణ నేతలు టపాసులు కాల్చి సంబురాలు జరిపారు. నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకున్నారు. ఈకార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అమర్ నాథ్‌బాబు,కార్యక్రమాల కమిటీ జి.బుచ్చిలింగం పాల్గొని ప్రసంగించారు. నందాల్య ఉపఎన్నికలో టిడిపి ఘన విజయం తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రభావం ఉంటుందన్నారు. జగన్ డబ్బుతోగానీ, ప్రశాంత్ కిషోర్ లాంటి వాళ్లతో గాని ఎన్నికల్లో గెలవలేరని ప్రజలు మరొకసారి ఏకపక్ష తీర్పు ద్వారా తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించిన టిడిపికి నంద్యాల ఓటర్లు పట్టం కట్టారని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, టిఎన్‌టియూసి అధ్యక్షుడు బిఎన్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజునాయక్, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సాయిబాబా, నాయకులు దీపక్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌గౌడ్, చంద్రయ్య, రామచంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుతాం

అభద్రతలో సిఎం కెసిఆర్ - టిఆర్‌ఎస్‌ను ప్రజలే పాతరేస్తారు: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

విద్యుత్ అమరవీరులకు కాంగ్రెస్ నివాళి



సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ వద్ద విద్యుత్ అమరవీరులకు నివాళులు అర్పించే కార్యక్రమాల్లో పాల్గొన్న కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: ప్రజావ్యతిరేక విధానాలు అవలంభించిన పాలకులకు ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెబుతారని బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమం రుజువు చేసిందని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమం 17ఏళ్లు అయిన సందర్భంగా బషీర్‌బాగ్‌లోని విద్యుత్ అమరవీరుల స్థూపానికి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో నివాళులు అర్పించారు. అనంతరం గాంధీభవన్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పాలకుల నిరంకుశ విధానాలపై, విద్యుత్ ధరల పెంపుపై అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారని గుర్తు చేశారు. బషీర్‌బాగ్ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన వీరులకు సంతాపాన్ని ప్రకటించారు. టిఆర్‌ఎస్‌పార్టీ ప్రభుత్వం హయాంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజలను తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లలో వ్యవసాయరంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందని, రైతులు అనేక కష్టాలపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతాంగం ఇంత సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఏదో ఓ ప్రైవేటు సంస్థ అవార్డు ఇస్తే గొప్ప అవార్డుగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. భూటకపు సర్వేలు చేస్తూ ముఖ్యమంత్రి టిఆర్‌ఎస్‌కు వంద సీట్లు వస్తాయంటే పూటకో ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కెసిఆర్ రాజకీయ అభద్రతతో కొట్టుమిట్టాడుతున్నారని అందుకే సర్వేల పేరుతో కాలం గడుపుతునా న్నరని ఆయన వివరించారు. ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, రాబోయే రోజుల్లో పాలకులను ప్రజలు రాజకీయంగా పాతరేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు కుమార్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎంఆర్‌జి వినోద్‌రెడ్డి, బొల్లు కిషన్, నిరంజన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అనీల్‌కుమార్ యాదవ్,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద,వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురంలో మినీ స్టేడియానికి ఎకరం స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన శాట్స్‌చైర్మన్



అల్లీపురంలో మినీ స్టేడియాన్ని నిర్మించేందుకు 1 ఎకరం స్థలాన్ని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌కు పత్రాన్ని అందజేస్తున్న శాట్స్‌చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి

ఫతేమైదాన్,అగస్టు 28 ప్రభాతవార్త: అల్లీపురం గ్రామంలో చిన్నచింతకుంట మండలం మహబూబ్ నగర్ జిల్లాలో మినీ స్టేడియం వాలీబాల్ కోర్ట్, బాస్కెట్ బాల్‌కోర్ట్, అడిటోరియంను సర్వే నెం 156, 228లో నిర్మించుటకు అల్లీపురం గ్రామంలో ప్రభుత్వం సహాయముతో నిర్మించుటకు నిర్ణయించడం జరిగింది. అందుకు గాను నాకు సంబంధించిన సర్వే నెం 156 సర్వే 228లో మొత్తం నలబై గుంటలు అంటే ఒక ఎకరానా స్థలంలో పైన తెలిపిన నిర్మాణాలు చేపట్టుటకు ప్రభుత్వానికి ఉచితంగా ఇవ్వడానికి ఇవ్వనున్నట్లు శాట్స్‌చైర్మన్ తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడల అభివృద్ధికి నేను చేస్తున్న కృషికి, కార్యక్రమాలను మీరు చెపట్టగలరన్నారు. మా గ్రామంలో చేపట్టాల్సిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వం, ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నిధుల నుండి పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు.

రైల్వే కోర్టుకు హాజరైన మంత్రులు

కేసు రేపటికి వాయిదా



రైల్వే కోర్టుకు హాజరైన మంత్రులు కెటిఆర్, పద్మారావు, నాయిని

సికింద్రాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: రాష్ట్ర మంత్రులపై రైల్వే కోర్టులో నడుస్తున్న కేసు ఈ నెల 30వ తేదీకి వాయిదాపడింది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నపథ్యంలో 2011లో తెలంగాణ రాజకీయ జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు రైల్‌రోకో జరిగింది. దీనిలో భాగంగా మౌలాలి వద్ద రైలు పట్టాలపై నాటి టిఆర్‌ఎస్ నేతలుగా ఉన్న మంత్రులు కల్వకుంట్ల తారకరామారావు, నాయిని నరసింహారెడ్డి, తీగుళ్ల పద్మారావు తదితరులు బైఠాయించారు. దీంతో రైల్వే పోలీసులు వారిపై కేసులు నమోదు చేశారు. పలుమార్లు కేసు విచారణ నిమిత్తం వారు రైల్వే కోర్డుకు హాజరవుతున్నారు. సోమవారం నాడు బోయిగూడలోని రైల్వే కోర్టుకు మం త్రులు కెటిఆర్, పద్మారావు, నాయిని నరసింహారెడ్డి, ఇతర పార్టీల నేతలు హాజరయ్యారు. అయితే కేసును రైల్వే కోర్టు న్యాయమూర్తి ఈ నెల 30వ తేదీకి వాయిదావేశారు.

బిసి కులాల పునర్వర్గీకరణ, ఎంబిసిల గుర్తింపుపై మేధావులతో బిసి కమిషన్ సమాలోచనలు

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త : రాష్ట్రంలో బిసి కులాల వర్గీకరణ, సంచార కులాలు, ఎంబీసీల గుర్తింపు, నొమాడిక్, సెమినొమాడిక్, విముక్త జాతులపై సమగ్ర అధ్యయనంలో భాగంగా పలు సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, తదితర అంశాలపై తెలంగాణ బిసి కమిషన్ సమాలోచనలు జరిపింది. సోమవారం మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన వర్క్‌షాప్‌లో బీసీ కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు, సభ్యులు డా.వి.కృష్ణమోహన్‌రావు, డా.ఆంజనేయగౌడ్, జూలూరి గౌరీశంకర్, పలు సామాజిక పరిశోధనా సంస్థల అధిపతులు, సామాజిక, ఆర్థిక, ఆంత్రోపాలజీ, పలు విశ్వవిద్యాలయాల ఆచార్యులతో సమాలోచనలు జరిపారు. రాష్ట్రంలో అమలులో ఉన్న బీసీ జాబితాలో ఉన్న కులాలలో అత్యంత వెనుకబడిన వర్గాలను (ఎంబీసీలను), సంచార కులాలపై సమగ్రంగా చర్చించారు. జాతీయ స్థాయిలో కాకా కాలేల్కర్, మండల్ కమిషన్ నివేదికలు, సంచారకులాలకు సంబంధించిన బాలకృష్ణ రెనెకె, ఇడాటె కమిషన్ నివేదికలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన అనంతరామన్, మురళీధరరావు, జస్టిస్ దాళ్వా సుబ్రహ్మణ్యం నివేదికలలోని సిఫార్సులను తమిళనాడు రాష్ట్రానికి చెందిన సత్యనాథన్, జస్టిస్ జనార్థనమ్, కర్నాటకకు చెందిన హవనూర్ కమిషన్, ఓ.చిన్నప్పరెడ్డి, వెకటస్వామికమిషన్‌లు, కేరళకు చెందిన కుమారపిళ్లై, దామోదరన్ తదితర కమిషన్‌ల నివేదికలను, సిఫార్సులను ఈ సమావేశంలో సమీక్షించారు. బీసీల అభివృద్ధి కోసం వివిధ రాష్ట్రాలు అమలుచేస్తున్న పథకాలను పరిశీలించారు. హైదరాబాద్‌లో ఉన్న బీసీ జాబితాలను పరిశీలించారు. ఉమ్మడి ఎపి ఏర్పడిన తర్వాత తెలంగాణలో ఉన్న బిసి కులాలు ఏ మేరకు మార్పులు, చేర్పులకు గుర య్యాయో పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సూచించిన అంశాలను సమీక్షిస్తూనే ప్రస్తుతం అమలులో ఉన్న జాబితా పునర్వ్యవస్థీకరణకు కావాల్సిన కార్యాచరణను శాస్త్రీయ దృక్ప థంతో చర్యలు చేపట్టడానికి కావాల్సిన అనేక అంశాలను, తీసుకోవాల్సిన చర్యలను నిర్మాణాత్మకంగా చర్చిం చారు. ఈ వర్క్‌షాప్‌లో ఐసీఎస్ఎస్ఆర్ దక్షిణాది రాష్ట్రాల డైరెక్టర్ ప్రొ. చెన్న బసవయ్య, సెస్ డైరెక్టర్ ప్రొ. గాలబ్, ఉస్మానియా యూనివర్శిటీ సోషల్ సైన్సెస్ రిటైర్డ్ డీన్ ప్రొ.కె.శ్రీనివాసులు, జేఎన్‌యూ న్యూఢిల్లీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఐ.తిరుమలి, సోషియాలజీ,ఆంత్రోపాలజీ, సైకాలజీ ప్రొఫెసర్లు అడపా సత్యనారాయణ, గట్టు సత్యనారాయణ తదితరులు తమ సెమినార్ పేపర్లను అందించి వాటిపై చర్చించి కమిషన్‌కు సలహాలు, చూచనలు అందజేశారు.

లలిత సంగీతాన్ని పోషిస్తున్న ఆకాశవాణి : ఆచార్య గోపి

'తెలుగుభాషా సాహిత్యసేవలో ఆకాశవాణి' రెండురోజుల సదస్సు ప్రారంభం

హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 28 ప్రభాతవార్త : ఆకాశవాణి లలితసంగీతానికి కన్నతల్లి కాకపోయినా గత 50 ఏళ్లుగా లలిత సంగీతాన్ని పెంచి పోషిస్తున్నది ఆకాశవాణి అని, ఆ స్ఫూర్తితోనే తాను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడుగా ఉన్నప్పుడు సంగీతశాఖలో లలితసంగీతాన్ని ఒక కోర్సుగా పెట్టించానని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సంచాలకుడు, కార్యవర్గ సభ్యుడు ఆచార్య ఎన్.గోపి అధ్యక్షోపన్యాసంలో అన్నారు. ఆకాశవాణి ఒక ప్రత్యేక శ్రవణమాద్యం అని, ఆకాశవాణి ప్రసారాలు ఏకకాలంలో సుదూర ప్రాంతాలకు చేరుతూ అక్షరాస్యులకేకాక నిరక్షరాస్యులకూ అన్నిరకాల వార్తా విశేషాలతో పరిజ్ఞానం అందించడంతోపాటు ఆహ్లాద పరుస్తుందని ఆయన అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ, ఆకాశవాణి హైదరాబాద్, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజులపాటు జరిగే 'తెలుగు భాషా సాహిత్య సేవలో ఆకాశవాణి' అనే అంశంపై సదస్సు సోమవారం ఉదయం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రారంభమైంది. ఉదయం 10 నుండి రాత్రి 6 గంటల వరకు కొనసాగుతున్న ఈ కార్యక్రమ ప్రారంభ సమావేశంలో ముందుగా సాహిత్య అకాడమీ ప్రాంతీయ కార్యదర్శి ఎస్.పి.మహాలింగేశ్వర్ స్వాగతోపన్యాసం గావించారు. అనంతరం ఆచార్య ఎన్.గోపి మాట్లాడుతూ స్వతంత్ర్య భారతదేశంలో ఆకాశవాణి చేస్తున్న బహుముఖ సేవలు అద్భుతమైనవి, సంస్మరణీయం, ఆత్మప్రబోధం లాంటివన్నారు. ఇవి హైదరాబాద్‌లో 1933లో ప్రైవేట్‌రంగంలో ప్రారంభమైన ఆకాశవాణిని 1935లో నాటి నిజాం ప్రభుత్వం దానికి తీసుకొందని, 1939నుండి దక్కన్ రేడియోగా ప్రసారాలు కొనసాగించిందని తెలిపారు.



సభలో మాట్లాడుతున్న ఆచార్య ఎన్.గోపి, మామిడి హరికృష్ణ, ఉదయశంకర్ తదితర అతిథులు

భారతదేశ స్వాతంత్ర్యానంతరం 1950 నుండి ఆలిండియా రేడియో హైదరాబాద్ ప్రసారాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం అత్యాధునిక శ్రవణమాద్యంలో ఎఫ్ఎం రేడియోలు ప్రారంభయ్యాయని, కొత్త కొత్త ప్రయోగాలు వస్తున్నా భాషా సాహిత్యం తగ్గుముఖం పట్టిందని, వాటి అస్తిత్వం గల్లంతులో పడ్డాయని, తెలుగుకు ముప్పు వాటిల్లిందనడంలో ఏమాత్రం సందేహంలేదని స్పష్టం చేశారు. నేటి ప్రసారాల్లో హిందీ, ఇంగ్లీషు సమస్త భాషతో యువతరాన్ని ఆకట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారని, తెలుగు వెలుగు మాయమైపోతుందని, యాంకర్ల సంస్కృతి వచ్చేసిందని తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తూ ఈ పద్ధతి మారడానికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కేంద్రం తప్పక ఆలోచించాల్సి ఉందన్నారు. చివరిగా ఈ రెండురోజుల సదస్సులో పత్రసమర్పణ చేసిన పత్రాలను తమకు అందిస్తే కేంద్ర సాహిత్య అకాడమీ వెంటనే వాటిని ప్రచురించి ఒక పుస్తకరూపంలో తెస్తుందని ఎన్.గోపి పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రేడియో ప్రయోక్త శారదా శ్రీనివాసన్ ఆకాశవాణి హైదరాబాద్ కళలనిలయంలా, భువనసభలా వెలుగొందేదని గుర్తుచేసుకొన్నారు. ఆకాశవాణి హైదరాబాద్ సహాయ సంచాలకుడు, ప్రోగ్రాం హెడ్ వి.ఉదయశంకర్ ఆకాశవాణి ఎప్పుడూ జన హృదయవాణి అన్నారు. గౌరవ అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ రేడియోతో జ్ఞాపకాలు ఎప్పటికీ పెనవేసుకుపోతాయన్నారు. మొదటిరోజు సమావేశాల్లో శ్రవణభాషా వైశిష్ట్యంపై పి.ఎస్.గోపాలకృష్ణ, ఆర్.ఎ.పద్మనాభరావు రేడియో నాడు-నేడూపై, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ రేడియోకు వన్నెతెచ్చిన సాహితీమూర్తులు, రేడియో నాటకంపై గొల్లపూడి మారుతీరావు, రేడియో కథపై నాగసూరి వేణుగోపాల్, రేడియో కవిత్వంపై ఓలేటి పార్వతీశంలు పత్రసమర్పణ గావించారు. చివరిగా కవిసంధ్య కార్యక్రమంలో ప్రముఖ కవి ఆశారాజు కవిత్వం చదివి ప్రేక్షకులతో కవిత్వంపై వివిధ అంశాలపై చర్చాగోష్టిలో పాల్గొన్నారు. 29న రెండవరోజు మూడు సమావేశాలుంటాయని, వివిధ అంశాలపై ప్రముఖ సాహితీవేత్తల పత్రసమర్పణ లుంటాయని, కవిసంధ్యలో ప్రముఖ తెలుగు కవి సుధామ పాల్గొంటారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహామండలి సంచాలకుడు ఎన్.గోపి అధ్యక్షతన జరిగే ముగింపు సమావేశానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఛైర్మన్ డా. కె.వి.రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, ఆకాశవాణి హైదరాబాద్ సహాయ సంచాలకుడు వి.ఉదయశంకర్ తుదిపలుకులుంటాయని నిర్వాహకులు తెలిపారు.



గోంగూర పులుసు

కావలసినవి

గోంగూర మంచిది-రెండు కట్టలు
పచ్చిమిర్చి-6 మధ్యకు పొడుగ్గా కోసినవి
ఉల్లిపాయలు-ఒక చిన్నది ముక్కలుగా కోసింది
పసుపు-చిటికెడు, ఉప్పు-తగినంత
ఎండుమిర్చి-4, ఆవాలు-అర చెంచా
నూనె-10గ్రా, ఇంగువ-కొంచెం

తయారుచేసే విధానం

గోంగూర ఆకులు శుభ్రం చేసుకుని, కాడలు తీసేసి కడిగి ఉంచుకోవాలి. స్టవ్ మీద బాండీ ఉంచి కొంచెం నూనెపోసి కాగాక ముందుగా కడిగి ఉంచుకున్న గోంగూర, పచ్చిమిర్చి నూనెలో వేయించాలి. కూర వేడికి మగ్గి పూర్తిగా కరిగిపోతే మంచి కూర అని అర్థం. అందులోనే ఉల్లిముక్కలు కూడా వేయాలి. గోంగూర మీద పసుపు, ఉప్పు చల్లి బాగా వేగాక తీసి పప్పుగుత్తితో మెత్తగా అయ్యేలా మెదపాలి. ఇప్పుడు మళ్లీ బాండీ పొయ్యి మీద పెట్టి నూనె బాగా కాగాక ఇంగువ, ఎండుమిర్చి వేసి వేగాక ఆవాలు కూడా వేసి పోపు మెదిపి ఉంచు కున్న గోంగూరలో వేసి కలియబెడితే గోంగూర పులుసు రెడీ. ❐



‘కళ’ల అలల్లో నింగీనేలా మహిళదే

మనదేశంలో ఉండే ప్రాచీన కళల్లో ఒడిస్సీ నృత్యం ఒకటి. పేరు, సమాజంలో ఓ ఉన్నతమైన స్థానం, ఆర్థిక సౌలభ్యంవంటి వాటికోసం కళను అభ్యసించి, తమ జీవితం ఇంతటితో ధన్యకరమైందని భావించి, ఆ పరిధిలోనే పరిభ్రమిస్తూ సంతృప్తి చెందేవారు కొందరైతే, పేరు కోసం కళనుకాక కళే తమ ఊపిరి, కడవరకు ఆ కళ కోసం పరితపిస్తూ, చనిపోయినా ఆ కళాపరిమళాన్ని నలుగురిలో వెదజల్లే కళాతపస్విని హృదయాలు అతికొద్దిమందే ఉంటారు. ఇలాంటి వారిలో సోనాలి ఆచార్జీ ఒకరు.



మాతృభాష అస్సాం అయినా ఒడిస్సీ నృత్యంపై ఉన్న అభిలాష వల్ల తన 5వ ఏటనే ఒడిస్సీ ఓనమానాలకు శ్రీకారం చుట్టారు. తల్లి నృత్యకారిణి కావడంవల్ల సోనాలి కూడా లేతవయసులోనే నాట్యంపై మక్కువను పెంచుకున్నారు. కూతురిలో ఉండే ఆసక్తిని గమనించిన సోనాలి తల్లి అస్సాంలోనే ఒడిస్సీని అభ్యసించారు. భాస్కర స్థాయిలో ఒడిస్సీ నాట్యాచార్యుడైన రంగనాథ్ దత్తా వద్ద నేర్చుకున్నారు. తర్వాత ఒరిస్సాలోని కటక్‌లో నాగ్‌పూర్ సంస్కృతి సంషాద్‌ను పూర్తి చేశారు.

మాస్టర్ డిగ్రీలు

సోనాలి శాంతినికేతన్‌లోని విశ్వభారతి వర్సిటీ ప్రొఫెసర్ కె.జతీంద్ర సింగ్ వద్ద రవీంద్ర నృత్యంలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. మనదేశంలో దాదాపు 500లకు పైగానే స్టేజీ ఒడిస్సీ నృత్యాన్ని ప్రదర్శించి, ప్రేక్షకుల మన్ననలను అందుకున్నారు.

సోనాలి నృత్య ప్రత్యేకతలు

సోనాలి ఒడిస్సీ నృత్యంలో ఒక ప్రత్యేకతను, గుర్తింపును పొందారు. ఎందుకంటే ఆమె ఆ కళ ద్వారా ఎన్నో విషయాలను ప్రేక్షకులకు తెలియ జేస్తున్నారు. సున్నితత్వం, దయాళత్వం, ప్రేమ, అభిమానం, పవిత్రత, చరిత్ర, ఒడిస్సీ నాట్య సిద్ధాంతాలు, ఆ కళ భావాలు ఒక్కమాటలో చెప్పాలంటే ఒడిస్సీ నాట్యంలో దాగున్న రమణీ యమైన అందం, అభినయం, అభిలాష, ఆకాంక్ష, అనిర్వచనీయమైన భక్తి ఇత్యాదివన్నీ ప్రేక్షకుల ముందు తన ఒడిస్సీ పుస్తక కళను విశీదికరిస్తారు.

అవార్డులు

అస్సాంలో జరిగిన కళలో పదిమంది ప్రఖ్యాత కళాకారుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. టాప్‌టెన్‌లో బెస్ట్ అవార్డును సొంతం చేసుకున్నారు. అలాగే చెన్నైలో జరిగిన ఒడిస్సీ నృత్యపోటీలో పాల్గొని ‘ప్రతిభ’ అవార్డును, గౌహతిలో ‘మిస్ ఆచార్య’ అవార్డును, ఢిల్లీలో ‘ఉత్తమ నాట్యకారిణి’ అవార్డును పొందారు. ఇతర సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలను కూడా పొందారు.



శుభప్రదంలో నృత్యం

ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్ నిర్మించిన ‘శుభప్రదం’ అనే సినిమాలో ఒడిస్సీ నాట్యాన్ని వేసి, సినీరంగంలో తన సత్తాను చాటుకున్నారు. తమిళనాడు, మహారాష్ట్ర, అస్సాం, కేరళ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లోని టివీ చానెళ్లలో కూడా పలు ప్రదర్శనలు ఇచ్చారు. మనరాష్ట్రంలో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి, మాజీ ముఖ్య మంత్రి రోశయ్య నుంచి ఉత్తమ నాట్యాచారిణి అవార్డును పొందారు. ఇలా ఆమె ప్రదర్శనల ద్వారా ఆశించి నంతగా పేరు ప్రఖ్యాతులను పొందారు.

సప్తపర్ని శిక్షణా సంస్థ: సప్తపర్ని పేరుతో ఒడిస్సీ నాట్యస్కూలును నడిపిస్తున్నారు. ప్రతి మంగళ, గురువారాల్లో నేర్పిస్తారు. 6 సంవత్సరాలపై వయసున్న వారు అర్హులు.

చిరకాల ఆకాంక్ష

గుజరాత్‌లో ఒక ఆశ్రమాన్ని నిర్మించి నిరుపేదలకు ఉచితంగా ఒడిస్సీ నృత్యాన్ని నేర్పించాలని ఉంది. నేటి మహిళకు సోనాలి ఇచ్చే సందేశం... టీవీలలో సాంస్కృతిక ప్రదర్శనల పేరుతో స్త్రీని హీనంగా చూపిస్తున్నారు. మగవారికి శరీరమంతా దుస్తులకు కప్పి, మహిళలకు మాత్రం అర్ధనగ్న దుస్తులతో నాట్యం చేయిస్తున్నారు. అన్నింట్లో మహిళకు సగభాగం అంటూనే అనేక విషయాల్లో స్త్రీ వివక్షతకు గురవుతున్నది. ఈ భావన పూర్తిగా పోవాలి. ❐

పాము కాటుకు విరుగుడు

పాము కాటువేసిన వెంటనే కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే హాస్పిటల్‌కు వెళ్లేదాకా రోగికి ప్రాణాపాయం తప్పుతుంది. పాము కాటు వేసిన చోట గంటు పెట్టి రక్తమును పిండివేయాలి. దానిపైన చుట్టతో కానీ గుడ్డ చుట్ట తదితర సాధనములతో కానీ కాల్చాలి. ఇలా చేయడం వల్ల రక్తములో విషము బయటకు వస్తుంది. కాటు వేసిన చోట విషం ఉన్నట్లయితే కాల్చినచో విషం హరిస్తుంది. ఛాయ పసుపును నీటిలో కలిపి తక్షణమే త్రాగించాలి. గరికి వేళ్ళ రసమును లోనికి పట్టించాలి. పాము కాటు విషమునకు పసుపునకు మించింది లేదు. దీనిని పైకి రాసినను, లోపలికి ఇచ్చినను పసుపు నీటితో స్నానము చేయించినా మంచిదే. భోజనములో పసుపును వాడాలి. దాహమునకు గాను పసుపు నీటినే తాగించాలి. ఇట్లు చేసినా పాము విషము హరిస్తుంది. పాము విష మునకు పసుపును మించిది లేదు. ❐



స్నేహమేరా శాశ్వతం

అవసరంలో ఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడు అని అర్థం కదా. స్టూడెంట్ లైఫ్‌లో తల్లిదండ్రులు, అధ్యాపకులు తర్వాత స్నేహితుల పాత్ర ప్రాధాన్యత వహిస్తుంది. ముందు ముఖపరిచయంతో మొహమాటంగా మొదలై, తర్వాత సరదా సరదా కబుర్లతో కులాసాగా కొనసాగుతూ, ఆ తర్వాత ఇంట్లో ఏం జరిగినా అది ఎంత చిన్నదైనా, పెద్దదైనా స్నేహితుని కలిసి చెప్పేవరకు మనసు కుదుటపడని చిక్కటి అనుబంధంగా బలపడుతుంది. నువ్వేనేను, నేనేనువ్వు అన్నట్లుగా ఐకమత్యంగా ఓ కట్టుగా కలిసిపోయి వుంటారు. ఇంటికి తీసుకువచ్చి మా ఫ్రెండు అంటూ పరిచయం చేసి, తన ఫ్రెండు తన ఇంట్లో వాళ్ళకి కూడా నచ్చాలని తహతహలాడుతుంటారు. ఇంట్లో పేరెంట్స్‌కి కూడా తమ పిల్లలు పరిచయం చేసిన ఆ ఫ్రెండు నడవడిక అది తమకి నచ్చితే సరే ప్రోత్సహిస్తారు. లేదంటే నెమ్మదిగా తమ పిల్లలకి నచ్చ చెప్పటానికి ప్రయత్నిస్తారు.

పిల్లలకే కాదు కాలేజ్ లైఫ్‌లో ఆ తర్వాత వివాహమయ్యాక కూడా ఫ్రెండ్స్ కొనసాగుతూనే ఉంటారు. కొన్ని స్నేహాలు చిరకాలం కొనసాగుతుంటాయి. బంధువులకంటే ఎక్కువగా స్నేహానుబంధమే చాలా గాఢంగా కనబడుతుంటుంది. నిజానికి సృష్టిలో తీయనిది స్నేహమే కదా. ఈ స్నేహానికి కులమతాలు బీదగొప్ప, ఆడమగ అన్న తారతమ్యం వుండదు. అందుకే స్నేహం చిరకాలం వర్ధిల్లుతుంది. సమయాను కూలంగా, సందర్భానుసారంగా ఎప్పటికప్పుడు పరిస్థితులను అర్థం చేసుకుంటూ సర్వకాల సర్వావస్థ ల్లోను నేనున్నాని నిండుగా పలికే తోడు పేరే స్నేహం. మనం ఏదైనా కష్టాల్లో ఉన్నప్పుడు ఎడతెగని సమస్యతో సతమత మవుతున్నపుడు మనసుపడే ఆరాటాన్ని మరొకరితో పంచుకోవాలనుకుంటున్నపుడు మన మనస్సులో మెదిలే మొదటి వ్యక్తి మన స్నేహితులే ఒక్కోసారి ఇంట్లో వాళ్ళతో కూడా చెప్పుకోలేని ఎన్నో విషయాలను స్నేహితులతో చెప్పుకొని ఎంతో ఊరట చెందుతాం. వారి దగ్గర నుండి ఓదార్పుని పొందుతాం, సమస్య వుంటే చర్చించి పరిష్కారం చెప్పమని అడుగుతాం.



అందుకే జీవితంలో ఎవరికైనా స్నేహితుల పాత్ర వారి ప్రాధాన్యం చాలా ప్రత్యేకం. వారి అనుబంధం అపురూపం. మీరెప్పుడైనా గమనించారో లేదో కానీ ఎవరు మధ్యనైనా చొరబడతారేమోకానీ స్నేహితుల మధ్య తలదూర్చటానికి ఎవరూ సాహసించరు. ఒకవేళ స్నేహితుల మధ్య ఎవరైనా చిచ్చుపెట్టాలని చూసినా నా ఫ్రెండ్ అలాంటి వాడు కాదంటూ కొట్టిపారేస్తాడు. ఒకవేళ నిజంగా ఏదైనా పొరపాటుగా పొరపొచ్చాలు ఏవైనా వచ్చినా, ఒకరి గురించి ఒకరు ఆరాటపడిపోతూ ఎప్పుడెప్పుడు ఒకరికొకరుగా కలిసిపోయి ఆత్మీయంగా కౌగలించు కోవాలని ఎదురుచూస్తుంటారు. తమ మధ్యదూరం తాత్కాలికమే అనుకొంటారు. ఆ సమయంలో కూడా ఒకరి క్షేమాన్ని మరొకరు కాంక్షిస్తారే కానీ కత్తులు దూయాలనుకోరు. ఒకవేళ ఎవరైనా ఎక్కడైనా అలా ఉన్నారంటే అది నిజమైన స్నేహం కాదన్నమాట. అందుకే స్నేహం విలువ తెలిసినవారు ‘స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం’ అని పాడుకుంటారు. ❐

ఇంట్లోనే హెర్బల్ ప్యాక్‌ల తయారీ

కొద్దిపాటి శ్రమతో ఇంట్లోనే హెర్బల్ ప్యాక్‌లు తయారుచేసుకోవచ్చు. ఎటువంటి సైడ్ఎఫెక్ట్ లేకుండా చక్కని ఫలితాన్నిచ్చే ఈ ప్యాక్‌ల తయారీకి తక్కువ ఖర్చు కొద్ది సమయం చాలు.

పీచ్ టైటనింగ్ మాస్క్: బాగా పండిన పీచ్ ఒకటి. ఒక కోడిగుడ్డు తెల్లసొన తీసుకోవాలి. చెక్కు తీసి పీచ్ గుజ్జును, తెల్లసొనను ముఖానికి రాసి అరగంట తర్వాత చన్నీటి తో కడగాలి. దీనిని ముడతలు పడుతున్న జిడ్డు చర్మానికి వేయాలి.

ఆపిల్ మాస్క్: ఒక ఆపిల్ (చిన్నది) రెండు టేబుల్ స్పూన్ల తేనె తీసుకోవాలి. ఆపిల్‌ను ముక్కలు చేసి మిక్సీలో బ్లెండ్ చేయాలి. ఆపిల్ గుజ్జుతో తేనె కలిపి సరిగా కలిసేటట్టు ఒకసారి బ్లెండ్ చేయాలి. తర్వాత పదినిమిషాలు ఫ్రిజ్‌లో ఉంచండి.

ఫ్రిజ్‌లో నుండి తీసిన మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించి వేళ్లతో వలయాకారంగా మర్దన చేయాలి. అరగంట తర్వాత కడగాలి.

కుకుంబర్ మాస్క్: సగం కీరకాయ, ఒక కోడిగుడ్డు తెల్లసొన, ఒక టీస్పూన్ నిమ్మరసం, ఒక టీ స్పూన్ పుదీనా పేస్టు తీసుకోవాలి. అన్నింటినీ కలిపి మెత్తగా బ్లెండ్ చేసి పదినిమిషాల సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. ముఖానికి పట్టించిన తర్వాత పదిహేను నిమిషాలకు చన్నీటితో కడగాలి. దీనిని జిడ్డు చర్మానికి వేయాలి.

స్ట్రాబెర్రీ మాస్క్: అరకప్పు బాగా పండిన స్ట్రాబెర్రీలు, పావుకప్పు చిక్కని మొక్కజొన్న గంజి లేదా అన్నం గంజి తీసుకోవాలి. స్ట్రాబెర్రీలు గంజి సాయంతో మిక్సీలో బ్లెండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని కళ్ల చుట్టూ మినహాయించి ముఖమంతా పట్టించి అరగంట తర్వాత చన్నీటితో కడగాలి. దీనిని నార్మల్ స్కిన్‌తో పాటు ఆయిల్ స్కిన్‌కు కూడా వేయవచ్చు. ❐



శ్రీమద్రామాయణం

ఆధ్యాత్మికం

మనం శ్రీమద్రామాయాణాన్ని చదివి ఆనందిస్తాం. రామాయణ కథతో ఉన్న సినిమాలను చూసి సంతోషిస్తాం, రామాయణంపైన ఎవరు ఉపన్యసించినా భక్తి, శ్రద్ధలతో విని హర్షిస్తాం. ఇదంతా శ్రీరాముని పట్ల, రామాయణం పట్ల మనకున్న గౌరవాన్ని తెలియచేస్తుందనటంలో సందేహం లేదు. అయితే అదంతా అక్కడితోనే ఆగిపోరాదు. మన జీవన విధానంలో మార్పు తెచ్చుకోవాలి. నాటికి నేటికీ ఆచార వ్యవహారాల్లో కొంతమార్పు వచ్చి ఉండవచ్చు. కానీ అత్యంత ముఖ్యమైన విలువలను ఈ జాతి తన ముందుంచుకొని ముందుకు సాగాలి. రామాయణాన్ని శ్రద్ధగా అధ్యయనం చేస్తే మనం ఏవి చేయదగిన మంచి పనులో, ఏవి విడువవలసిన చెడ్డ పనులో స్పష్టంగా తెలుస్తుంది. ఉదాహరణకు ఆయోధ్యాకాండము 75వ సర్గలోని ఈ ఘట్టాన్ని చూడండి. భరతుడు కేకయదేశం నుంచి అయోధ్యకు తిరిగి వస్తాడు. సీతారామలక్ష్మణులు వనవాసానికి పంపబడిన విషయాన్ని తెలుసుకుంటాడు, తల్లి కైకేయిపై కోపపడతాడు. కౌసల్యాదేవి మందిరానికి వెళతాడు. కౌసల్యతో ఇలా అంటాడు. ‘అమ్మా! నేను అన్నగారి వనవాసానికి అనుమతించి ఉన్నట్లయితే పాపాత్ములకు సేవ చేసిన చెడుఫలం (పాపం) నాకు దక్కుగాక! సూర్యుని ఎదురుగా మలమూత్రాదులు విసర్జించేవాడికి పట్టే దుర్గతులు నాకు పట్టుగాక! నిద్రపోతున్న ఆవును కాలితో తన్నేవాడికి కలిగే పాపం నాకు వాటిల్లుగాక! సేవకులు చేత సేవ చేయించుకుని వారికి జీతభత్యాలు ఏమీ ఇవ్వని యజమానికి కలిగే పాపం నన్ను చుట్టుకొంటుందిగాక! ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకునే రాజుకు ద్రోహం చేసినంత పాపం నాకు సంభవించుగాక! దక్షిణలు ఇస్తానని వాగ్దానం చేసి, యజ్ఞాలు చేయించుకొని తరువాత నేను ఇస్తానని చెప్పలేదని అబద్ధమాడేవాడికి కలిగే నరకం నాకు దాపురించుగాక! వీరుడని చెప్పుకొని యుద్ధరంగం నుండి పారిపోయి వచ్చి ప్రాణాలు కాపాడుకొన్న వాడికి పట్టే దుర్గతులన్నీ నాకు పట్టుగాక! గురువుల వద్ద నేర్చుకొన్న ధర్మోపదేశాలను, సూక్ష్మవిషయాలను పొంది వాటిని విస్మరించినవాడికి కలిగే దోషాలన్నీ నాకు కలుగుగాక!. పితృదేవతలకు, అతిథి దేవతలకు, గురువుల కొరకు నిర్దేశించబడిన పాయసం, పులగం, మేకమాంసం, వారికి పెట్టకుండా తానేతిని వారిని అవమానించేవాడికి కలిగే దుర్గతులన్నీ నాకు వాటిల్లుగాక! ఆవును కాలితో తన్నిన పాపము, పెద్దలను దూషించిన పాపము, మిత్రులకు ద్రోహము చేసిన పాపము నాకు వాటిల్లుగాక! మిత్రులు తనను నమ్మి చెప్పిన రహస్యాలను నిర్దాక్షిణ్యంగా బహిరంగ పరచిన వాడికి పట్టే దుర్గతులన్నీ నాకు కలుగుగాక! భార్యాపిల్లలను పస్తులు పడుకోబెట్టి తాను మాత్రం విందుభోజనాలు చేసేవాడికి కలిగే దుర్గతులన్నీ నాకు పట్టుగాక! విచ్చలవిడిగా బాలలను, వృద్ధులను, స్త్రీలను చంపే రాజుకు పట్టేపాపం నన్ను చుట్టుకొనునుగాక! నిషేధింపబడిన మధువు, లక్క, మాంసం, లోహము, విషము మొదలైన వస్తువులను విక్రయించేవాడికి ఎటువంటి పాపం కల్గుతుందో నాకూ అట్టి పాపమే ప్రాప్తించుగాక!..చిరిగిన గుడ్డలు కట్టుకొని, కుండపెంకు చేతిలో పెట్టుకొని అడుక్కునేవాడికి, స్త్రీ వ్యామోహపరునకు, మద్యపానానికి దాసుడైన వాడికి పట్టే గతే నాకూ పట్టుగాక!..ఇళ్లు తగలబెట్టిన వాళ్లకు కలిగే పాపం, గురుభార్యాగమనం చేసిన వాళ్లకు దాపురించే పాపం, మిత్రద్రోహం చేసేవారికి కలిగే పాపం నాకు కలుగుగాక! తల్లిదండ్రులకు, గురువులకు శుశ్రూష చెయ్యని వానికి ఎటువంటి పాపం కలుగుతుందో అటువంటి పాపం నాకు చుట్టుకొనునుగాక! అధర్మపరుడై, ధర్మపత్నిని విడిచి, పరభార్యతో సంపర్కం పెట్టుకొనేవాడికి, తాగేనీళ్లలో దుమ్ముకొట్టేవాడికి, విషాన్నం పెట్టేవాడికి, దాహంగా ఉన్న వాడికి నీళ్ల ఉంచుకొని కూడా ఇవ్వకుండా దాచుకునేవాడికి కలిగే పాపం నాకూ కలుగుగాక! (పుటలు 223-224). చూశారా? ఏఏ పనులను చేస్తే పాపం వస్తుందో ఒక పట్టిక ఇచ్చాడు భరతుడు. మనకు వాల్మీకి మహర్షిపైనా, శ్రీరామునిపైనా, శ్రీమద్రామాయణంపైనా ఏమాత్రం గౌరవమున్నా ఆ పాపపు పనులు చేయరాదు. జైశ్రీరాం!.

- రాచమడుగు శ్రీనివాసులు

సౌకర్య జీవనానికి...



- వంటచేస్తున్నప్పుడు చేతులు బాగా లేకపోతే ఫోన్ రిసీవర్ ఎత్తడానికో, తలుపులు తీయడానికో చేతులు కడుక్కోనక్కర్లేదు. ఓమైనపు సంచిలో చేతిని ఉంచి ఆ పన్లు చేయవచ్చు.
- కారున్నవారికి, పాత విండ్ షీల్డ్‌వైపర్‌ని (కార్ల మెకానిక్స్ దగ్గర కొనవచ్చు) దుమ్ము పట్టిన అద్దాలను తుడవడానికి ఉపయోగించవచ్చు.
- ఊలు బట్టలు కొనేప్పుడు నాణ్యత తెలుసుకోవడానికో మార్గం ఊలుదారం ముక్కని కాస్టిక్ సోడాలో ముంచినప్పుడు అది కరిగితే మంచి ఊలు అని అర్థం.
- ఊలు, సిల్కు బట్టలు గోరువెచ్చటి నీటిలో వాష్ చేశాక పిండకూడదు. ఓ కాటన్ టవల్‌లో ఉంచి రోల్ చేస్తే తడి పీల్చుకుంటుందా టవల్, తర్వాత ఆరేయాలి.
- ఏదైనా సీసాకున్న మెటల్ మూత రాకపోతే మూత భాగాన్ని వేడినీళ్లలో కొద్దిసేపు ఉంచి తిప్పితే తేలిగ్గా వస్తుంది.
- జరీచీరలను టిష్యూ పేపర్‌లో మడతబెట్టి బీరువాలో ఉంచితే జరీ నల్లబడక తళతళ లాడుతుంటుంది. రబ్బర్ ప్లాంట్ ఇంట్లోని డ్రాయింగ్ హాల్‌కి యెంతో అందాన్నిస్తుంది. ❐

చెలి చిట్కాలు

- కలబంద రసంలో పసుపు కలిపి కాలిన గాయాల మీద రాస్తే గాయాలు త్వరగా తగ్గుతాయి.
- తరచుగా ఆకుకూరలు వాడితే అజీర్ణవ్యాధి గాని, అజీర్ణ వ్యాధితో పాటు వచ్చే కడుపునొప్పి, ఉబ్బరం వంటివి రావు.
- వెల్లుల్లిపాయలు నాలుగు రేకలు తీసుకుని బాగా దంచి గుజ్జులాగా చేసి తీసుకోవాలి. ఈవిధంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు పూటలా తీసుకుంటే వికారం తగ్గుతుంది.
- పసుపు, వేప ఆకుల ముద్దను స్ఫోటకం మచ్చలు వచ్చిన వారికి పూతగా పూస్తే త్వరగా తగ్గుతాయి. స్ఫోటకానికి మరే పూత మందుగాని, ఇంగ్లీషు మందు గాని వాడటం చాలా ప్రమాదం.
- కళ్లమంటలు, జలుబు ఉన్నవారు పసుపు కాల్చిన వాసన చూస్తే తగ్గుతుంది. శిరోభారం, ముక్కుదిబ్బడ, ముక్కు కారడం లాంటి తగ్గడానికి పసుపు కాల్చి వాసన చూస్తే తగ్గిపోతాయి. ❐

వార్తాఫలం

మేషం: వ్యాపారంలో ధన లాభాలను పొందు తారు. ఉన్నత పదవి, కీర్తి, ప్రమోషన్స్‌కు అవకాశం. కొనుగోలుకు అధికంగా ఖర్చు చేస్తారు. కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు.

వృషభం: కోర్టు వ్యవహారాలు చికాకు పరుస్తాయి. సమస్యలకు అవకాశం. భవిష్యత్తు ప్రణాళికల గురించి చర్చించి, అధికంగా లాభాలు వచ్చే వ్యాపారాలలో ధనాన్ని మదుపు చేస్తారు. స్పెక్యులేషన్ లాభసాటిగా ఉంటుంది.

మిథునం: బంధు సందర్శనాలు చేస్తారు. సౌఖ్యం, ఉద్యోగ ప్రాప్తి. ముఖ్యమైన సమస్యలు పరిష్కారమవుతాయి. జీవిత భాగస్వామి సహాయ సహకారాలు అందుకుంటారు. సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: ధైర్యంతో ఉంటారు. అనుకున్న పనులను సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. సంఘంలో గౌరవప్రతిష్టలు పెంపొందుతాయి.

సింహం: బంధుమిత్ర ద్వేషాలకు గురయ్యే అవకాశం. స్థానచలనం, వ్యతిరేకతలకు అవకాశం. గృహసంబంధిత ఖర్చులు అధికమవుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో సొంత నిర్ణయాలకు ప్రాముఖ్యతనివ్వండి.

కన్య: ధనాదాయంతో రోజంతా గడుపుతారు. వ్యాపారంలో రొటేషన్ లాభాలు బాగుంటాయి. విలువైన వస్తువుల భద్రత పట్ల అప్రమత్తత వహించండి. వాహనయోగ సూచన.

తుల: స్థానచలనం, కుటుంబ సమస్యలకు అవకాశం. అనుకూల ఫలితాలను సాధిస్తారు. గతంలో చేజారిన అవకాశాలు ఇప్పుడు అంది వస్తాయి. శుభపరంపరగా ఉంటుంది.

వృశ్చికం: వృత్తియందు లాభాలను పొందుతారు. వ్యాపారంలో ద్వేషాలకు అవకాశం. ఆరోగ్యసూత్రాలు క్రమపద్ధతిలో అమలుపరచాలని నిర్ణయించుకుంటారు. వినోద కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటారు.

ధనుస్సు: దూర ప్రయాణాలు చేస్తారు. కొత్త సామాగ్రి కొనే అవకాశం. బంధువుల శ్రేయోభిలాషులతో ఇష్టాగోష్టి సాగిస్తారు. అనుకూలమైన వాతావరణంలో ఆనందంగా కాలం గడుపుతారు. వాహన సౌఖ్యం.


మకరం: ధార్మిక పనులు నేర్చుకుంటారు. విద్యావినోదాల్లో పాల్గొంటారు. సంతాన విద్యా విషయ వ్యవహారాల పట్ల ఎక్కువ ఆసక్తిని కనబరుస్తారు. శ్రమకు ఓర్చి కార్యక్రమాలను విజయపథంలో నడిపిస్తారు.

కుంభం: వ్యాపారంలో సామాన్య ధనలాభాలను పొందుతారు. విలాసాలకు ప్రాధాన్యతనిస్తారు. అన్ని విషయాలలో భద్రతకు సంబంధించి జాగ్రత్తలు తీసుకోవడం చెప్పదగిన సూచన.

మీనం: కోర్టు వ్యవహారాలు పూర్తయ్యే అవకాశం. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్

HAPPY BIRTH DAY



రాజుగారిగది2 ఎంత వరకు వచ్చింది?
ప్యాచ్‌వర్క్ మినహా కంప్లీట్ అయిపోయింది. రీకార్డింగ్ జరుగుతోంది. ఇది హారర్ కామెడీ థ్రిల్లర్. నా సైడ్ నుండి కామెడీ తక్కువ. వెన్నెలకిషోర్, ప్రవీణ్, అశ్విన్ కామెడీ ఉంటుంది. అది కూడా ట్యుయేషనల్ కామెడీ.

ఫస్ట్ టైమ్ హార్రర్ జోనర్‌లో నటిస్తున్నారు. ఎలా అనిపించింది?
హారర్ సినిమాలంటే నాకు చాలా ఇష్టం. హారర్ అంటే ఎకార్జిస్ట్‌లాంటి సినిమాల్లా కాకుండా కామెడీ ఉంటూ లైటర్‌వేన్‌లో హార్రర్ ఉరే సినిమాలంటే ఇష్టం. లక్కీగా అలాంటి సినిమా వచ్చింది.

ఓంకార్‌తో వర్క్ ఎలా ఉంది?
ఓంకార్ పర్‌ఫెక్షనిస్ట్. చిన్న చిన్న కరెక్షన్స్ ఉన్నా సరిచేసి తీస్తాడు. అతన అనుకున్నది పర్‌ఫెక్ట్‌గా తీస్తాడు . చాలా క్లియర్‌గా ఉంటాడు. ఫుల్ స్క్రిప్ట్ ముందే రాసుకున్నారు. ఆర్టిస్టులకు చాలా ఈజీ అవుతుంది.

రాజుగారిగది చిత్రానికి రాజుగారిగది2 స్వీకెల్ అనుకోవచ్చా?
రాజుగారిగది చిత్రానికి, ఈ పార్ట్2కి సంబంధమే లేదు. ఆ టైటిల్ తీసుకోవడానికి కారణం బాగా పాపులర్ అయిన సినిమా.

ఇందులో మీ క్యారెక్టర్ ఎలా ఉంటుంది?
మెంటలిస్ట్ క్యారెక్టర్ నాది. రియల్ లైఫ్‌లో అలాంటివారిని ఇద్దరు, ముగ్గుర్ని కలిసాను. వాళ్ళకి ఎక్ స్ట్రా సెన్సరీ పవర్స్ ఉంటాయి. మీ మనసులో ఉన్నది ఈజీగా కనిపెట్టేస్తారు. ఎప్పుడు అవసరమైతే అప్పుడ కంప్యూటర్‌లోలా దాన్న బయటికి తీస్తారు. ఒరిజినల్‌గా ఒక మెంటలిస్ట్ క్యారెక్టర్‌ని పట్టుకొని తీశారు.

విక్రమ్ నుంచి ఓం నమో వేంకటేశాయ వరకు లవ్, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్, భక్తిరస చిత్రాలతో అన్నివర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న హీరో నాగార్జున. తాజాగా ఓంకార్ దర్శకత్వంలో రూపొందుతున్న రాజుగారి గది2 చిత్రంలో ప్రధానపాత్ర పోషిస్తున్నారు కింగ్ నాగార్జున. షూటింగ్ పూర్తి చేసుకొని ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో త్వరలో విడుదలకాబోతోంది. ఆగస్టు 29 కింగ్ నాగార్జున పుట్టినరోజు. ఈ సందర్భంగా కింగ్ నాగార్జునతో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు..



అభిమానం ఎప్పుడూ మర్చిపోను

హలో ఎలా వచ్చింది?
నేను సినిమా చూడలేదు. చూడాలి. విక్రమ్ చాలా ప్లాన్డ్‌గా సినిమా చేస్తారు.

హలో ఎందుకంత డిలే అవుతోంది?
మెయిన్‌గా హీరోయిన్ సెలక్షన్‌లోనే బాగా లేట్‌అయింది. పియదర్శన్‌గారి అమ్మాయిని స్క్రీన్ టెస్ట్ చేసిన తర్వాత 30,40మందిని చేశాం. చేస్తూనే ఉన్నాం. అందుకే లేట్ అయింది.

హలో అనే టైటిల్‌ని చాలా డిఫరెంట్‌గా లాంచ్ చేశారు. ఆ థాట్ ఎలా వచి ్చంది?
ఎన్.టి.రామారావుగారితో స్టార్ట్ చేయించి నాన్నగారితో కంప్లీట్ చేసి హలో టైటిల్ లాంచ్ చేయించాలనుకున్నాం. పెద్దాయన లేరు కాబట్టి తారక్‌ని అడిగాం. తారక్, అఖిల్ మంచి ఫ్రెండ్స్. అందుకే ఎన్టీఆర్‌తో స్టార్ట్ చేశాం.

హలో అనే టైటిల్ సినిమాకి యాప్ట్ అవుతుందా?
ఈ టైటిల్ సినిమాకి చాలా అవసరం. తను ప్రేమించిన అమ్మాయి దగ్గర నుంచి ఒక హలో కోసం వెయిట్ చేస్తుంటాడు. ఇది నేను ఇచ్చిన టైటిల్. ఆరు నెలల నుంచి యూనిట్ అంతా ఏం టైటిల్‌పెట్టాలని ఆలోచిస్తున్నారు. మీడియాలో కూడా ఎన్నో టైటిల్స్ వచ్చాయి. నాకు ఏదైనా టైటిల్ మైండ్‌లో వచ్చిందంటే వెంటనే రిజిస్టర్ చేయించేస్తాను. హలో టైటిల్ ఎవరో ఒకరు రిజిస్టర్ చేయించేసి వుంటారనుకున్నాను. కానీ, ఒక్కరు కూడా చేయలేదు.

నాగచైతన్యతో రారండోయ్, అఖిల్‌తో హలో చేయడం ప్రెజర్‌గా ఫీల్ అయ్యారా?
ప్రేమ ఉంటుంది కాబట్టి ప్రెజర్ కూడా ఉంటుంది.

మీరు చేసిన సినిమాల్ని ఇతర భాషల్లో కూడా విడుదల చేసే ఆలోచన ఉందా?
బాహుబలి గురించి పక్కన పెడితే అన్నీ వర్కవుట్ అవ్వవు. ఇంతకుముందు నా సినిమాలు కూడా వేరే భాషల్లో రిలీజ్‌అయ్యాయి. కానీ రిజల్ట్ అంత బాగా రాలేదు. ఇక్కడ చేసిన తర్వాత వేరే భాషల గురించి ఆలోచిద్దా మనుకుంటున్నాను.

బంగార్రాజు ప్రోగ్రెస్ ఏమిటి?
ఆ క్యారెక్టర్‌కి ఎంత పాపులారిటీ వచ్చిందో తెలిసిందే. నాకు కూడా నా క్యారెక్టర్ చేయాలని ఉంది. కళ్యాణ్‌కృష్ణ ఒకలైన్ చెప్పాడు. అంతగా నచ్చలేదు. మళ్ళీ ప్రిపేర్ అయి మంచి కథ చెప్తే తప్పకుండా చేస్తాను.

మహాభారతంలో చేస్తున్నారని తెలిసింది?
ఆ సినిమాలో నటించమని నన్ను అడిగిన మాట వాస్తవమే కానీ ఆ సినిమా చేస్తానా లేదా అనేది కచ్చితంగా చెప్పలేను.

చైతన్య, సమంతల పెళ్లి ఎలాచేయబోతున్నారు?
అక్టోబర్6న పెళ్లి, అందరికీ తెలిసిందే. ఒకేరోజు కిస్టియన్, హిందూ సంప్రదాయాల్లో పెళ్లి చేస్తునానం. పెళ్లి సింపుల్‌గా చేయాలని వాళ్ళే అనుకున్నారు. ఆ తర్వాత రిసెప్షన్ గ్రాండ్‌గా చేయాలని ప్లాన్ చేస్తున్నాం.

అభిమానులకు మీ బర్త్‌డే సందర్భంగా ఏం చెప్పాలనుకుంటున్నారు?
అభిమానులకు నాపై చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అంతకంటే నేనేం చెప్పగలను. నాన్నగారి నుంచి ఇప్పటివరకు అన్ని సందర్భాల్లోనూ మాకు సపోర్ట్‌గా ఉన్నారు. వాళ్ళు మాపై చూపిస్తున్న ఆదరణ, అభిమానం ఎప్పుడూ మర్చిపోను. అభిమానులే మాకు పెద్ద వరం అంటూ ఇంటర్వ్యూ ముగించారు కింగ్ నాగార్జున.

ఈ రిలేషన్ పూర్వజన్మ సుకృతం

నందమూరి బాలకృష్ణ హీరోగా భవ్యక్రియేషన్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వి.ఆనందప్రసాద్ నిర్మించిన చిత్రం పైసా వసూల్. ఈ సినిమా ఆడియో సక్సెస్ మీట్‌ను హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి నందమూరిబాలకృష్ణ, శ్రియ, పూరిజగన్నాథ్, ముస్కాన్, కైరాదత్, వి.ఆనందప్రసాద్, అన్నేరవి, పులగం చిన్నారాయణ, భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. గౌరవ అతిథిగా



ఎ.కోదండరామిరెడ్డి విచ్చేశారు. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ డైరెక్టర్ పూరిజగన్నాథ్‌తో ఎప్పటినుంచో చేయాలని ఉంది. కాస్త లేట్ అయింది. ఆర్టిస్టులకు చాలెంజ్ ఎప్పుడు వస్తుందంటే ఒక మంచి సినిమా చేసిన తర్వాత ఇమేజ్ అడ్డువచ్చినప్పుడు సవాల్ ఎదురవుతుంది. ఈ సినిమాను 78 రోజుల్లో పూర్తిచేశాం. అలా ఒక్కో సినిమాకూ ఒక్కో రోజుకూ తగ్గించుకుంటూ వస్తున్నాం. సినిమా చాలా భారీగా ఉంది. సెట్స్, కార్ ఛేజ్‌లు భారీగా ఉన్నాయి. అందరినీ మంచి అట్మాస్ఫియర్ క్రియేట్ చేసేది ముందు నిర్మాత, తర్వాత దర్శకుడు. అలాంటి అద్భుతమైన మనిషి పూరి. ఆయనకు ఎప్పుడూ పని గురించే ఆలోచన ఉంటుంది. మంచి సినిమా చేయాలనే తపన ఆయనకు ఉంటుందన్నారు. మోహన్‌బాబు మాట్లాడుతూ బాలయ్యబాబు గురించి ఏం చెప్పాలి? భారతదేశమే కాదు...ప్రపంచమే గర్వించదగిన మహానటుడు మా అన్నయ్య. నాకూ, అన్నయ్యకున్న సంబంధం పూర్వజన్మసుకృతం. నా తల్లిదండ్రులను, గురువును ఎలా గుర్తుపెట్టుకుంటానో, మా అన్నయ్యను కూడా ప్రతిరోజూ అనుకుంటూ ఉంటా. మా అన్నగారి కుమారుడి పట్ల చాలా ఆనందంగా ఉంది. మద్రాసు ప్రోగ్రామ్‌ని కౌన్సిల్ చేసుకుని ఇక్కడికి వచ్చా. ఇది నా ఇంట్లో వేడుక కాబట్టి వచ్చాను. బాలయ్య వండర్‌ఫుల్ యాక్టర్. ప్రతి పిక్చర్ లోనూ ఒక వెరైటీ, ఒక డైలాగ్ ఉంటుంది. అన్నయ్యని ఇమిటేట్ చేశానంటే నేను ఒప్పుకోను అన్నారు. పూరిజగన్నాథ్ మాట్లాడుతూ ఆనందప్రసాద్‌గారితో వర్క్ చేయడం చాలా బావుంది. ప్రొడక్షన్‌తో పాటు పబ్లిసిటీ కూడా బాగా చేస్తున్నారు. మావా ఏక్ పెగ్‌లా రాకింగ్. పిల్లలు కూడా పాడేస్తున్నారు. బాలయ్యతో ఇన్నాళ్లు చేయక మిస్ అయ్యా. ఇప్పుడు షూటింగ్ పూర్తయ్యాక రోజూ మిస్ అవుతున్నా. ఇలాంటి హీరోని నేను ఇప్పటిదాకా చూడలేదు. సెప్టెంబరు 29న విడుదల చేయాలనుకుంటే ఐదు వారాల ముందు తనకు కావాలని నిర్మాతగారు అడిగారు. 5 వారాల ముందు రావడానికి చార్మి చాలా ప్లాన్ చేసింది. సపోర్ట్ చేసిన అందరికీ థాంక్స్ అన్నారు..

చైతూ కథలు ఎంచుకునే తీరు నచ్చింది

యువసామ్రాట్ నాగచైతన్య హీరోగా ప్రముఖ నిర్మాణ సంస్థ వారాహి చలనచిత్రం బ్యానర్‌పై కృష్ణ ఆర్.వి.మారి ముత్తు దర్శకత్వంలో రజని కొర్రపాటి నిర్మాతగా రూపొందుతోన్న చిత్రం యుద్ధం శరణం. సీనియర్ హీరో శ్రీకాంత్ ఈ



చిత్రంలో నెగటివ షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నారు. లావణ్య త్రిపాఠి హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. వివేక సాగర్ సంగీతం అందించిన పాటల్ని విడుదల చేశారు. కీరవాణి సీడిలను ఆవిష్కరించి రాజమౌళికి అందించారు. .ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ షూటింగ్ చూద్దానికి సెట్‌కెళితే...ఓ ఫ్యామిలీ ఫంక్షన్ జరుగుతుంటే దానిని కెమెరాతే షూట్ చేస్తున్నట్టుగా అక్కడి వాతావరణం ఉంది. దాంతో నా నమ్మకం మరింత బల పడింది. ట్రైలర్ చూశాక ఈ సినిమా సూపర్‌హిట్ అవుతుందనిపించింది. చైతన్య కథలు ఎంచుకునే తీరు నచ్చింది. విలన్‌గా శ్రీకాంతగారి గెటప్ బావుతంది. వివేక్ సాగర్ సంగీతం చక్కగా కుదిరింది అన్నారు. హీరో నాగచైతన్య మాట్లాడుతూ టీజర్ విడుదలైనప్పుడు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్ చూసి మా యూనిట్‌కు ఎంతో బలం వచ్చింది. ఈ సినిమా ఇక్కడి వరకు వచ్చిందంటే కారణం సాయికొర్రపాటి గారే. సెప్టెంబరు 8న విడుదలయ్యే ఈ సినిమా యుద్ధంలో తను డైరెక్టర్‌గా గెలిచి నిలుస్తాడు. ఓ సామాన్యుడు పవర్‌ఫుల్ విలన్‌గా ఎలా గెలిచాడు అన్నది కథ. ఇందులో హీరో ఎక్కడా వెపన్ ఉపయెగించడు. వయలెన్స్ ఉండదు. సోషల్ మీడియా, టెక్నాలజీ, ఇంటెలిజెన్స్‌ను మాత్రమే తన ఆయుధాలుగా వాడతాడు. వివేక్‌సాగర్ సంగీతం సినిమాను మరోస్థాయికి తీసుకెళ్తుంది అన్నారు. ఎం.ఎం.కీరవాణి మాట్లాడుతూ సాయి కొర్రపాటి, నాగచైతన్యలకు ఆల్ ది బెస్ట్. వీరితో పాటు కార్తికేయకు ఆల్ ది బెస్ట్ అన్నారు. సంగీత దర్శకుడు వివేక్‌సాగర్ మాట్లాడుతూ పాటలు బాగా రావడానికి నా ఒక్కడి కృషే కాదు. నా టీమ్ అందరిక కృషి ఉంది అన్నారు. డి. సురేశబాబు, రానా, ఎస్.ఎస్.కార్తికేయ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డైరెక్టర్ కృష్ణ ఆర్.వి.మారిముత్తు మాట్లాడుతూ సినిమా గురించి చెప్పాలంటే చైతన్య ఎప్పటి నుండో తెలుసు దర్శకుడు కృష్ణకూడా అప్పటి నుండే తెలుసు. చైతన్యకు మంచి ఫ్రెండ్. వీరి మధ్య ఫ్రెండ్‌షిప్ కారణంగానే సినిమా బాగా వచ్చిందని అనుకున్నాం. నాకు నా సినిమాలంటే ఎంత ఇష్టమో. చైతన్య సినిమాలన్నా, అంతకన్నా ఎక్కువ ఇష్టం. ఈ సినిమా ఏడాది విడుదలైన సినిమాలన్నింటి కంటే పెద్ద హిట్ చిత్రంగా నిలవాలని కోరుకుంటున్నాను. టీమ్‌కు ఆల్ ది బెస్ట్ అన్నారు.

'ఆక్సిజన్' అప్‌డేట్స్

గోపీచంద్ కథానాయకుడిగా ఎ.ఎం.జ్యోతికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆక్సి జన్ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి గోపీచంద్ సరసన



రాశీఖన్నా, అను ఏమాన్యూల్ కథానాయకలుగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీసాయిరామ్ క్రియేషన్స్ పతాకంపై ఎస్.ఐశ్వర్య నిర్మిస్తున్నారు. త్వరలో ఆడియో విడుదల కానున్న ఈ చిత్రాన్ని అక్టోబర్12న విడుదల చేసేందుకు దర్శకనిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ఎస్.ఐశ ్వర్య మాట్లాడుతూ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. గోపీచంద్ కెరీర్‌లో బిగ్గెస్ట్ బడ్జెట్‌తో తెరకెక్కిన సినిమా ఆక్సి జన్. ముంబై, గోవా, సిక్కిం, చెన్నైలాంటి ప్రదేశాల్లో నిర్మాణ విలువల విషయంలో ఎక్కడా రాజీపడకుండా ఆక్సి జన్ చిత్రాన్ని రూపొందించాం. యువన్ శంకర్ రాజా సంగీత దర్శకత్వంలో రూపొందిన ఆక్సి జన్ ఆడియో మన తెలుగు ప్రేక్షకులకి ఒక సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది. ఇక జ్యోతికృష్ణ టేకింగ్ స్టాండర్డ్ ్స విషయం సినిమా రిలీజయ్యాక ప్రేక్షకులకు అర్థమవుతుంది. త్వరలోనే యువన్ శంకర్ రాజా సంగీత సారథ్యంలో రూపొందిన ఆడియోను త్వరలో విడుదల చేసి, అక్టోబర్12న చిత్రాన్ని విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం అన్నారు. జగపతిబాబు, కిక్‌శ్యామ్, అలీ, చంద్రమోహన్, నాగినీడు, బ్రహ్మాజీ, అభిమన్యు సింగ్, అమిత్, ప్రభాకర్, సాయాజీ షిండే, ఆశిష్ విద్యార్థి, వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్, సితార తదితరులు ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.

రవితేజతో కేథరిన్

మాస్ మహారాజా రవితేజ రాజా ది గ్రేట్, టచ్ చేసి చూడు సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఈ రెండు సినిమాల తరువాత మరో ప్రాజెక్ట్ లైన్‌లో పెట్టాడట. తమిళంలో ప్రభుదేవా నిర్మించిన భోగన్ మూవీని తెలుగులో రవితేజతో రీమేక్ చేయనున్నారట. ఈ తెలుగు రీమేక్‌లో హీరోయిన్‌గా కేథరిన్ పేరు వినిపిస్తోంది. స్టార్ హీరోలతో సినిమాలు చేస్తున్నా...కేథరిన్ కెరీర్‌కి ఇప్పటవరకూ సరైన బూస్టప్ రాలేదు. రీసెంట్ హిట్ నేను రాజు...నేనే మంత్రిలో నెగటివ్ టచ్‌ఉన్న రోల్లో కనిపించిన కేథరిన్‌కి మంచి మార్కులే పడ్డాయి. అలాగే జయజానకీ నాయకలో చేసిన ఐటెంసాంగ్ కూడా బాగానే వర్కవుట్ అయింది. సరైనోడు సినిమాతో యంగ్ ఎమ్మెల్యేగా పాపులర్ అయిన కేథరిన్‌కి హీరో రవితేజతో హీరోయిన్‌గా చేసే ఆఫర్ రావడంతో ఈ అమ్మడి కెరీర్ టర్నింగ్ పాయింట్ అంటున్నారు



అరకోటి+డిజిటల్‌వ్యూస్



శర్వానంద్ హీరోగా, మెహరిన్ హీరోయిన్‌గా, దర్శకుడు మారుతి దర్శకత్వంలో యు.వి. క్రియేషన్స్ బ్యానర్‌లో వంశి, ప్రమోద్ సం యుక్తంగా తెరకెక్కించిన మహానుభావుడు చిత్రం టీజర్‌ని ఆగస్టు 24న విడుదల చేశారు. టీజర విడుదలయ్యిన క్షణం నుంచి తెలుగు ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన లభించింది. అరకోటి+డిజిటర్‌వ్యూస్‌ని సాధించింది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి విజయదశమి సందర్భంగా విడుదల చేస్తున్న ఈ చిత్రం టీజర్‌ని ఇంతలా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకి యువి క్రియేషన్స్ యూనిట్ తరుపున ధన్యవాదాలు తెలిపారు.

రద్దయిన రూ.1000 నోట్లు మళ్లీ వస్తున్నాయా?

మరిన్ని భద్రతా ఫీచర్లతో తేవాలన్న భావన

ముంబయి, ఆగస్టు 28: పెద్దనోట్లరద్దుతో గత ఏడాది రద్దుచేసిన రూ.1000నోట్లను మరిన్ని భద్రతా ఫీచర్లతో వెలువరించాలని ఆర్‌బిఐభావిస్తోంది. కొత్తగా రూ.200నోట్లు, రూ.50 నోట్లు విడుదలచేసిన రిజర్వుబ్యాంకు ఇదేదామాషాలోరద్దైన రూ.1000 నోటుస్థానంలో అత్యాధునిక భద్రతా ఫీచర్లతో కొత్త నోట్లను విడుదల చేయాలని చూస్తోంది. రూ.500 రూ.2000నోట్లకు మధ్య ఉన్న ఖాళీని భర్తీచేసేందుకు రూ.1000 నోటు కూడా అనివార్యమని భావిస్తున్నట్లు ఆంగ్లమాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. అయితే అంతకు ముందే ఆర్థికసేవల కార్యదర్శి శక్తికాంతదాస్ ఫిబ్రవరిలోనే వివరణ ఇస్తూ రూ.1000 నోట్లను తిరిగి ప్రవేశపెట్టే ప్రసక్తేలేదని అన్నారు.



నల్లధనం, మనీలాండరింగ్ కార్యకలాపాలను కట్టడి చేసేందుకు ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం రూ.1000, రూ.500 నోట్లను రద్దుచేసిన సంగతి తెలిసిందే. ఆర్‌బిఐ ఆ తర్వాత రూ.500నోట్లు, రూ.2000 నోట్లు కొత్తకరెన్సీని చెలామణిలోకి తెచ్చింది. అంతేకాకుండా ఈనెల 25వ తేదీ ఆర్‌బిఐ కొత్త రూ.200నోట్లు, రూ.50నోట్లు కూడా చెలామణిలోకి తెచ్చింది. రూ.100, రూ.500 మధ్య ఉన్న ఖాళీని భర్తీచేసేందుకు ఈ ఏర్పాట్లుచేసింది. అయితే కొన్ని పత్రికల కథనాలప్రకారం కొత్త వెయ్యిరూపాయలనోట్లు అత్యంత భద్రతాఫీచర్లతో వస్తున్నాయని, డిసెంబరునాటికి విడుదలయ్యే అవకాశం ఉందని ఉటంకించాయి. భారత్‌లో తక్కువ విలువలున్న కరెన్సీ నోట్లకు రోజువారి చెలామణిలో ఎంతో అవసరం ఉంటుందని అందువల్లనే రూ.50, రూ.200, రూ.500, నోట్లు చెలామణిలోకి తెచ్చిందని స్పష్టం అవుతోంది ఇదిలా ఉండగా పెద్దనోట్ల రద్దయిన తర్వాత 99శాతం రూ.1000 నోట్లు తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చినట్లు రిజర్వుబ్యాంకు చెపుతోంది. ఈఏడాది మార్చి చివరినాటికి రూ.8925కోట్ల విలువైన వెయ్యి రూపాయల నోట్లు చెలామణిలోకి వచ్చాయని వెల్లడించింది. గతఏడాది నవంబరులోనే నరేంద్రమోడీ పెద్ద నోట్లనురద్దుచేసారు. పెద్దనోట్ల రద్దు తర్వాత రూ.1000, రూ.500 నోట్లు చెల్లనవిగా ప్రకటించిన తర్వాత 6858 వెయ్యినోట్లు 6.86 లక్షల విలువైనవి చెలామణిలోకి వచ్చాయని ఆర్థికశాఖ సహాయ మంత్రి వెల్లడించారు. జెఎన్‌యు ప్రొఫెసర్ సురాజిత్ మజుందార్ మాట్లాడుతూరూ.500నోట్లు కూడా పూర్తిస్థాయిలోచెలామణిలోకి వచ్చాయని చెపుతున్నారు. అయితే ఇప్పటివరకూ ఎంతమొత్తం చెల్లని నోట్లు జమ అయ్యాయి. వాటిస్థానంలో ఎంతమొత్తంకరెన్సీ నోట్లు కొత్తగా చెలామణిలోనికి వచ్చాయన్న అంశాన్ని మాత్రం ఆర్‌బిఐ గోప్యంగాఉంచింది. అయితే గవర్నర్ ఉర్జిత్‌పటేల్ మాత్రం రద్దయిన పాతనోట్ల లెక్కింపుఇప్పటికీకొనసాగుతున్నదని చెప్పుకొచ్చారు.

ఇన్ఫోసిస్‌కు నీలేకని జోష్

ముంబై, ఆగస్టు 28: బోర్డురూం యుద్ధం సంక్షోభంతో మార్కెట్ విలువలు భారీగా నష్టపోయిన సాఫ్ట్‌వేర్ సేవల రెండో అతిపెద్ద కంపెనీ ఇన్ఫోసిస్ సోమవారం మార్కెట్లలో లాభాలతో దూసుకుపోతోంది. ఇటీవలి పరిణామాలకు చెక్ పెడుతూ కొత్త ఛైర్మన్‌గా నందన్‌నీలేకని రంగంలోకి దిగడంతో ఈషేర్లకు బూస్ట్ లభించింది. నీలేకని బాధ్యతలు స్వీకరించిన వెనువెంటనే నిర్వహించిన సమావేశాలతో ఇన్వెస్టర్ల ఐదుశాతంపెరిగిన సోమవారం ప్రారంభంలోనే ఇన్వెస్టర్లసంపద రూ.9 వేల కోట్లు పెంచింది. ఇన్ఫోసిస్‌లో స్థిరత్వానికి నందన్ నీలేకని హామీ ఇవ్వడంతో ఈషాక్‌పై ఇన్వెస్టర్ల ఆసక్తి చూపిస్తున్నారు. దీనితో సుదీర్ఘ రోజులతర్వాత మొదటిసారి మార్కెట్లలో భారీ కొనుగోళ్లతో టాప్ లాభాలతో నిలిచింది. మూడుశాతానికిపైగా లాభపడి రూ.944 వద్ద కొనసాగుతున్నది. ఒకప్పటి ఛైర్మన్ సహ వ్యవస్థాపకులునందన్ నీలేకని తాజాగా తిరిగి నాన్ ఎగ్జిక్యూటివ్‌ఛైర్మన్ పదవిని చేపట్టారు. వెంటనేఇన్వెస్టర్లు, వాటాదారులతో సమావేశం నిర్వహించి భద్రతకు, స్థిరత్వానికి హామీ ఇచ్చారు. అంతే కాకుండా తన పదవీకాలం ఎన్నాళ్లు ఉంటుందని బోర్డుతనకు చెప్పలేదని కానీ కంపెనీ కార్యకలాపాల్లో స్థిరత్వాన్ని తీసుకువచ్చేంతవరకూ ఛైర్మన్‌గా కొనసాగుతానని నీలేకని హామీ ఇవ్వడం సానుకూల అంశమని నిపుణులు చెపుతున్నారు. దీనితోపాటు రూ.130వేల కోట్లతో షేర్ల కొనుగోలు అంటే బైబాక్ కు ఆఫర్ ఇస్తున్నారు కాగా ఇన్ఫోసిస్ ప్రమోటర్లలో ఒకరైన నారాయణ మూర్తి కంపెనీ కార్పొరేట్ పాలనపై అసంతృప్తి వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో సిఇఒ, ఎండి పదవులకు విశాల్‌సిక్కా గత వారంలో రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా ఆర్థిక తర్వాత నీలేకని నాన్‌ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా రావడంతో కంపెనీపట్ల మంచి అభిప్రాయం ఉన్న నందన్ ఇన్వెస్టర్లకు భరోసా ఇస్తారని సిఎల్ఎస్ఎ రేటింగ్స్ సంస్థ తన నివేదికలో ఉటంకించింది. విశాల్‌సిక్కారాజీనామా చేసిన రెండురోజుల్లోనేఇన్ఫోసిస్ రూ.34 వేలకోట్ల సంపద చేజార్చుకున్న సంగతి తెలిసిందే. వెనువెంటనే నందన్ నీలేకని పేరురావడంతోషేర్లు కొంతమేరకరకోలుకున్నాయి. సిఎల్ఎస్ఎ రేటింగ్స్ తన క్లయింట్లకు షేర్ల కొనుగోలు రేటింగ్‌ఇచ్చింది. మోర్గాన్‌స్టాన్లీ సంస్థ జెఫరీస్ సంస్థ ఇన్ఫోసిస్‌షేర్లకు నీలేకని రాక మరింత మద్దతునిచ్చిందని ప్రకటించింది.



బిఎస్ఇ200 జాబితాలో 388బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు

ముంబయి, ఆగస్టు 28: విదేశీ పెట్టుబడి సంస్థలు దేశీయ ఈక్విటీల్లో ఈ ఏడాది జూన్‌వరకూ పెట్టుబడుల గణనీయంగా పెంచారు. గత ఏడాదితో పోలిస్తే 24.93శాతం పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు 388 బిలియన్ డాలర్ల బిఎస్ఇ 200 జాబితా కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారు. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు 271బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టారు. మూడునెలల్లోనే 11.8నుంచి 12.2శాతానికి పెంచింది. మొత్తం మార్కెట్ విలువలు 1.557 లక్షలకోట్ల డాలర్లలో 24.93శాతం నిధులు అందాయి. మార్చి, జూన్‌నెలల మధ్యకాలంలో సెన్సెక్స్ 4.4శాతం పెరిగితే నిఫ్టీ 3.8శాతం పెరిగింది. దేశీయసంస్థాగత ఇన్వెస్టర్లుబ్యాంకులు, ఆర్థిక సంస్థలు వంటివాటిలో ఇప్పటివరకూ 07 బిలియన్ డాలర్ల పెట్టుబడులున్నాయి. మ్యూచువల్‌ఫండ్స్ 83 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాయి. ఎల్‌ఐసి ఒక్కటే 81 బిలియన్‌డాలర్ల వాటాతోఉంది. బిఎస్ఇ 200 జాబితాలో విదేశీయుల వాటా క్రమానుగతంగా పెరుగుతున్నది. జూన్‌నెలో 20బిలియన్ డాలర్లు పెరిగి 388 బిలియన్ డాలర్లకు చేరింది. మార్చి నాటికిఉన్న 368 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఒక్కసారిగా పెరిగింది. అయితే విలువలపరంగా ప్రమోటార్ల వాటా 48.9శాతం నుంచి 47.8శాతానికి క్షీణించింది. ఈ కాలంలోనే పెట్టుబడులు 745 బిలియన్ డాలర్ల నుంచి 733 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ప్రమోటర్ల వాటాపరంగాచూస్తే 27.54శాతం నుంచి 7.51శాతానికి దిగజారింది. షేర్ల స్వల్పంగానే ఉన్నప్పటికీ కొంత కలవరం వ్యక్తం అవుతోంది. జూన్‌చివరినాటికి 12.40శాతం నుంచి 11.10శాతానికి పడిపోయింది. అలాగే విదేశీ ప్రమోటర్ల వాటాలు కూడా 9.23శాతం పెరిగి 8.96 శాతానికి చేరాయి. రిటైల్ ఇన్వెస్టర్ల వాటా కూడా జూన్‌నాటికి 7.66శాతం నుంచి 7.83శాతానికి పెరిగింది. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ప్రస్తుత త్రైమాసికంలోనే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ఆరత్‌లోని ఈక్విటీల్లో రూ.1400కోట్ల విలువైన వాటాలను కొనుగోళ్లు చేశారు. ఫార్మా టెక్నాలజీ సంస్థాగత దేశీయ ఇన్వెస్టర్లు ఎక్కువగా బ్యాంకింగ్ ఫార్మాకెమికల్‌రంగాలు, మెటల్, మైనింగ్ వాటాలపై దృష్టిపెడితే విదేశీ ఇన్వెస్టర్లు ఫార్మా, టెక్నాలజీ రంగాలపై ఎక్కువ దృష్టిపెట్టారు. జూన్ త్రైమాసికంలో ఎఫ్‌పిఐ వాటా బిఎస్ఇ 200 సూచీలో 20 బిలియన్‌డాలర్లుగా ఉంది. కోటక్ గణాంకాలప్రకారంచూస్తే అత్యధిక విదేశీపెట్టుబడులు బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్, ఈక్విటాస్ హోల్డింగ్స్, దాల్మియా భారత్ సంస్థల్లో ఉన్నాయి. ఐడిఎఫ్‌సి ఈక్విటాస్ హోల్డింగ్స్ పెట్రోనెట్ ఎల్ఎన్‌జి, బిఎఫ్ఐ రంగాలలో తమ వాటాలను నేషనల్ అల్యూమినియం కంపెనీలో పెంచుకున్నాయి. టాటాకెమికల్, వేదాంతలో కూడా ఇదే తీరులో కొనసాగాయి. అతి తక్కువగా ఉన్న విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడుల్లో ఐడిఎఫ్‌సి, రిలయన్స్ కమ్యూనికేషన్స్, అపోలో టైర్స్ వంటి వాటిలో దిగ జారాయి. మ్యూచువల్‌ఫండ్స్ పరంగా సుప్రజిత్ ఇంజినీరింగ్, సిజి వినియోగరంగం, క్రిసిల్‌లో ఉన్నాయి. ఇక బ్యాంకింగ్, ఆర్థికరంగం, బీమా రంగాలపరంగా జెకెసిమెంట్, ఉజ్జీవన్, అదాని ఎంటర్‌ప్రైజెస్‌లో పెట్టుబడులు పెట్టాయి.



లాభాలు / నష్టాలు

రూ.లలో రూ.లలో

కంపెనీ పేరు	ప్రస్తుత ధర రూ.లలో	మార్పు శాతం
నెస్లేఇండియా	7030.05	6.60
జెఅండ్‌కెబ్యాంకు	83.00	2.22
ఎన్‌టిపిసి	172.70	2.10
క్రిసిల్	1889.00	2.03
ఎసిసి	1816.40	2.02
సన్‌ఫార్మా	492.75	1.96
ప్రెస్టీజ్	263.25	1.94
బాటాఇండియా	680.70	1.92
గ్లాస్కో	2430.00	1.89
కోరమండల్	444.60	3.66
అంబుజాసిమెంట్స్	280.05	1.78

మార్కెట్ నష్టాలు (బిఎస్ఇ)

డిఎల్‌ఎఫ్	179.75	-3.65
డాక్టర్‌రెడ్డీస్	2045.95	-2.01
అపోలోటైర్స్	252.30	-1.68
టిసిఎస్	2485.85	-0.38
టాటాస్టీల్	636.70	-0.35
ఇండిగో	1186.00	-0.11
బ్రిటానియా	4187.95	-0.70
ఐడియా	90.00	-0.06
టెక్‌మహీంద్ర	427.75	-0.05
ఇక్రా	3860.00	-0.55
టాటాగ్లోబల్	193.00	-0.67

వెన్‌కాబ్ ధరలు

Mobile No. 9849219870

(రూ. కిలోకు)	(Rs. Per Kg)	
ఫామ్‌గేట్	(Farmgate)	84
డ్రెస్డ్	(Dressed)	99
విత్ స్కిన్	(with skin)	139
స్కిన్‌లెస్	(Skinless)	163

గుడ్ల ధరలు

Ph:040-23234068

నెక్ రేట్లు (29 - 8 - 2017) NECC RATES

వందకు, రూ.లలో	Rs.per 100 eggs	
హైదరాబాద్	355	Hyderabad
(రిటైల్ ధర రూ.4.15	(Retail Price Rs.4.15)	
విజయవాడ	359	Vijayawada
గోదావరి	359	Godavari
విశాఖపట్నం	362	Visakha
వరంగల్	357	Warangal
చిత్తూరు	390	Chittoor
చెన్నై	397	Chennai
ముంబయి	400	Mumbai
న్యూఢిల్లీ	360	New Delhi
కోల్‌కతా	394	Kolkata
బెంగళూరు	382	Bangalore
నమక్కల్	387	Namakkal

బులియన్ ధరలు

	28 న ముగింపు	క్రితం ముగింపు
ఢిల్లీ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	29610	29450
22 క్యారెట్లు (10గ్రా)99.5	27730	27570
వెండి .999 (కేజి)	41641	41915
ముంబయి		
24 క్యారెట్లు (10గ్రా)99.9	29590	28440
22 క్యారెట్లు (10గ్రా)99.5	27710	27560
వెండి .999 (కేజి)	41635	41905
చెన్నయ్		
24 క్యారెట్లు10(గ్రా)	29600	29460
22 క్యారెట్లు	27720	27580
వెండి బార్ (కేజి)	41628	41933
హైదరాబాద్		
24 క్యారెట్లు (10గ్రా)	29630	29490
22 క్యారెట్లు (10గ్రా)	27750	27610
వెండి (కేజి)	41661	41952
విజయవాడ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	29600	29460
22 క్యారెట్లు (10గ్రా)99.5	27720	27580
వెండి .999 (కేజి)	41641	41915
విశాఖపట్నం		
24 క్యారెట్లు10(గ్రా)	29600	29460
22 క్యారెట్లు	27720	27580
వెండి బార్ (కేజి)	41641	41915

కీలక ఆస్తులను నగదీకరణ చేస్తున్న ఎయిర్ ఇండియా

ముంబయి, ఆగస్టు 28: ప్రభుత్వరంగంలోని ఎయిర్ ఇండియా కీలకమైన 27 ఫ్లాట్లను విక్రయించాలని నిర్ణయించింది వాణిజ్యస్థలాలు, ఆఫీసు భవనాలు దేశవ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో ఉన్నాయి. స్థిరాస్థి నగదీకరణ కార్యక్రమం కింద పెట్టుబడుల ఉపసంహారణ విధానానికి ఎయిర్ ఇండియా కూడా చేరింది. రుణభారంతో సతమతం అవుతున్న ఎయిర్ ఇండియాను గట్టెక్కించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టింది. ప్రభుత్వరంగంలోని ఎంఎస్‌టిసి ఈ ఆస్తులను ఇవేలం వేస్తుంది సెప్టెంబరు ఆరవ తేదీ బిడ్ల దాఖలకు చివరితేదీగా నిర్ణయించింది. పబ్లిక్‌నోటీస్ వివరాలప్రకారంచూస్తే ముంబై,బెంగళూరు, కోల్‌కత్తా, చెన్నై, తిరువనంతపురం, అహ్మదాబాద్, పూణె, గోవా, లక్నో, గ్వాలియర్, గుర్‌గావ్, భుజ్ ప్రాంతాల్లో విలువైన ఆస్తులున్నాయి. వీటి విక్రయం ద్వారా కనీసం రూ.500 కోట్లు రాగలవని ఎయిర్ ఇండియా అంచనావేసింది. 2012లోనే ఎయిర్ ఇండియాకు జవసత్వాలిచ్చేందుకుగాను ప్రభుత్వం ప్యాకేజి ప్రకటించింది. 2021 వరకూ దశలవారీగా రూ.30,231 కోట్ల ఈక్విటీ నిధులు అందించేందుకు సిద్ధం అయింది. అంతేకాకుండా ఎయిర్ ఇండియా కూడా తనవద్ద ఉన్న కీలక ఆస్తులను ప్రస్తుతం ఉప యోగంలో లేనివాటినివిక్రయించి రూ.5వేల కోట్లు సమీకరించాలని చూస్తోంది. వీటిని అమ్మడం, లేదా లీజుకిచ్చే ప్రాతిపదికన నిధులు రాబడుతుంది. ఇప్పటివరకూ ఎయిర్‌ఇండియా తనకు ముంబైలో ఉన్నఫ్లాట్లలో కేవలం నాలుగింటిని మాత్రమే ఎస్‌బిఐకి రూ.90 కోట్లకు విక్రయించింది. ఎయిర్ ఇండియా నికర రుణం రూ.48,876.81 కోట్లుగా ఉంది. ఈమొత్తంలో రూ.17,359.77కోట్లు ఎయిర్‌క్రాఫ్ట్ రుణాలే ఉన్నాయి. మిగిలినమొత్తంరూ.31,517.04 కోట్లు మూలధన అవసరాలకు రుణాలను తెచ్చింది. ప్రభుత్వరంగంలోని ఈ విమానయాన సంస్థ నికర నష్టం రూ.3643 కోట్లుగా ఉంది. నిర్వహణ లాభం మాత్రం గత ఆర్థిక సంవత్సరంలో రూ.300 కోట్లుగా ఉంది.



నాలుగు ఐపిఒలు రూ.రెండువేల కోట్లు

ముబయి, ఆగస్టు 28: స్టాక్ మార్కెట్లలో కనీసం నాలుగు కంపెనీలు రెండు వేల కోట్లు ఐపిఒద్వారానిధులు సమీకరించేందుకు సిద్ధంఅవుతున్నాయి. సెప్టెంబరులోనే ఐపిఒ జారీచేస్తున్నట్లు అంచనా. కంపెనీలు ప్రాథమికంగా వాటాల విక్రయాన్ని వచ్చేనెల ప్రారంభిస్తాయి. ఆన్‌లైన్ మాట్రిమోని కంపనీ మాట్రిమోని డాట్‌కామ్, రోడ్ల అభివృద్ధి సంస్థ భారత్ రోడ్‌న ఎట్‌వర్క్, ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ డిక్సన్ టెక్నాలజీస్ వంటివి ఉన్నాయి. వీటితోపాటే రియల్‌ఎస్టేట్ సేవల సంస్థ కెపాసిటిఇన్‌ఫ్రా ప్రాజెక్టులు వంటివి కూడా ఐపిఒకు వస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 15 కంపెనీలు ఐపిఒలద్వారా రూ.12,589.94 కోట్ల నిధులు సమీకరించాయి. ప్రైమ్‌డేటాబేస్ గణాంకాలను అనుసరించి చూస్తే 2015, 2016 సంవత్సరాల్లో మొత్తం 47 కంపెనీలు రూ.40,107 కోట్లు నిధులు సమీకరించాయి. గురువారమే శ్రేయి ఇన్‌ఫ్రాఫైనాన్స్ మాతృసంస్థ బిఆర్‌ఎన్‌ఎల్ సెప్టెంబరు ఆరున ఐపిఒ జారీచేస్తుందని, రూ.600 నుంచి 700కోట్లు నిధులు సమీకరిస్తామని వెల్లడించింది. బిల్డ్ ఓన్, ట్రాన్స్‌ఫర్ (బిఒటి) పద్ధతిలోరోడ్డు ప్రాజెక్టులను చేపడుతోంది. వీటిలో ఐదుప్రాజెక్టుల ఇప్పటికే అమలులో ఉండగా మరొకటి నిర్మాణదశలో ఉంది. ఐపిఒద్వారా వచ్చే నిధులను తమ అనుబంధ సంస్థల అవసరాలకు వినియోగిస్తుంది. మాట్రిమోని డాట్‌కామ్ కూడా రూ.500 కోట్ల ఐపిఒ జారీ చేస్తోంది. వాటాలను రూ.130కోట్లకు మించకుడా అమ్ముతుంది. 3.7 మిలియన్ల వాటాలున్నాయి. వెంచర్ కేపిటల్ ఇన్వెస్టర్ బెస్సెమర్ వెంచర్ పార్టనర్స్ సంస్థనుంచి పూర్తిగా వైదొలగడం, వెంచర్ కేపిటల్‌సంస్థ మైఫీల్డ్ ఫండ్ కూడా తన వాటాను విక్రయించేందుకు నిర్ణయించడంతో ఐపిఒకు వస్తోంది. ఈ నిధులను వ్యాపారప్రకటనలు, ప్రచారం బిజినెస్ వృద్ధి, కొత్త కార్యాలయ నిర్మాణం ఓవర్‌డ్రాఫ్టు చెల్లించేందుకు వినియోగిస్తామని వెల్లడించింది. మోతీలాల్ ఓస్వాల్‌ప్రైవేటు ఈక్విటీడ్వయిజర్స్ ఆధ్వర్యంలోని డిక్సన్ టెక్నాలజీస్ రూ.600-650 కోట్ల ఐపిఒను జారీచేస్తోంది. ఈ మొత్తంలో కంపెనీ రుణ భారం తగ్గించేందుకు వినియోగిస్తుంది. ఆ తర్వాత లెడ్ టివిల ఉత్పత్తియూనిట్ ఏర్పాటుకు నిధులు ఖర్చు చేస్తుంది. మోతీలాల్ ఓస్వాల్ కూడా తనవాటాలో కొంత మొత్తం ఐపిఒలో విక్రయిస్తుంది. ముంబె కేంద్రంగా ఉన్ననిర్మాణ కంపెనీ కెపాసైట్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్సు రూ.400 కోట్ల ఐపిఒ జారీచేస్తోంది. సెప్టెంబరు మొదటిపక్షంలోనే జారీచేస్తోంది. కంపెనీ ఈ ఐపిఒ నిధులను మూలధన అవసరాలు, కొత్త మూలధన ఆస్తుల కొనుగోళ్లు, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగిస్తుంది.




సెన్సెక్స్, నిఫ్టీ రెండింటా లాభాలే!

బ్రిక్స్‌సదస్సు, డిఐఐల మద్దతు

ముంబయి,ఆగస్టు 28: సెన్సెక్స్ నిఫ్టీ రెండూ కూడా వారం ప్రారంభంలోనే 0.5శాతం పెరిగాయి. భారత్, చైనా రెండూ కూడా ఇరువైపులా దళాలను ఉపసంహరించుకు నేందుకు ఒప్పందానికి రావడం, మార్కెట్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. అలాగే వచ్చేనెలలో చైనాలో జరుగనున్న బ్రిక్స్‌దేశాల సదస్సుకు ప్రధాని నరేంద్రమోడీ హాజరయ్యే అవకాశం కూడా మార్కెట్లకు కొంత మద్దతు నిచ్చింది. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లనుంచి సానుకూల ధోరణులు, ఆసియామార్కెట్ల మద్దతు డొనాల్డ్‌ట్రంప్ మార్కెట్ స్నేహపూర్వక సంస్కరణలతో ముందుకువస్తారన్న సెంటిమెంట్ మార్కెట్లను పటిష్టపరిచింది. 30షేర్ బిఎస్ఇ సెన్సెక్స 155 పాయింట్లు పెరిగి 31,751 పాయింట్లవద్ద స్థిరపడితే, 50షేర్ నిఫ్టీ 55 పాయింట్లు పెరిగి 9912 పాయింట్లవద్ద స్థిరపడింది. బిఎస్ఇ విభాగ సూచీల్లో వినియోగరంగ సూచీ 1.25శాతం, ఐటి 1.23శాతం, ఎఫ్‌ఎంసిజి 1.22శాతం, ఇన్‌ఫ్రా 1.18శాతం పెరిగాయి. కేవలం రియాల్టీ సూచి మాత్రమే 0.01శాతం దిగజారింది. సెన్సెక్స్‌టాప్ ఐదు లాభాల సంస్థల్లో ఇన్ఫోసిస్ 3.21శాతం, ఎన్‌టిపిసి 2.66శాతం, హీరోమోటోకార్ప్ 2.33శాతం, సన్‌ఫార్మా 1.97 శాతం, హిందూస్థాన్ యూనిలీవర్ 1.33శాతం లాభపడ్డాయి. డాక్టర్ రెడ్డీస్ 2.15శాతం, టాటా మోటార్స్ 1.3శాతం,పవర్‌గ్రిడ్0.98శాతం, ఎస్‌బిఐ 0.43శాతం, లూపిన్ 0.33శాతం పెరిగాయి. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నందన్ నీలేకని కొత్త నాన్‌ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నిర్వహించిన ఇన్వెస్టర్ల సమావేశం వారిలో విశ్వాసాన్ని నింపడంతో షేర్లు 4.6శాతం పెరిగాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ షేర్లు అమెరికా లాస్యూట్‌తో కొంతమేరదెబ్బతిన్నాయి. 2.9శాతం షేర్లు దిగజారాయి. రానున్న రోజుల్లో మార్కెట్లు కొంత అనిశ్చితితో ఉంటుం దని, నిపుణులు చెపుతున్నారు. ఇన్ఫోసిస్ ర్యాలీతో కంపెనీకి కొంత మద్దతు వచ్చిందన్నారు. ఇక ఆసియా మార్కెట్లపరంగా జపాన్ నిక్కీ 0.28 శాతం పెరిగింది. హాంకాంగ్ హ్యాంగ్‌షెంగ్ 0.47 శాతం ప్రారంభంలో లాభాల్లో నడిచింది. షాంఘై కాంపోజిట్ 0.81శాతం స్వల్పంగా పెరిగింది. అమెరికా డౌజోన్స్ పారిశ్రామిక సగటు 0.14 శాతం ఎగువన శుక్రవారం నమోదు చేసింది.

చిన్నషేర్ల హవా

సానుకూల సెంటిమెంట్ నేపథ్యంలో శక్తివంతంగా మొదలైన మార్కెట్లు చివరికి లాభాలతోముగిసాయి. ట్రేడింగ్ ముగిసేసరికి నిఫ్టీ సాంకేతికంగా కీలకమైన 9900 ఎగువన నిలిచింది. ఇందుకు ప్రధానంగా ఫార్మా, ఐటి, ఎఫ్‌ఎంసిజి రంగాలు సుమారు ఒకటి శాతం చొప్పున బలపడటం మద్దతిచ్చినట్లయింది. 56 పాయింట్లు పెరిగిన నిఫ్టీ 9913వద్ద స్థిరపడితే సెన్సెక్స్ 155 పాయింట్లు పుంజుకుని 31,751పాయింట్లవద్ద నిలిచింది. మార్కెట్లను మించుతూ చిన్నషేర్లకు భారీ డిమాండ్‌కకనిపించింది. బిఎస్ఇలోట్రేడ్ అయిన మొత్తం షేర్లలో 1612 లాభపడితే 950వరకూ నష్టపోయాయి మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒకటిశాతానికిపైగా నష్టపోయాయి. దేశీయ స్టాక్స్‌లో ఇటీవల అమ్మకాలకే ప్రాధాన్యమిస్తూ వస్తున్న విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు గురువారం మరోసారి రూ.697 కోట్లు పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. గడచిన మూడుట్రేడింగ్ సెషన్లలోను ఎఫ్‌పిఐలు రూ.4800 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. దేశీయ ఫండ్స్ మూడురోజుల్లో 1800 కోట్లు పెట్టుబడులు పెట్టారు. గురువారం కూడా డిఐఐలు రూ.1044కోట్లు పెట్టుబడులు పెట్టాయి.



తెలంగాణ మార్కెట్‌కు హుండై వెర్నా

హైదరాబాద్, ఆగస్టు 28: హుండై వెర్నా కొత్త వెర్షన్‌ను విడుదలచేసింది. 4500 బుకింగ్స్ ఇప్పటివరకూ బుక్ అయినట్లు కంపనీ చెపుతోంది. కొత్త వెర్నా మార్కెట్ వాటాకు మంచి మద్దతునిస్తుందని కంపెనీ చెపుతోంది. హోండా సిటీ, మారుతిసుజుకి సియాజ్‌కు పోటీగా వెర్నా నిలుస్తుందని అంచనా. వాస్తవానికి హోండా వెర్నా చూసేందుకు బేబి ఎలాంట్రాగాక కనిపిస్తుంది. 7 అంగుళాల ఐపిఎస్ డిస్‌ప్లే టచ్ స్క్రీన్ యాపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటోమిర్రర్ లింక్‌తోవస్తోంది. ఎఫ్ఎం, యుఎస్‌బి, బ్లూటూత్, ఆక్స్ ఇన్‌కనెక్టివిటీ వంటివి మంచి ఆకర్షణీయంగా డిజైన్‌తో వచ్చాయి. ఐబ్లూ యాప్ ఆడియో వ్యవస్థను నియంత్రించుకునే వీలుంటుంది స్మార్ట్‌ఫోన్‌నుంచే ఈయాప్‌సాయంతో నియంత్రించుకోవచ్చు. మొత్తంగాచూస్తే కొత్తవెర్నా అధునాతన ఫీచర్లన్నింటిని అందిస్తోంది. హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన విడుదలకార్యక్రమంలో ఈ వెర్నా కారును చూసేందుకు కస్టమర్లు ఎగబడ్డారు. 1.6లీటర్ పెట్రోలు, 1.6లీటర్ డీజిల్‌మిల్‌ను ఏర్పాటు చేసింది. ఆటోమేటిక్‌ట్రాన్స్‌మిషన్‌లతో వచ్చినహోండా వెర్నా మార్కెట్‌లో వెనుకంజ వేయదన్నది తెలుస్తోంది.



తెలంగాణలో ఆర్‌అండ్‌డి విస్తరించిన హోస్ట్ అనలిటిక్స్

హైదరాబాద్, ఆగస్టు 28: భారత్‌లోతమ ఆర్‌అండ్‌డి ఉనికిని హోస్ట్ ఎనలిటిక్స్ విస్తరించింది. చస్కేలబుల్ క్లౌడ్‌ఆధారితవ్యవస్థీకృత పనితీరు యాజమాన్యం (ఇపిఎం)లలో సుప్రసిద్ధ హోస్ట్ ఎనలిటిక్స్ దక్షిణ భారతరాష్ట్రం అయిన తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో తమ ఆర్‌అండ్‌డి సెంటర్‌ను రెట్టింపుసైజ్‌కు తెచ్చింది. ఈ కేంద్రంలో కంపెనీ 25 మిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టడంతోపాటు రాబోయే మూడేళ్లలో ఇంజినీరింగ్‌వర్క్‌ఫోర్స్‌ను భారీగావిస్తరిస్తోంది. హైదరాబాద్‌తోపాటే భారకత్‌లోను, అమెరికాలో హోస్ట్ ఎనలిటిక్స్ కార్యకలాపాలు ఎక్కువగా ఉన్నాయని సిఇఒ డేవిడ్ కెల్లోగ్ అన్నారు. హైదరాబాద్‌కేంద్రం 150 మందికిపైగా ఉద్యోగాలిచ్చింది. ఇంజినీరింగ్, క్లౌడ్ ఇపిఎం సాఫ్ట్‌వేర్‌కోసంప్రతిభకలిగిన వారున్నారు. యుఎక్స్, యుఐ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ప్రొడక్టు మేనేజ్‌మెంట్, పనితీరు ఇంజనీరింగ్ క్వాలిటీ అస్యూరెన్స్, టెక్నికల్ ఆపరేషన్స్ కస్టమరు సపోర్టు ప్రొఫెషనల్ సేవలున్నట్లు డేనియల్ కెల్లోగ్ వివరించారు.



ఇజ్రాయెల్‌కు పెరుగుతున్న భారత్ పర్యాటకులు

హైదరాబాద్, ఆగస్టు 28: దేశంలో భారతీయ పర్యాటకులను మరింత ప్రోత్సాహించేందుకుగాను ఇజ్రాయెల్ పర్యాటక మంత్రిత్వశాఖ దేశంలో ఆరునగరాల్లో రోడ్‌షో నిర్వహిస్తోంది. ముంబైలో ఈనెల 21న ప్రారంభించిన ఈరోడ్‌షో అనంతరంఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు మీదుగా జరిగి 30వ తేదీ చెన్నైతో ముగుస్తుంది. ఇజ్రాయెల్ మంత్రిత్వశాఖ డైరెక్టర్ హసన్ మదా, మార్కెటింగ్ డైరెక్టర్ జుదా శామ్యూల్ తదితరులు హైదరాబాద్ రోడ్‌షోలో ఇజ్రాయెల్ పర్యాటకరంగ విశేషాలను వెల్లడించారు. ప్రతినగరం నుంచి 100కుపైగాట్రావెల్ ఏజెంట్లు ఈ రోడ్‌షోలో పాల్గొన్నారన్నారు. డైరెక్టర్ హసన్‌మాదా మాట్లాడుతూ ఈ ఏడాది 34వేల మందికిపైగా భారతీయులు ఇజ్రాయెల్‌ను సందర్శించారన్నారు. 6శాతం భారతీయ పర్యాటకుల సంఖ్య పెరిగిందని, తమదేశానికి ఎల్‌ఆల్ నేరుగా భారత్‌ను ఇజ్రాయెల్‌తో కలుపుతోందని, టెల్ అవీవ్‌కు నేరుగా మూడు వారం విమానాలు వేసవిలో మూడు, శీతాకాలంలో నాలుగు నడుపుతున్నాయన్నారు. అడీస్ అబాబామీదుగా నడుస్తాయన్నారు. ఢిల్లీనుంచి టెల్ అవీవ్‌కు ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్, రష్యన్ ఎయిర్‌లైన్స్ ఎరోఫ్లోట్ ఢిల్లీనుంచి మాస్కోమీదుగా టెల్ అవీవ్‌కు సర్వీసులు నడుస్తున్నాయని, ఇవికాకుండా ఇతర యూరోపియన్ కార్యరియర్‌లు నడుస్తున్నట్లు వివరించారు.



సైమాంటిక్‌తో ఎయిర్‌టెల్ ఒప్పందం



ముంబయి, ఆగస్టు 28: ప్రపంచ వ్యాప్త సైబర్ సెక్యూరిటీ సంస్థ సైమాంటిక్‌తో టెలికాం కంపెనీ ఎయిర్‌టైల్ వ్యూహాత్మక భాగస్వామ్యం చేసుకుంది. సంస్థకు కావాల్సిన సైబర్ సెక్యూరిటీ సేవలందించేందుకుగాను ఈ ఒప్పందం కుదుర్చినట్లు ఎయిర్ టెల్ వెల్లడించింది. డిజిటలైజేషన్‌కు ఆదరణ పెరుగుతున్న తరుణంలో సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని వీటికి చెక్ చెప్పేందుకే సైమాంటిక్ కార్పొరేషన్‌తో డీల్ చేసుకున్నామని ఎయిర్‌టెల్ చెపుతోంది. ఎన్‌ఎస్ఇలో ఈ స్టాక్ 0.4శాతం మేర పెరిగి రూ.434.40వద్ద ట్రేడ్ అవుతోంది. ఆర్‌జియోతో గట్టిపోటీ ఎదుర్కొంటున్న ఎయిర్‌టెల్ జియోకు ధీటుగా ఇటీవలే తాను కూడా ఒక స్మార్ట్‌ఫోన్‌ను విడుదలచేస్తున్నట్లు ప్రకటించింది. జియోతో సమానంగా టారిఫ్‌లు కూడా ఇస్తున్నట్లు కస్టమర్లను రాబట్టే ప్రయత్నాలు చేస్తోంది. పేమెంట్ వ్యవస్థ బలంగా ఉన్న ఎయిర్‌టెల్‌కు డిజిటల్ లావాదేవీల్లో భారీ స్థాయిలో కస్టమర్లకు సెక్యూరిటీ పెంచేందుకు వీలుగా ఈ సైమాంటిక్‌తో ఒప్పందం చేసుకుంది.

సిగ్నిటీ బోర్డులోకి శ్రీనాధ్ బత్ని

హైదరాబాద్ ఆగస్టు 28: గ్లోబల్ ఐటి నిపుణులు శ్రీనాధ్ బత్నిని సిగ్నిటీ టెక్నాలజీస్ తన స్వతంత్ర డైరెక్టర్‌గా నియమించుకుంది. ఇన్ఫోసిస్‌లో డెలివరీ ఎక్స్‌లెన్స్ హెడ్‌గా హోల్ టైమ్ డైరెక్టర్‌గా 2000 నుంచి 2014వరకూ బత్ని సేవలందించారు సిగ్నిటీ సిఎండి సివి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డెలివరీ ఎక్స్‌లెన్స్‌లో శ్రీనాధ్ అనుభవంతో తమ ప్రాజెక్టులను మరింత సమర్థవంతంగా అందించేందుకు వీలవుతుందని తెలిపారు. ఇన్‌పుట్‌స, వ్యూహాత్మక నిర్దేశంతో ప్రపంచంలో అతిపెద్ద స్వతంత్ర సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ సర్వీస్ కంపెనీగా నిలవాలన్నదే తమ లక్ష్యంగా సుబ్రహ్మణ్యం వెల్లడించారు. యాక్సిలర్ వెంచర్స్‌లో సహవ్యవస్థాపకులుగా ఉన్న శ్రీనాధ్ బత్ని ఇన్ఫోసిస్‌లో వరల్డ్ కస్టమర్ డెలివరీలో గ్రూప్‌కో హెడ్‌గా సేవలందించారు. బెంగళూరు ఐఐఎస్‌సి నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎంఇ చేశారు.

శశికళ, దినకరన్‌పై బహిష్కరణ వేటు



చెన్నై, ఆగస్టు 28, ప్రభాతవార్త: తమిళనాడు రాష్ట్రంలో అధికార అన్నాడీఎంకే పార్టీ నుంచి చిన్నమ్మ శశికళ, ఆమె మేనల్లుడు దినకరన్‌ను బహిష్కరించారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో వీరిని బహిష్కరిస్తూ అధికారిక నిర్ణయం తీసుకున్నారు. శశికళ చేపట్టిన నియామకాలన్నీ చెల్లవని ఈ సందర్భంగా పార్టీ స్పష్టం చేసింది. అన్నా డీఎంకేకు చెందిన జయటీవీ, నమదు ఎంజీఆర్ పత్రికను పార్టీ నియంత్రణలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పార్టీ పేర్కొంది. ప్రస్తుతం నమదు ఎంజీఆర్ పత్రిక జయ పబ్లికేషన్ ఆధ్వర్యంలో నడుస్తోంది. దీనికి శశికళ యజమానిగా ఉన్నారు. జయ టీవీని మ్యాజిక్.కామ్ నిర్వహిస్తోంది. పార్టీ అధినేత్రి జయలలిత మరణం తర్వాత రెండు వర్గాలుగా చీలిపోయిన పార్టీ ఇటీవల తిరిగి కలిసిపోయిన విషయం తెలిసిందే. ఈ విలీనంపై దినకరన్ ఎదురుతిరిగారు. పార్టీ ఉపప్రధాన కార్యదర్శి హోదాలో ముఖ్యమంత్రి పళనిస్వామి సహా పలువురు అన్నాడీఎంకే నేతలను తమ పదవుల నుంచి తప్పిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో సమావేశమైన అన్నా డీఎంకే పార్టీ శశికళ, దినకరన్‌లను పార్టీ నుంచి బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్నాడీఎంకే ఎంపీ ముతుకరుప్పన్ సమావేశ నిర్ణయాలను వెల్లడించారు. శశికళ, దినకరన్‌ను పార్టీ నుంచి తొలగించడం, ఇకపై పార్టీ తరఫున దినకరన్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అది చెల్లదు, పార్టీ నియామక ప్రకారం దినకరన్ నియామకాలు జరగలేదు. అంతేగాక ఆయన నియామకాన్ని ఎన్నికల సంఘం కూడా ధృవీకరించలేదు, అని తెలిపారు. తమిళనాడు రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్న విషయం తెలిసిందే. మాజీ ముఖ్యమంత్రి అన్నాడీఎంకే అధినేత్రి జయలలిత మరణం తర్వాత ఆమె నెచ్చెలి శశికళ పార్టీ పగ్గాలు చేపట్టారు. పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి చేపట్టిన శశికళ ఆమె మేనల్లుడు దినకరన్‌కు ఉప ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. ఈ విషయంలో పార్టీ నేతల మధ్య భేదాభిప్రాయాలు రావడంతో పార్టీ రెండుగా చీలిపోయింది. అనేక నాటకీయ పరిణామాల అనంతరం ఇటీవలె రెండు వర్గాలు ఒక్కటయ్యాయి. శశికళ, దినకరన్‌లను పార్టీ నుంచి బహిష్కరించాలని అప్పుడే విలీనం సాధ్యమవుతుందని పన్నీర్ వర్గం డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

పన్నీర్ సమావేశానికి 40 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు

అన్నాడీఎంకే తిరుగుబాటు నేత దినకరన్‌కు చెక్ పెట్టేందుకు సోమవారం నాడు అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో పార్టీ నేతల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి పళనిస్వామి అధ్యక్షత వహించారు. 23 మంది ఎమ్మెల్యేలు తనవైపే ఉన్నారని దినకరన్ క్లెయిమ్ చేయడంతో ముఖ్యమంత్రి పళనిస్వామి పార్టీ ఎమ్మెల్యేలతో ఈ అత్యవసర సమావేశం జరిపారు. అయితే ఈ సమావేశానికి 40 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఇది పార్టీలో సంక్షోభం తప్పకపోవచ్చనే సంకేతాలిచ్చినట్లు చెబుతున్నారు. దినకరన్ మద్దతుదారులుగా చెబుతున్న 23 మంది ఎమ్మెల్యేలు ప్రస్తుతం పుదుచ్చేరిలోని విండ్‌ఫ్లవర్ రిసార్ట్‌లో ఉన్నారు. కాగా తమను పిలువలేదనందువల్లే వెళ్లలేదని, తాము దినకరన్ వెంటే ఉన్నామని ఎమ్మెల్యే తంగ తమిళ సెల్వన్ తెలిపారు. ఇప్పటికే పళని, పన్నీర్ వర్గంలో స్లీపర్ సెల్స్‌గా ఉన్న మరికొందరు కూడా త్వరలో తమతో కలవబో తున్నారంటూ ఆయన బాంబు పేల్చారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కిలోన్నర బంగారం స్వాధీనం



సోమవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న నగలు

శంషాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: కౌలాలంపూర్ నుంచి వచ్చిన ముగ్గురు వ్యక్తులు అక్రమంగా తీసుకువచ్చిన కిలోన్నర బంగారాన్ని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం కౌలాలంపూర్ నుంచి ముగ్గురు వ్యక్తులు వచ్చారు. వారిని తనిఖీచేయగా ఒక కిలో 505 గ్రాముల బంగారు గొలుసులు, కడియాలు లభించాయి. నాలుగుచైన్లు, ఆర కడియాలు వారి వద్ద స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు.

లాలూ ప్రసాద్ యాదవ్‌తో విహెచ్ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో ఎఐసిసి కార్యదర్శి, మాజీ ఎంపి వి.హనుమంతరావు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బీహార్‌లోని పాట్నాలో ఆర్‌జెడి నేత లాలు ప్రసాద్ యాదవ్ నేతృత్వంలో ప్రతిపక్ష పార్టీలను సంఘటితం చేస్తూ బిజెపికో హటావో దేశ్‌కో బచావో పేరిట నిర్వహించినర్యాలీలో సక్సెస్ కావడంతో విహెచ్ ఆయన్ను అభినందించారు. బీహార్‌లోని పాట్నాలో నిర్వహించినఈ భారీ ర్యాలీలో కాంగ్రెస్ నేత విహెచ్ పాల్గొన్నారు. ర్యాలీ విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విహెచ్ సోమవారం లాలు ప్రసాద్ యాదవ్‌ను కలిసి అభినందించారు. దేశంలోని లౌకిక శక్తులు ఐక్యమై బిసి,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వర్గాలను సంఘటితం చేసి మతతత్వ బిజెపికి వ్యతిరేకంగా ఉద్యమించాలని ఈ సందర్భంగా విహెచ్ కోరారు. బిజెపికి అడ్డుకట్ట వేయకపోతే దేశ భవిష్యత్తుకే ప్రమాదమని సూచించారు.

ఎఫ్‌డిలద్వారా వడ్డీపొందే వారిపై ఐటి నిఘా

మరో కోటి మందికి రిటర్న్స్ విస్తరించే ప్రయత్నాలు

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక మొత్తంలో వడ్డీ పొంది, పన్ను చెల్లించని వారిపై ఆదాయపు పన్ను శాఖ నిఘా పెట్టింది. ఏడాడికి 5 లక్షలకంటే ఎక్కువ వడ్డీ పొందుతూ పన్ను చెల్లించని సీనియర్ సిటిజన్లతోపాటు మిగతా వారిపై కూడా దృష్టి సారించాలని కేంద్ర ప్రత్యక్ష పన్నులో బోర్డుకు చెందిన సీనియర్ అధికారులు ఈ విషయం వెల్లడించారు. పన్ను వసూలు విస్తరించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ప్రొఫెషనల్స్ ఆదాయంపై దృష్టి కేంద్రీకరించింది. వీరిలో ఎక్కువ మంది తాము సంపాదించిన మొత్తాన్ని విలాసాలకు ఖర్చుచేసి ఖచ్చితమైన ఆదాయాన్ని బహిర్గతం చేయడం లేదు. వివిధ వనరులద్వారా పొందిన ఆదాయాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, వాటిని ఐటి రిటర్న్స్‌లో చూపడం లేదు. ఇలాంటి వైఖరిని గుర్తించి కేంద్రం చర్యలు ప్రారంభించిదని, అయితే కాలానుగుణంగా కొందరి ఆదాయంలో వ్యత్యాసాలు ఉంటాయని, వీరిని పట్టుకోవడం అంత సులభం కాదనేది వాస్తవం. ఉదాహరణకు వైద్యులు వ్యవహారాన్ని పరిశీలిస్తే.. సీజనల్ వ్యాధులు అంటే డెంగ్యూ, చికున్‌గున్యా అధికంగా ఉండే సమయంలో వీరికి ఎక్కువ ఆదాయం లభిస్తుంది. అయితే డిపాజిట్లపై వడ్డీ ద్వారా పొందే ఆదాయం మరింత ఎక్కువగా ఉంటుంది. ఎఫ్‌డీలపై చెల్లించే వడ్డీకి టిడిఎస్‌ను తగ్గించి మిగతా మొత్తాన్ని బ్యాంకులు చెల్లిస్తాయి. అయితే కేవలం 10 శాతం మంది మాత్రమే పన్ను చెల్లించి, 30 శాతం మంది ఎగవేస్తున్నారు. అందుకే ప్రభుత్వం దృష్టి అంతా ఎక్కువ ఆదాయం పొందిన పెద్ద వారిపైన మాత్రమేనని, అల్పాదాయ వర్గాలవారు టార్గెట్ కాదనే విషయం తెలిసిపోతుంది. ఐటి రిటర్న్స్‌ను మరో కోటి మందికి విస్తరించేందుకు ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. ఇదిలా ఉంటే నల్లధనంపై నియంత్రణ చర్యల్లో భాగంగా గత సంవత్సం నవంబరులో 1000, 500 రూపాయల నోట్లను రద్దు చేసింది. నోట్ల రద్దుచేసి ఎనిమిది నెలలు పూర్తయినా వెనక్కి చేరిన నోట్ల వివరాల గురించి ఆర్‌బిఐ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. దీనిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని ప్రజలు భావిస్తున్నారు. రద్దు చేసిన వెయ్యి నోట్లలో కనీసం 99 శాతం బ్యాంకులద్వారా వెనక్కి వచ్చినట్లు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా తన వెబ్‌సైట్‌లో వెల్లడించింది. 2017 మార్చి నాటికి 8,925 కోట్ల విలువైన 1000 నోట్లు చెలామణిలో ఉన్నట్లు ఈ వివరాల్లో పొందుపరిచింది. ఆర్‌బిఐ చట్టం ప్రకారం చలామణిలో ఉన్న మొత్తం 1000 నోట్ల రద్దు తరువాత పూర్తిగా వెనక్కి రాలేదు. నవంబరు 8 నాటికి 6,858 మిలియన్ వెయ్యి రూపాయలు చలమణిలో ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి సంతోశ్‌కుమార్ గంగ్వార్ ఈ మేరకు లోక్‌సభలో ప్రకటించారు. అంటే వీటి విలువ 6.86 లక్షల కోట్లు. ఆర్‌బిఐ అంచనా ప్రకారం 98.7 శాతం బ్యాంకులకు చేరినట్లు, ప్రస్తుతం 1.3 శాతం ఇంకా ప్రజల వద్దనే ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై పూర్తి వివరాలకోసం ఆర్‌బిఐ సరిగా స్పందించ లేదు. ఇదే విషయంలో 500 నోట్ల విషయంలో అంచనా మరోలా ఉంది. ఎందుకంటే మార్చి 31 నాటికి కొత్త 500 నోట్లు పూర్తిగా మార్కెట్‌లోకి వచ్చాయి. 99 శాతం వెయ్యి నోట్లు వెనక్కి వచ్చినట్లయితే 500 నోట్ల విషయంలో దీనికి భిన్నంగా ఉంటుందని ప్రశ్న ఏర్పడుతుంది.

సిబిఐ విచారణకు హాజరైన కార్తీ చిదంబరం

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం సోమవారంసిబిఐ విచారణకు హాజరయ్యారు. 2007లో ఐఎన్ఎక్స్ మీడియాకు ఎఫ్ఐపిబి క్లియరెన్స్ కోసం ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలపై సిబిఐ కార్తీపై కేసు నమోదు చేసింది. కార్తీతో పాటు రవి విశ్వనాథన్, మోహన్ రాజేష్, భాస్కర్ రామన్, సివిఎస్‌రెడ్డిలను కూడా సిబిఐ ప్రశ్నించనుంది. విశ్వనాథన్, రాజేష్, రామన్‌లను ఢిల్లీలో విచారిస్తారు. ఇక సివిఎస్ రెడ్డిని మాత్రం సిబిఐ చెన్నై కార్యాలయంలో విచారణ చేపడతారు. మే 15న సిబిఐ అధికారులు కార్తీపై క్రిమినల్ కుట్ర, మోసం, అవినీతి కేసులను కార్తీపై నమోదు చేసింది. షీనా బోరా హత్య కేసులో నిందితుడు పీటర్, ఇంద్రాణి ముఖర్జీల నడుమ ఎఫ్ఐబి క్లియరెన్స్ పొందడంతో సహాయపడినట్లు, కార్తీకి ముంబైకి చెందిన ఐఎన్ఎక్ మీడియా ప్రస్తుతం ఎన్ఎక్స్ మీడియా నుంచి 3.5 కోట్లు అందాయి. వివిధ నేరారోపణలపై సోమవారం కార్తీని రెండవ సారి సిబిఐ ప్రశ్నించింది. ఉదయం 10 గంటలకు లోథా రోడ్‌లోని సిబిఐ విచారణకు హాజరయ్యారు. కాగా ఈనెల 23న సిబిఐ అధికారులు ఎనిమిది గంటల పాటు ప్రశ్నించారు. సిబిఐ విచారణను ఆయన తన న్యాయవాదుల సమక్షంలో ఎదుర్కొన్నారు. ఆగస్టు 18న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కార్తీని సిబిఐ విచారించింది. ఫారిన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు(ఎఫ్ఐపిబి) క్లియరెన్స్ ఐఎన్ఎక్స్‌కు కేటాయించేలా సహకరించినందుకు కార్తీకి నిధులు ముట్టినట్లు కేసు నమోదైంది.

తెలంగాణలో ముగిసిన మెడికల్ సీట్ల భర్తీ

తీవ్ర జాప్యంపై అభ్యర్థుల మండిపాటు

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో మెడికల్ సీట్ల భర్తీ ప్రక్రియ పూర్తయింది. ఏ కేటగిరి కన్వీనర్ కోటాలో మూడు దశల్లో కౌన్సిలింగ్ నిర్వహించారు. చివరి దశ కౌన్సిలింగ్ ఆదివారం నిర్వహించి ఈ సీట్లను కేటాయించారు. మూడు దశలో కన్వీనర్ కోటా కింద సీట్ల పొందిన విద్యార్థులు మూడు రోజుల్లో మెడికల్ కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. ఇక బి కేటగిరిలో మేనేజ్‌మెంట్ సీట్లు, సీ కేటగిరీలో ఎన్ఆర్ఐ స్టీలను కూడా ఆన్‌లైన్ కౌన్సిలింగ్ నిర్వహించారు. తెలంగాణలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మొత్తం 2100 ఎంబిబిఎస్, బిడిఎస్ సీట్లు ఉండగా.. వీటిలో 1700 కన్వీనర్ కోటా (ఎ కేటగిరి)లో భర్తీ చేశారు. మిగిలిన సీట్లు మేనేజ్‌మెంట్..ఎన్ఆర్ఐ కోటాలో భర్తీ చేస్తున్నారు. రెండు మెడికల్ కాలేజీల్లో సీట్ల భర్తీని నిలుపుదల చేసిన మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) నిర్ణయానిన సడలిస్తుందనే ఆశలో ఆయా కాలేజీల యాజమన్యాలు ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. అయితే మూడు విడతల్లో కేటాయించిన మెడికల్, డెంటల్ సీట్లలో అనివార్య కారణాలవలన అభ్యర్థులెవరైనా జాయిన్ కాకపోతే..ఆయా సీట్లకు స్పాట్ అడ్మిషన్‌ను నిర్వహించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ మెడికల్ సీట్ల భర్తీలో వరంగల్‌లోని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధికారులు తీవ్ర జాప్యం ప్రదర్శించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ సీట్ల కేటాయింపు.. భర్తీ వేగంగా పూర్తయితే.. తెలంగాణలోమాత్రం అధికారులు నిర్లక్ష్యవైఖరివల్ల నత్తనడకన సాగడంపట్ల మెడికల్ సీట్లు పొందిన అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

పలు ప్రత్యేక రైళ్ల ఏర్పాటు

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే పలు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సూపర్ ఫాస్ట్ స్పెషల్ ట్రైన్‌లో స్పెషల్ ఫేర్‌తో నిర్వహిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. వాటి వివరాలను సోమవారం విడుదల చేశారు.

కెఎస్ఆర్ బెంగుళూరు - హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

02523 నంబరు గల సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 29న మంగళవారం కెఎస్ఆర్ బెంగుళూరులో 3.10 గంటలకు బయలుదేరి తర్వాత రోజు బుధవారం 13.55 గంటలకు హౌరా చేరుకుంటుంది. ఎసీ టు టైర్, ఎసీ త్రీ టైర్, స్లీపర్ క్లాస్, సెకండ్ క్లాస్ కోచ్‌లతో బెంగుళూరు కంట్, కృష్ణార్జునపురం, బంగారుపేట, జోలార్‌పేయ్, కట్‌పాడి, పేరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం, విజయనగరం, బ్రహ్మపూర్, కుర్థా రోడ్, భువనేశ్వర్, కుట్టాక్, బాలసోరి, ఖరగ్‌పూర్ స్టేషన్లమీదుగా బయలుదేరుతుంది.

హౌరా - యశ్వంత్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

02524 నంబరు గల సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 31న గురువారం హౌరాలో 10 గంటలకు బయలుదేరి తర్వాత రోజు శుక్రవారం 18.25 గంటలకు యశ్వంత్‌పూర్‌కు చేరుకుంటుంది. ఎసీ టు టైర్, ఎసీ త్రీ టైర్, స్లీపర్ క్లాస్, సెకండ్ క్లాస్ కోచ్‌లతో ఖరగ్‌పూర్, హిజిలి, బాలసోరి, కుట్టక్, భువనేశ్వర్, కుర్థా రోడ్, బ్రహ్మపూర్, విజయనగరం, సామర్లకోట, విజయవాడ, గూడూరు, చెన్నయ్ సెంట్రల్, కట్‌పాడి, జోలార్‌పేటయ్ స్టేషన్ల మీదుగా వెళుతుంది.

బెంగుళూరు కంట్ - మల్దా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

02525 నంబరు గల సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 30న బుధవారం బెంగుళూరు కంట్‌లో 23.40 గంటలకు బయలుదేరి రెండవ రోజు శుక్రవారం 17.15 గంటలకు మల్దా చేరుకుంటుంది. ఎసీ టు టైర్, ఎసీ త్రీ టైర్, స్లీపర్ క్లాస్, సెకండ్ క్లాస్ కోచ్‌లతో కృష్ణార్జునపురం, బంగారుపేట, జోలార్‌పేయ్, కట్‌పాడి, అరక్కోణం, చెన్నయ్ సెంట్రల్, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, బాలుగన్, కుర్థా రోడ్, భువనేశ్వర్, కుట్టాక్, జైపూర్ కె రోడ్, భద్రఖ్, బాలసోరి, ఖరగ్‌పూర్, సంత్రగచ్చి, హౌరా జంక్షన్, బబోల్‌పూర్, రాంపూర్, న్యూ ఫరక్కా స్టేషన్ల మీదుగా వెళుతుంది.

ఉప ఎన్నికల్లో అధికార పార్టీలదే హవా

నంద్యాలలో బిజెపి మద్దతు ఇవ్వకున్నా టిడిపిదే గెలుపు

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి: దేశ వ్యాప్తంగా ఈ మధ్య ఎప్పుడు ఉప ఎన్నికలు జరిగినా ప్రతి సందర్భంలోనూ ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలే విజయం సాదిస్తున్నాయి. దేశంలో ఇప్పటివరకు జరిగిన ఉప ఎన్నికల్లో 80 నుంచి 85శాతం స్థానాలను ఆయా రాష్ట్రాల్లోని అధికారపార్టీలే గెలుపొందాయి. 1980 నుంచే ఉప ఎన్నికల్లో అధికారపార్టీల హవానే కొనసాగుతోంది. ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలకు అనుకూలంగా ఉండే అధికార యంత్రాంగం, ఇతర వ్యవస్థలు, అభివృద్ధి నినాదాలు ప్రధానంగా కలిసొస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పడిన కొద్దికాలానికి రాజీనామాలతో ఖాళీ అవుతున్న స్థానాలకు ఎన్నికలు జరిగినప్పుడు ఆ గాలి అలాగే కొనసాగడం లేదా ప్రభుత్వాలు ఏర్పడిన కొంతకాలం తర్వాత ఎవరైనా సభ్యులు మరణించడంతో ఖాళీ అవుతున్న స్థానాల్లో ఉప ఎన్నికలు జరిగినప్పుడు ఆ సానుభూతి పవనాలు పనిచేయడం కూడా సర్వసాధారణంగా కనబడుతున్న పరిణామాలు ప్రస్తుతం నంద్యాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న భూమా నాగిరెడ్డి అకాల మరణంతో నంద్యాల ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నంద్యాల ఉప ఎన్నికలో కూడా అధికార టిడిపియే గెలిచింది. నంద్యాల టిడిపి గెలుపుకోసం మి త్రపక్షమైన బిజెపి ఎంత మాత్రం సహకరించలేదు. పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన కూడా ఎవరికీ మద్దతు ఇవ్వనంటూ దూరం జరిగిపోయింది. టిడిపి అధినేత, ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యూహామే టిడిపి అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిచేలా చేసింది. అంతెందుకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన పలు ఉప ఎన్నికల్లోనూ అన్ని సీట్లను అధికార టిఆర్ఎస్ పార్టీయే కైవసం చేసుకుంది, ఈ గెలుపుల్లో టిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు వ్యూహం బాగా పనిచేసింది. ప్రస్తుతందేశవ్యాప్తంగా మూడు రాష్ట్రాల్లోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, గోవాలోని వాల్పోయి, పనాజీ,ఢిల్లీలోని బావన(ఎస్సీ) నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగ్గా, అన్నింటిలోనూ అధికార పార్టీయే విజయం సాధించింది. నంద్యాలలో టిడిపి,గోవాలో బిజెపీలు గెలుచుకోగా, ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) విజయం సాధించింది. ఇదే అగస్టు నెలలోనే పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జరిగిన ఏడు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ అన్నింటినీ కైవసం చేసుకుంది. ఈ కార్పొరేషన్లలో మొత్తం 148 వార్డులకుగానూ మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ 140 వార్డులను గెలుచుకుంది. 2016 నవంబరులో అసోం, అరుణాచల్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్,త్రిపుర,మధ్యప్రదేశ్, తమిళనాడులతో పాలు పుదుచ్చేరి రాష్ట్రాల్లో మొత్తం నాలుగు లోక్‌సభ, 10 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా, దాదాపు అన్ని స్థానాలు ఆయా రాష్ట్రాల్లో అధికార పార్టీలే కైవసం చేసుకున్నాయి. మధ్యప్రదేశ్‌లో అధికారంలో ఉన్న బిజెపి అక్కడి నేపానగర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపొందింది. అసోంలో బిజెపి అధికారం చేపట్టిన తర్వాత ఆ రాష్ట్రంలో బైథలాంగ్సో అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించగా బిజెపి గెలుచుకుంది. అలాగే, అరుణాచల్ ప్రదేశ్ హాయులియాంగ్ స్థానాన్ని బిజెపి తిరిగి గెలుచుకుంది. అలాగే పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో రెండు లోక్‌సభ స్థానాలకు, ఒక అసెంబ్లీ నియోజవర్గానికి ఉప ఎన్నిక జరగ్గా, ఆ మూడు స్థానాలకు తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. దీంతో పాటు మాంటేశ్వర్ అసెంబ్లీ స్థానాన్ని కూడా టిఎంసీ కైవసం చేసుకుంది. తమిళనాడులో ఉప ఎన్నికలు జరిగిన మూడు(తిరుపరంకుండ్రమ్, అరవకురిచి.,తంజావూర్) అసెంబ్లీ స్థానాలకు జయలలిత నేతృత్వంలోని ఏఐఏడిఎంకె తిరిగి విజయం సాధించింది. 1980 నుంచి 2012 మధ్య కాలంలో 44 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా, కేవలం 8 చోట్ల మాత్రమే విపక్షం గెలుచుకోగా, మిగిలిన అన్ని చోట్లా అధికార పార్టీలే విజయం సాధించాయి. పుదుచ్చేరిలో నెల్లితోప్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ నేత వి.,నారాయణస్వామి గెలుచుకున్నారు. త్రిపుర రాష్ట్రంలో సిపిఎం అధికారంలో ఉండగా,ఆ రాష్ట్రంలో రెండు అసెంబ్లీ స్థానాలకు(బర్జాలా,కోవాయ్ అసెంబ్లీ నియోజక వర్గాలు) ఎన్నికలు జరగ్గా రెండింటిలోనూ సిపిఎం అభ్యర్థులు విజయం సాధించారు. 2015లో మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ, త్రిపుర,మేఘాలయ రాష్ట్రాల్లో జరిగిన మొత్తం ఆరు స్థానాలకు జరిగిఇన ఉప ఎన్నికల్లోనూ ఈ విధంగానే అధికార పార్టీలు గెలుపొందాయి. ఏపిలో ఇప్పుడు నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలతో టిడిపికి మరింత ధీమా పెరిగింది. బిజెపితో దోస్తితో పనిలేకుండా పోయింది. గడిచిన 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటిచేసిన టిడిపి,బిజెపి నంద్యాల ఉప ఎన్నికలో ఆ సఖ్యతను ప్రదర్శించలేదు. బిజెపి మొండి చెయ్యి చూపినా, జనసేన తటస్థ వైఖరి ప్రదర్శించినా టిడిపి ఏమాత్రం భయ పడలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ ప్రచార హోరును సైలెంట్‌గానే ఎదుర్కొంది.

చిక్కులకు చెక్

- పాలసీలపట్ల ఐఎఎస్‌ల అప్రమత్తం
- క్షుణ్ణంగా ఫైళ్ల పరిశీలన
- ఆచితూచి వ్యవహరిస్తున్న సీనియర్లు

హైదరాబాద్, అగస్టు 28, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ పరిపాలనలో కీలకమైన ఐఎఎస్ అధికార్లు ప్రభుత్వ పాలసీల పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ పాలసీలపై మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాల పట్ల సైతం ఆచితూచి వ్యవహరిస్తున్నారు. మంత్రివర్గ నిర్ణయాలతోపాటు, సాధారణ విషయాల్లో కూడా ఐఎఎస్‌లు జాగ్రత్త పడుతున్నారు. ఎప్పుడు ఏ చిక్కుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందోనన్న ఆందోళనలతో ఉండాల్సి వస్తోందని సీనియర్ ఐఎఎస్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ప్రతీ అంశంలోనూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. వివిధ ప్రభుత్వ పనులు, కార్యక్రమాల విషయంలో గతంలో వలె కాకుండా ముందు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. భవిష్యత్‌లో ఎదురయ్యే సమస్యలు, చిక్కులను గూర్చి కూలంకుషంగా పరిశీలించిన మీదటే వాటిపై ఒక నిర్ణయం తీసుకుంటున్నారు. అన్నీ సవ్యంగా ఉంటేనే ప్రభుత్వ పాలసీలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో పరిశీలించి భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులూ రావని ధృవీకరించుకున్న అనంతరమే వాటికి అనుమతులను మంజూరు చేస్తున్నారు. భవిష్యత్‌లో ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రతీ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించితేనే కాని ఐఎఎస్ అధికారులు ఏ నిర్ణయాన్ని తీసుకోవడం లేదు. పలు ప్రతిపాదనలపై అన్ని రకాలుగాను వత్తిళ్ల వస్తున్నా కొందరు సీనియర్ అధికారులు వాటిని ఖాతరు చేయకుండా అన్నీ సవ్యంగా ఉంటేనే కాని ముందుకు వెళ్లడం లేదు. ప్రభుత్వ పాలసీలకు సంబంధించిన ప్రతీ ఫైలునూ పూర్తిగా అధ్యయనం చేసిన అనంతరం వాటిపై సంతకాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే అధికారపార్టీకి చెందిన ఒక ఎంపికి సంబంధించి ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని పెంచి రూపొందించిన ఫైలును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సైతం తిప్పిపంపినట్లు తెలిసింది. ఒక ఎంపీ, మంత్రి తదితర కాంట్రాక్టర్లకు పనుల అంచనా వ్యయాన్ని అడ్డగోలుగా పెంచి అరువేల కోట్ల రూపాయలను దోచిపెట్టేడానికి ప్రయత్నించగా ప్రభుత్వ అధికారులు దానికి అడ్డుతగిలారు. ఆర్థిక శాఖ ఆమోదం లేకుండానే అంచనా వ్యయాలు పెంచిన ఈ ఆరు వేల కోట్ల రూపాయలలో సగానికి పైగా డబ్బును చెల్లించినట్లు కూడా సమాచారం. అయితే తమ అనుమతి లేకుండా కాంట్రాక్టర్లకు అక్రమంగా చెల్లించిన సొమ్ము విషయమై ఆర్థిక శాఖకు చెందిన సీనియర్ అధికారులు సీరియస్ అయినట్లు వెల్లడైంది. కాంట్రాక్టర్లు, అధికార పార్టీ నేతల కొందరు కలిసి ఈ ఆరువేల కోట్ల రూపాయలను దోచుకోవడానికి వేసిన పథకానికి అడ్డు చెప్పారు. దాంతో దొడ్డిదారిన ఈ ఆరువేల కోట్ల రూపాయల ఫైల్‌ను ఒకే చేయించుకునేందుకు క్యాబినెట్‌లో నోట్ పెట్టి మంత్రివర్గం చేత ఆమోద ముద్ర పొందేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలియవచ్చింది. అయితే ఇది హద్దులు లేని అవినీతి కావడం వల్ల భవిష్యత్‌లో ఈ నోట్‌పై సంతకాలు చేసిన ప్రభుత్వ అధికారులు ఇరుక్కునే అవకాశం ఉండడం వల్ల ఆర్థిక శాఖ అధికారులు ఈ నోట్‌ను ఒకే చేయడానికి ఏమాత్రం అంగీకరించడం లేదని తెలిసింది. చివరకు రాజకీయ నేతలు, మంత్రుల నుండి వచ్చే వత్తిళ్లను కూడా లెక్క చేయకుండా నిబంధనల ప్రకారం అన్నీ సవ్యంగా ఉన్నాయని నిర్థారించుకున్నాకే ప్రభుత్వ పాలసీలపై సంతకాలు చేస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పాలసీల విషయంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా చూసుకుంటున్నారు. అవసరమైతే పాలసీలకు సంబంధించిన ఫైళ్లను సలహాల కోసం న్యాయ శాఖకు అభిప్రాయాలకోసం పంపుతున్నారు. వారి అభిప్రాయాలు, సూచలను పరిగణలోకి తీసుకున్న అనంతరమే వాటి మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు. దీంతోపాటు ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు పంపి వారి నుండి కూడా అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఆర్థిక, న్యాయ శాఖల నుండి వచ్చిన అభిప్రాయాలు, సలహాలకు అనుగుణంగా ప్రతిపాదనల్లో మార్పులు, చేర్పులూ చేసిన తరువాతనే వాటికి ఆమోదం తెలుపుతున్నారు. జీవోలు ఇచ్చే విషయమై అందులోని ప్రతీ పదంపైనా విశ్లేషిస్తూ భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు.

శ్యాంసంగ్ లాటరీ పేరిట హైదరాబాద్ డాక్టర్‌కు రూ.21.95 లక్షల టోకరా

సైబరాబాద్ పోలీసులకు చిక్కిన నైజీరియన్ ముఠా



నిందితులు ఆర్టిస్టైడ్, ఓమెకి, ఓక్వెరేకు టౌచుక్వు, ఆనంద్ నాగేసియా

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: నాలుగున్నర కోట్ల రూపాయల శ్యాంసంగ్ లాటరీ వచ్చిందని నమ్మించి హైదరాబాద్‌కు చెందిన ఓ వైద్యుడిని 21 లక్షల 95 వేల రూపాయలను ముంచిన నైజీరియన్ ముఠా ఉదంతం ఇది. ఈ కేసులో అత్యాశకు పోయి నిండా మునిగిన వైద్యుడి ఫిర్యాదుపై స్పందించిన సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు ముగ్గురు నైజీరియన్లతో సహా వారికి సహకరించిన ఓ పశ్చిమ బెంగాల్ వాసిని కూడా కటకటాల్లో నెట్టారు. సైబరాబాద్ సిసిఎస్ ఓఎస్‌డి జానకీ శర్మిలా దీనికి సంబంధించిన వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు. సైబరాబాద్ పరిధిలో నివసించే ఓ వైద్యుడికి 2016 ఆగస్టు నెలలో గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి తాను రిజర్వ్ బ్యాంక్ అధికారినని, తన పేరు ఆషిష్ పటేల్ అని చెబుతూ మీకు నాలుగున్నర కోట్ల రూపాయల శ్యాంసంగ్‌లాటరీ వచ్చిందని నమ్మించాడు. ఇతని మాటలను నమ్మిన సదరు వైద్యుడు తనకు లాటరీ డబ్బులుకావాలంటే ఏం చేయాలని అడిగాడు. దీని తరువాత ఇదే అదనుగా సదరు మోసగాడు మొదట తనకు రెండు లక్షల 60 వేల రూపాయలు బ్యాంకు ఖాతాలో వేయాలని సూచించాడు. ఇతని మాటలను నమ్మిన వైద్యుడు రెండు లక్షల 60 వేల రూపాయలను బ్యాంకు ఖాతాలో జమాచేశాడు. అనంతరం రెండు నెలల వ్యవధిలో మొత్తం 21 లక్షల 95 వేల రూపాయలను ఆ మోసగాడు వైద్యుడి నుంచి వసూలు చేశాడు. ఈ డబ్బుల ను బాధితుడు ఢిల్లీ కేంద్రంగా పనిచేసే పలు బ్యాంకు ఖాతాల్లో జమా చేశాడు. ఇంత మొత్తం వసూలు చేసినా లాటరీ డబ్బుల విషయం తేల్చక పోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు దీనిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు మొదటగా బ్యాంకు ఖాతాల విషయాన్ని తేల్చేందుకు ఢిల్లీకి ఒక ప్రత్యేక బృందాన్ని పంపారు. అక్కడికి వెళ్లిన పోలీసులకు నమ్మలేని నిజాలు తెలిసాయి. ఈ గోల్‌మాల్ వ్యవహారానికి పాల్పడింది నైజీరియన్ ముఠాగా తేలింది. ఈ ముఠాకు నాయకుడు నైజీరియాకు చెందిన గౌజ ఆరిస్టైడ్‌గా తేలింది. ఇతని ఆదేశాల మేరకు పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆనంద్ సగేషియా అనే మరో వ్యక్తి రంగంలో దిగి ఈ తరహా మోసాలు చేస్తున్నట్లు తేలింది. లాటరీల పేరిట అనేక మందికి ఫోన్ చేయగా ఇందులో హైదరాబాద్‌కు చెందిన వైద్యుడు బుట్టలో పడ్డాడు. ఇతని నుంచి డబ్బులు వసూలు చేసేందుకు కావాల్సిన బ్యాంకు ఖాతాలను నైజీరియాకు చెందిన ఓమెకె ఎరిక్ టౌచుక్వు, ఓక్వెరుకు టౌచుక్వులు సహకరించారు. ఇలా నలుగురు మోసగాళ్లు కలిసి హైదరాబాద్‌కు చెందిన వైద్యుడిని లాటరీ పేరిట 21 లక్షల 95 వేల రూపాయలను ముంచారు. ఈ కేసులో నలుగురు మోసగాళ్లను ఢిల్లీలో అరెస్టు చేసిన సైబర్ క్రైం పోలీసులు సోమవారం స్థానిక కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించారు. ఇందులో ముగ్గురు నైజీరియన్ల నుంచి పాస్‌పోర్టులను సెల్‌ఫోన్లను, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణ ఎసిపి జయరాం నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ రవీందర్ రెడ్డి ఇతర బృందం దర్యాప్తు చేసింది. ఈ తరహా మోసాలపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ సిపి కోరారు.

నంద్యాల తీర్పు చారిత్రాత్మకం

అభివృద్ధికి ప్రజలు మద్దతు పలికారు -ప్రతిపక్షం అభ్యర్థిని పెట్టి అభాసుపాలైంది..
జగన్ చేసిన విమర్శలు శ్రుతి మించాయి - డేరా బాబాలాగా జగన్ బాబా తయారయ్యాడు
ఎన్నికల కమిషన్ పక్షపాత ధోరణి చూపొద్దు: సిఎం చంద్రబాబు

విజయవాడ, ఆగస్టు28 ప్రభాతవార్త: గత కొంత కాలంగా ఆంధ్రప్రదేశలో ఎంతో ఉత్కంఠంగా కొనసాగిన నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందింది. ఈ సందర్భంగా వెలగపూడి సచివాలయంలోని టిడిపి అధినేత, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ఎన్నో కష్టాలు పడుతున్నామని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలకు ప్రజలు మద్దతు తెలుపుతున్నారన్నారు. సంక్షేమం, సుపరిపాలన, అభివృద్ధి టీడిపి సిద్ధాంతం అన్నారు. బ్రహ్మానందరెడ్డి యువకుడు, ప్రజలు అతనికి మద్దతు పలికారు. వైఎస్సార్ శోభానాగిరెడ్డి చనిపోతే పోలింగ్ పెట్టలేదని, నంద్యాలలో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారన్నారు. ఒక నియోజకవర్గం కోసం చాలా సమయం వెచ్చించాల్సి వచ్చిందని, ఫలితం చాలా అద్భుతంగా ఉందన్నారు. విశ్వసనీయత అనేది అవకాశవాద రాజకీయాలతో రాదన్నారు. నంద్యాల ఉపఎన్నికలో అభ్యర్థిని పెట్టి ప్రతిపక్షం అభాసుపాలు అయ్యిందన్నారు. ఎన్నికల ప్రచారంలో జగన్ హద్దులుదాటి ప్రవర్తించారన్నారు. ఒక సీఎంస్థానంలోఉన్న నన్నే కాల్చి చంపాలని, ఉరి తీయాలంటూ వ్యాఖ్యలు చేశారని, అధికారపార్టీపై జగన్ చేసిన విమర్శలు శృతి మించాయన్నారు. ఎన్నికలు నాకు ఎప్పుడు కొత్తకదని, నా విశ్వాసం ఎప్పుడూ వమ్ముకాదన్నారు. ఉపఎన్నిక ఫలితంతో ప్రజలు ఏమనుకుంటున్నారో స్పష్టమైందన్నారు. మొదటి నుంచి కష్టపడే తత్వమే మమ్మల్ని గెలిచేలా చేసిందన్నారు. తనకు ఎన్ని కలు కొత్తకాదని, 40ఏళ్లుగా రాజకీయాలను చూస్తున్నా, జాతీయ రాజకీయాల్లోనూ కీలకపాత్ర పోషించా, కానీ, ఇలాంటి దారుణమైన రాజకీయాలు నేనెప్పుడూ చూడలేదన్నారు. తెలంగాణాలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌తో కాంగ్రెస్ కుమ్మక్కైందన్నారు. కట్టుబట్టలతో హైదరాబాద్ నుంచి అమరావతికి వచ్చాం, రాష్ట్రాన్ని మొదటి స్థానానికి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పట్టిసీమను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మించామని, రాయలసీమలో పంటలు నష్టపోయినవారికి పెట్టుబడి రాయితీ రెట్టింపుచేసే ఇచ్చామన్నారు. తెదేపాను నమ్ముకున్నవారికి న్యాయం చేసేలా పనిచేస్తున్నామని,



సోమవారం నంద్యాల ఉప ఎన్నికల్లో టిడిపి విజయం సాధించిన సందర్భంగా మంత్రి లోకేష్‌కు స్వీటు తినిపిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

ఎన్నో ప్రాజెక్టులు వచ్చినా, రాలేదన్నట్టుగా జగన్ మాట్లాడారన్నారు. అభివృద్ధి చేసే పార్టీలను ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తాన్నారు. ప్రతిపక్షనేత ఓ ఉప ఎన్నికలో ఇన్ని రోజులు ప్రచారం చేయడం ఎక్కడా చూడలేదన్నారు. డేరా బాబాలాగా మనకు జగన్ బాబా తయారయ్యారన్నారు. సాధు వులా ఉండి మిలిటెన్స్ తయారు చేశారన్నారు, కుట్ర రాజకీయాలు ఎప్పటికీ మంచివికావని, అందుకే డేరాబాబాతో జగన్‌ని పోలుస్తున్నామని చెప్పారు. ఎంత నమ్మకం కోల్పోయిన అనూహ్యంగా గోస్పాడులోనూ మాకు మెజార్జీ వచ్చిందన్నారు. ప్రతిపక్షనేత ఎలక్షన్స్ పై అంత ఉత్సాహం ఉంటే తన ఎంపీలతో రాజీనామా చేయించాలని, జగన్‌కు ఎన్నికలంటే మంచి సరదాగా ఉన్నాయని, అందుకే ఎలక్షన్స్ అంటూ అంటున్నారన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో భారీ మోజార్టీతో గెలుపుపొందిన టీడిపికి ప్రధాని మోడి ట్విట్టర్‌లో అభినందనలు తెలిపారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యమని ధీమావ్యక్తం చేశారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం తమదేనని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ రిఫరీగా ఉండాలని, చెక్స్ అండ్ బ్యాలెన్స్ చూసుకోవాలని, పక్షపాత ధోరణి చూపొద్దన్నారు. ఇద్దరినీ సమానంగా చూడకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఈసి ఉత్తర్వులపై అధ్యయనం చేసి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చంద్రబాబు చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పి. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూసర్వేపై అఖిలపక్షం నిర్వహించాలి

ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలి - 90 శాతం మందికి కెసిఆర్ సీట్లు ఇవ్వరు: షబ్బీర్‌అలీ
డిజిటల్ సర్వే కోసం కేంద్రం ఇచ్చిన రూ.256 కోట్లు ఏమయ్యాయి: పొంగులేటి

హైదరాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: ప్రజలకు ఉపయోగపడే భూసర్వేపై అఃలపక్ష సమావేశం నిర్వహించాలని, అసరమైతే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చించాలని శాసన మండలి ప్రతిపక్షనేత షబ్బీర్‌అలీ డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ ప్రెస్‌హాల్లో ఆయన ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కెసిఆర్ సర్వేలపై ప్రజలకు నమ్మకం పోయిందని, గతంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ముందు బయట పెట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మొదట హడావిడి చేయడం తరువాత మూలన పడేయడం కెసిఆర్‌కు అలవాటైందని విమర్శించారు. భూసర్వేపై టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో మాత్రమే సమావేశం కావడం ఆపార్టీకి చెందిన ఎమ్మెల్యే, ఎంపిలతో కమిటీలు వేయడాన్ని ఆక్షేపించారు. అన్ని రాజకీయ పక్షాలను, అన్ని వర్గాలను కలుపుకు పోవాల్సి న అవసరం ఉందన్నారు. ఏ రాజకీయ పక్షాలతో చర్చించకుండా ఎలాంటి యంత్రాంగం లేకుండానే సెప్టెంబరు 10 వరకు పూర్తి చేయాలని హడావిడి చేయడం తగదన్నారు. గతంలో కాంగ్రెస్‌పార్టీ హయాంలో విజయ బాస్కర్‌రెడ్డి సిఎంగా ఉన్న కాలంలో పట్టాదారు పాసుపుస్తకాలను అందించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ల్యాండ్ సర్వేలో ఎన్నో లోపాలు గత కొన్నేళ్లుగా కొనసాగుతున్నాయని, ఏడాది కోసారి రెవిన్యూ సదస్సులు పెట్టి కాంగ్రెస్ పార్టీ పదేళ్లలో 4లక్షల మందికి మాత్రమే పాస్‌బుక్‌లు ఇవ్వగలిగిందన్నారు. డ్రగ్స్ కేసు హడావిడి ఫలితం శూన్యం, నయీం కేసు అంతే, మియాపూర్ భూకుంభకోణంలో సాధించిన ఫలితం లేదు ఇలా సిఎం చేపట్టిన ఏ ఒక్క కార్యక్రమం సక్సెస్ కాలేదని గుర్తు చేశారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో తొందరపాటు చర్యలు వద్దని సూచించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ సొంత పార్ట ఎమె ్మల్యేలు గోడదూకుతారనే కెసిఆర్ సిట్టింగ్‌లకు సీట్లు ఇస్తామంటూ మైండ్‌గేమ్ ఆడుతూ మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. సిట్టింగ్‌లో 90శాతం మందికి కెసిఆర్ సీట్లు ఇవ్వరని అన్నారు. మంత్రి వర్గంలో ఉన్నది అసలు టిఆర్‌ఎస్ పార్టీ కాదని, ఉన్న వాళ్లలో 8మంది డూప్లీకేట్ టిఆర్‌ఎస్ మంత్రులే కొనసాగుతున్నారని ఎద్దేవా చేశారు. వందసీట్లు గెలుస్తామంటున్న కెసిఆర్ ముందు పార్టీ మారిన వారితో రాజీనామా చేయించి గెలవాలని సవాల్ విసిరారు. పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ టిఆర్‌ఎస్ నేతలతో భూసర్వే చేయాలని చూస్తున్నారని విమర్శించారు. సర్వేలతో నామినేటెడ్ కమిటీలు వేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. డిజిటల్ సర్వే కోసం కేంద్రం విడుదల చేసిన రూ. 256కోట్లలో ఒక్కరూపాయి ఖర్చు చేయలేదన్నారు. 3600బృంధాలు, 100రెవిన్యూ సిబ్బంది అంటూ ప్రకటించిన సిఎం కనీసం రెండు మండలాలకు ఒక్క సర్వేయర్ లేరన్న విషయం గుర్తించాలన్నారు.



సోమవారం అసెంబ్లీ హాల్‌లో జరిగిన మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ విపక్షనేత షబ్బీర్ అలీ, ఉపనేత పొంగులేటి సుధాకర్

రేషన్ షాపుల ద్వారా అంగన్‌వాడీలకు సరకులు

సెప్టెంబర్ నుండి అమలు - 60 ఏళ్ల పైబడిన అంగన్‌వాడీ టీచర్లకు వన్‌టైం సెటిల్‌మెంట్

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాలకు సెప్టెంబర్ నుంచి రేషన్ షాపుల ద్వారా రేషన్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటిదాకా స్థానికంగా ఉన్న స్టాక్ పాయింట్ డిపోల నుంచి అంగన్‌వాడీలకు రేషన్ అందిస్తున్నారు. ఇక నుంచి స్థానికంగా ఉన్న రేషన్ షాపుల ద్వారా ఇవ్వాలని దీనిని వచ్చే నెల నుంచే అమలు చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో మహిళా శిశుసంక్షేమంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇప్పటిదాకా అంగన్‌వాడీ టీచర్లకు నిర్దేశించిన స్టాక్ పాయింట్ నుంచి పిల్లలకు అందించే రైస్ ట్రాన్స్‌పోర్టు అవుతోందని అలా గాకుండా స్థానికంగానే వాటిని ఇవ్వడం ద్వారా వారికి కావాల్సిన రేషన్‌తో పాటు సమయం కూడా ఆదా అవుతుందని మంత్రి చెప్పారు. అంగన్‌వాడీ టీచర్ బయోమెట్రిక్ ఆదారంగా రేషన్ అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 60 సంవత్సరాలు నిండిన అంగన్ వాడీ టీచర్లు, ఆయాలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద డబ్బులు అందించనున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్లకైతే రూ.60 వేలు, ఆయాలకైతే రూ.30 వేల చొప్పున ఇస్తారు. కొంతమంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ వయస్సు సహకరించడం లేదని, తమకు ఏదో రకంగా సహాయం చేయాలన్న విజ్ఞప్తి మేరకే ఇటువంటి నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఎవరైనా ఇటువంటి పరిస్థితుల్లో ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అయితే ఆ ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. మహబూబ్ నగర్ జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో ఉన్న ఖాళీల మేరకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలు వెంటనే భర్తీ చేయడంతో పాటు ఆ ప్రక్రియను వీలైనంత త్వరగా ముగించాలని మంత్రి ఆదేశించారు. పైరవీలకు తావు లేకుండా ఆన్‌లైన్‌లో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా నిజమైన అర్హులకే ఆ పోస్టులు దక్కేలా చూడాలన్నారు.

తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాలలో కొత్తగా 300 అంగన్‌వాడీ మోడల్ భవనాలను నిర్మించబోతున్నట్లు మంత్రి తెలిపారు. వీటిని నిర్మించేందుకు వేదాంత ఫౌండేషన్ ముందుకొచ్చినట్లు మంత్రి వెల్లడించారు. దేశవ్యాప్తంగా వెనుకబడిన ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించేందుకు వేదాంత ఫౌండేషన్ ముందుకొచ్చింది. 11 రాష్ట్రాల్లో నాలుగువేల భవనాలను నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప ్పందం చేసుకుందని అందులో భాగంగానే మన రాష్ట్రంలో 300 అంగన్‌వాడీ భవనాలను కట్టబోతున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన భవనాలను వారికి అప్పగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు స్థానికంగా ఉన్న ప్రైమరి పాఠశాలలో నడుస్తున్నాయి. అక్కడే ఈ కొత్త భవనాలకు అవసరమయ్యే స్థలాన్ని వేదాంత ఫౌండేషన్ కు వెంటనే అప్పగించాలని ఈ మొత్తం ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేయాలని మంత్రి కోరారు. తెలంగాణలోని 10 జిల్లాల్లో 300 కొత్త అంగన్‌వాడీ మోడల్ భవనాలను నిర్మిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలను వెంటనే నిర్మించాలని పాడైపోయిన భవనాలను వెంటనే గుర్తించి వాటికి తగిన మరమ్మత్తులు చేయించాలన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలను వెంటనే శాశ్వత భవనాలకు మార్చాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి జగదీశ్వర్‌తో పాటు డైరెక్టర్ విజయేంద్ర బోయి తదితర అధికారులు పాల్గొన్నారు.

మృత్యువాత పడుతున్న మూగ జీవాలు

గొర్రెలకు అంతు చిక్కని వ్యాధులు - కొనుగోళ్లలో అక్రమాలు - నిబంధనలు బేఖాతరు

హైదరాబాద్, అగస్టు 28, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో అంతుచిక్కని వ్యాధితో గొర్రెలు మృత్యువాత పడుతున్నాయి. రాష్ట్రంలో వివిధ వ్యాధులు, అంతుచిక్కని తెగుళ్ల గొర్రెల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీకి అంతుచిక్కని వ్యాధులు చెక్ పెడుతున్నాయి. ప్రధానంగా రాయితీపై అందించిన జీవాలు అంతుచిక్కని వా ్యధులతో మృత్యువాత పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు చోటుచేసుకుంటున్నాయి. అంతే కాకుండా ఈ వ్యాధుల నియంత్రణకు వైద్యులు, మందులు సైతం అందుబాటులో లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. సకాలంలో వైద్య సౌకర్యాలు అందకపోవడంతో మూగజీవాలను కాపాడే పరిస్థితి కనిపించడం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని సిరిసిల్లా రాజన్న జిల్లాలోని జరాజన్నపేట, దుమాల, గొల్లపల్లి, గుండారం, కంచర్ల తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం 200 గొర్రెల యూనిట్లను పంపిణీ చేసింది. పంపిణీ చేసే సమయంలో గొర్రెలు ఆరోగ్యంగానే ఉన్నా కొద్ది రోజులకే అవి రోగాల బారిన పడ్డాయి. ఒక్కొక్క యూనిట్‌లో రెండు నుండి నాలుగు గొర్రెల వరకూ మృత్యువాత పడినట్లు స్థానికులు వాపోతున్నారు. ఈవిధంగా ఆయా గ్రామాల్లో ఇప్పటికి 50 గొర్రెలు చనిపోయినట్లు చెబుతున్నారు. మరో 70 జీవాలు అస్వస్థతకు గురైయ్యాయి. గొర్రెలు పంపిణీ చేసిన రోజునే గొల్లపల్లిలో 20 గొర్రెలు, రాజన్నపేట్‌లో 10, గుండారంలో ఆరు, దుమాల గ్రామంలో తొమ్మిది చనిపోయినట్లు లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈవిధంగానే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పలు గొర్రెలు చనిపోయినట్లు తెలియవచ్చింది. గొర్రెల పంపిణీలో కొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరుతోనే ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు బహిరంగంగా చెబుతున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా గొర్రె పిల్లల పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. ఏడాదిన్నర వయసు కలిగిన గొర్రెలను లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, కొందరు అధికారులు మాత్రం వాటిని పట్టించుకోవడం లేదని అంటున్నారు. పలు ప్రాంతాల్లో ఒక్కొక్క యూనిట్‌లో ఐదు మాసాలు వయస్సు ఉన్న గొర్రె పిల్లలను పంపిణీ చేసినట్లు తెలియవచ్చింది. మరీ చిన్న పిల్లలు కావడంతో వ్యాధి నిరోధక శక్తి లేక త్వరితగతిన వ్యాధులకు గురవుతున్నట్లు తెలిసింది. వాతావరణం, ఆహారంలో మార్పు తదితర కారణాలతో చిన్న చిన్న వ్యాధులను సైతం ఈ చిన్నపిల్లలు తట్టుకోలేకపోతున్నాయని వాపోతున్నారు. గొర్రె పిల్లలు వివిధ వ్యాధుల బారినపడుతున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కుబడిగా గొర్రె పిల్లలను పంపిణీ చేసి అధికారులు చేతులు దులుపుకొంటున్నారని ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలోని నిజామాబాద్, ఆదిలాబాద్. వరంగల్ తదితర జిల్లాల్లో పలు ప్రాంతాల్లో పంపిణీ చేసిన గొర్రెల పరిస్థితి ఇదేవిధంగా ఉందని అంటున్నారు. కాగా గొర్రెల కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నట్లు తెలియవచ్చింది. కమిషన్ల కోసం కక్కుర్తి పడుతున్న కొందరు అధికారులు చిన్న వయస్సు ఉన్న గొర్రె పిల్లలను కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఈవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని కడప తదితర ప్రాంతాల నుండి చిన్న వయస్సు ఉన్న గొర్రె పిల్లలను కొనుగోలు చేసి పంపిణీ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అధికారులు ఎక్కువ ధరలు పెట్టి దళారుల వద్ద కొనుగోలు చేయడం వివాదా స్పదమవుతోంది. దీంతోపాటు పెద్దపల్లి తదితర జిల్లాల్లో గొర్రెల కొనుగోలులో కొందరు అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే పెద్దపల్లి జిల్లాలో పాత లబ్ధిదారులకు అప్పటికే ఉన్న గొర్రెలను కొత్తగా పంపిణీ చేసినట్లు చూపి వాటికి సంబంధించి దాదాపు మూడు కోట్ల రూపాయల మేర సబ్సిడీ నిధులను స్వాహా చేయడం చర్చనీయాంశమైంది. పెదప్దపల్లి జిల్లాకు 320 యూనిట్లు మంజూరు కగా, 70 యూనిట్లు మాత్రమే ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన గొర్రెలను కొత్తగా కొనుగోలు చేసినట్లు చూపి సబ్సిడీని పక్కదారిపట్టించారు. ఈ వ్యవహారం బయటికి పొక్కడంతో జిల్లా కలెక్టర్ ఏసీబీ విచారణకు ప్రభుత్వాన్ని కోరినట్లు తెలియవచ్చింది. ఈవిధంగా గొర్రె పిల్లల పంపిణీ సక్రమంగా లేకపోవడం వివాదాస్పదమవుతోంది.

విద్యుదాఘాతంతో ఉస్మానియా ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

హైదరాబాద్ (బేగంబజార్) ,ఆగస్టు28ప్రభాతవార్త: ప్రమాదవశాత్తు షాట్ సర్క్యూట్స్ జరిగి ఉస్మానియా ఆసుపత్రిలోని కులీకుత్‌బ్‌షా భవనంలో ఉన్న నెఫ్రాలజీ విభాగంలో మంటలు అంటుకున్నాయి. ఈ సంఘటన సోమవారం ఉదయం11గంటలకు చోటు చేసుకున్నాయి. ఈసంఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, వైద్యుల వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. ఉస్మానియా ఆసుపత్రిలోని కులీకుత్‌బ్‌షా భవనంలోని మూడవ అంతస్తులో కొనసాగుతున్న నెఫ్రాలజీ విభాగంలో రోగులు చికిత్స పొందుతున్నారు. రోజు మాదిరిగానే సోమవారం నెఫ్రాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ మనీషాహి విధులకు హాజరయ్యారు. అనంతరం రోగులకు అందుతున్న సేవలను తెలుసుకునేందుకుగాను వెళ్లిన కొద్ది సేపట్లోనే ఆమె రూమ్‌నుంచి మంటలు రావడం కనిపిం చాయి. వెంటనే అక్కడే ఉన్న సిబ్బంది స్పందించి మంటలను ఆర్పివేశారు. అనంతరం మంటలను ఆర్పి వేసిన తరువాత పరిశీలించి ఏసికి షాట్‌సర్క్యూట్స్ సంభవించి మంటలను వ్యాపించినట్లు తెలిపారు. సకాలంలో సిబ్బంది స్పందించి మంటలను ఆర్పివేయడంతో పెన్నుప్రమాదాన్ని నివారించారు. ముందు జాగ్రత్త చర్యగా అగ్నిమాపక దళానికి సమాచారం అందించగా ఫైరింజన్ రప్పించారు. కాగా అదే భవనంలో ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ జివిఎస్‌మూర్తి, పస్టఆర్ఓం డాక్టర్ అంజయ్య, ఇంజనీరింగ్ విభాగం అధికారులు తనిఖీలు చేసు_న్నారు. షాట్‌సర్క్యూట్స్ జరిగిన విషయం తెలుసుకుని కులీకుత్‌బ్‌షా విభాగంలోని మూడవ అంతస్తులో కొనసాగుతున్న నె ఫ్రాలజీ విభాగాన్ని సందర్శించి షాట్‌సర్క్యూట్స్ గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అఫ్జల్‌గంజ్ పోలీసులు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని షాట్ సర్క్యూట్స్ గల కారణాలపై ఆరా తీశారు. ఎట్టకేలకు ఘోర ప్రమాదం తప్పింది.

విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి కార్యాచరణ

గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఎక్కా

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ చర్యలవల్ల గిరిజన సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో గిరిజన విద్యార్థులు లక్షలాదిగా చేరుతున్నారని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెన్‌హర్ మహేశ్‌దత్ ఎక్కా అన్నారు. ఈ విద్యార్థులకు పోషకాహారం సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి, భద్రత, భరోసా కలిగించే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన పిల్లల వైద్యరంగంలో పేరుగాంచిన పనాసియా సంస్థ అధికార ప్రతినిధులను తన కార్యాలయానికి పిలిపించుకొని వారితో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఇక మీదట గిరిజన సంక్షేమ శాఖ అధికారుల సమన్వయంతో పనాసియా సంస్థకు చెందిన హెల్త్ సూపర్‌వైజర్లు ప్రతి గిరిజన పాఠశాల, కళాశాల, వసతిగృహంలో ఉన్న ప్రతివిద్యార్థి వద్దకు వెళ్ళి ముందస్తుగా వారి ఎత్తు, బరువు, బ్లడ్ గ్రూప్, దృష్టి, గుండె పని తీరు, ఎనీమియా తదితర ఆరోగ్య సమాచారాన్ని స్క్రీనింగ్ చేసి విద్యార్థి వారిగా డేటా బ్యాంక్ తయారుచేస్తారని తెలిపారు. డేటా ప్రకారం సమస్యలున్న వారికి వెంటనే చికిత్స అందిస్తారన్నారు. సమస్య ఎక్కువగా ఉన్న వారికి ఉన్నత స్థాయిలో నైపుణ్య వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటారని తెఇపారు. ప్రతి నెలా ప్రతి విద్యార్థి ఆరోగ్య స్థితిని అప్‌డేట్ చేస్తారన్నారు. ఇదంతా గిరిజన అధికారులతో స్వయంగానూ, ఆన్‌లైన్‌లోనూ డేటా పంచుకుంటూ సమస్యలను సమూలంగా తొలగించేందుకు కృషి చేస్తారని వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలోని గిరిజన విద్యార్థినీ విద్యార్థులందరికీ సంపూర్ణ ఆరోగ్యానికి భరోసా కల్పిస్తామని మహేశ్‌దత్ ఎక్కా తెలిపారు. కార్యాచరణ ప్రణాళిక ఈ నెలాఖరుకల్లా పూర్తిచేసి వచ్చే నెలనుంచి అమలులోకి తేవాలని గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ ఆర్. లక్ష్మణ్‌ను, ఇతర ఉన్నతాధికారులను, పనాసియా సంస్థ ప్రతినిధులను ఆయన కోరారు.

సివిల్ సప్లయ్ హామాలీలను ఉద్యోగులుగా గుర్తించాలి: ఎఐటియుసి

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయీస్ హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ డిమాండ్ చేసింది. ప్రస్తుతం హమాలీలకు చెల్లిస్తున్న రెట్లు పెరుగుతున్న ధరలకు ఏ మాత్రం సరిపో కపోవడంతో హమాలీలు అనేక అవస్థలు పడుతున్నారని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయీస్ రాష్ట్ర సమితి సమావేశం సోమవారం ఎఐటీయుసీ రాష్ట్ర కార్యాలయం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ మాట్లాడుతూ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ పనిచేస్తున్న హమాలీలతో పాటు సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. 30 ఏళ్లుగా కార్పొరేషన్ గోడౌన్లలో పనిచేస్తూ కనీస జీవన ప్రమాణాలు లేకుండా ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతకాలంగా యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తున్నా ... ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 11 ఏళ్లుగా ప్రావిడెంట్ ఫండ్‌ను అమలు చేస్తున్న ప్రభుత్వం ఇఎస్ఐ అమలు పట్ల కాలయాపన చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. సాంఘిక సంక్షేమ చట్టా లైన ఇఎస్ఐ. బోనస్, గ్రాట్యూటీ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దశల వారీగా సబ్సిడీలను రద్దు చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. ఇందులో భాగంగానే రేషన్‌కార్డులపై కేవలం బియ్యాన్ని మాత్రమే అందిస్తూ దానికి సంబంధించిన సబ్సిడీలను బ్యాంకు అకౌంట్‌లలో వేయాలనే ఆలోచనను విరమించుకోవాలన్నారు. 3 కోట్ల వినియోగదారులకు ఉపయోగపడే 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని డి మాండ్ చేశారు. 50 ఏళ్ల నిండిన హమాలీలకు నెలకు 3 వేల చొప్పున పెన్షన్‌ను చెల్లించాలన్నారు. అదే విధంగా ప్రస్తుతమిస్తున్న దహన సంస్కారాలకు చెల్లిస్తున్న 10 వేల రూపాయలను 20 వేలకు పెంచాలని కోరారు. ఎఐ టీయుసీ 98వ ఆవతరన దినోత్సవం సంద ర్భంగా అన్ని గోడౌన్లలో జెండాలు ఎగురవేసి తోరణాలు కట్టాలని సమావేశం ఈ సందర్భంగా తీర్మా నించిందన్నారు. నవంబర్ 9 నుంచి 11వ తేదీల్లో ఢిల్లీలో జరిగే మహాధర్నా ప్రతి మండల పాయింట్ నుంచి హమాలీలు పాల్గొనాలని సూచించారు. రాష్ట్ర మహాసభలను సెప్టెంబర్ 23, 24వ తేదీలలో హదరాబాద్‌లో నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయించినట్లు చెప్పారు. ఎస్‌కె. బాబుమియా అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు శ్రీనివాస్ నర్సింహా, యాదయ్య, జకరయ్య, ఉపేందర్, పరశురాం, సాంబన్న పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం

ఎస్సి, ఎస్టీలకు 100 శాతం, బిసిలకు 90 శాతం సబ్సిడీ
ఉద్యానవన శాఖ కమిషనర్ ఎల్.వెంకట్‌రామ్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త : మైక్రో ఇరిగేషన్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఇందు కోసం ఉద్యానవన పంటలకు భారీగా సబ్సిడీ ఇస్తున్నట్లు ఉద్యానవన శాఖ కమిషనర్ ఎల్. వెంకట్‌రామ్‌రెడ్డి అన్నారు. సోమవారం సెమినార్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ ఉద్యాన మహోత్సవం లో ఆయన రైతుల నుద్దేశించి ప్రసంగించారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం ఎస్సి, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ, చిన్నతరహా రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. షేడ్‌నెట్ హౌజెస్‌కు ప్రస్తుతం 75 శాతం సబ్సిడీ అందుబాటులో ఉందన్నారు. టొమాటో, మిర్చి జూన్ నుండి ఆగష్టు మాసాల్లో, క్యాబేజీ, క్యాలిఫ్లవర్ జూన్, జులై మాసాల్లో అయితే బాగా ఫలితాలు ఇస్తుందని దీని ప్రకారం ప్లాన్ చేసుకోవాలని సూచించారు. రైతులు ఈ పంటల ద్వారా ఎకరాకు రూ. 2.5 నుంచి 3.0 లక్షలు ఆదాయం పొందవచ్చన్నారు. పాలిహౌజెస్, షెడ్‌నెట్ ద్వారా కూరగాయల సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. తమ శాఖ నాణ్యమైన విత్తనాలను సిఓఇ జీడిమెట్ల ద్వారా నెల రోజుల ముందు అందజేస్తుందన్నారు.

నిరుద్యోగులు చనిపోతున్నా పట్టించుకోని ప్రభుత్వం

40వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సిందే - సిఎం కెసిఆర్‌కు ఆర్.కృష్ణయ్య లేఖ



హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 28 ప్రభావార్త: రాష్ట్రంలో నిరుద్యోగుల చనిపోతుంటే ప్రభుత్వం డిఎస్సీ వేయడం లేదని, టీచర్ పోస్టులు 8,972 కాదని 40 వేల పోస్టులు భర్తీ చేయాలని, పోస్టులు భర్తీ వాయిదా వేయాలనే సాకులు మానుకోవాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. డిఎస్సీ జాప్యంతో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని మన్నెపు రామకృష్ణ ఆదివారం చనిపోయారని, అంతకు ముందు మరో నలుగురు నిరుద్యోగులు చనిపోయారని, కాని ప్రభుత్వంకు ఇవేమి పట్టనట్లుగా ఉందని ఆయన ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం డిఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయకపోతే మరింత మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి కెసిఆర్‌కు రాసిన లేఖలో ఆయన సోమవారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నోటిఫికేషన్‌కు ప్రభుత్వం వద్ద అన్ని వివరాలు సిద్ధంగా ఉన్నాయని, టీచ్ పోస్టుల భర్తీకి టెట్ ఫలితాలు ప్రకటించగాన నోటిఫికేషన్ జారీ చేస్తామని విద్యా శాఖ మంత్రి నెల రోజుల క్రితం ప్రకటించారని, ఇటీల 15 రోజుల క్రితమే టెట్ ఫలితాలు ప్రకటించారని కాని ఇంతవరకు నోటిఫికేషన్ జారీ చేయకుండా ఇదిగో, ఆదిగో అన్ని జాప్యం చేయడం న్యాయం కాదని ఆయన అన్నారు. గత మూడు సంవత్సరాల 4 నెలలుగా ఆరు సార్లు వివిధ కారణాలు చూపుతూ టీచర్ పోస్టుల భర్తీకి వాయిదాల మీద వాయిదాలు వేసారని, ప్రస్తుతం తాజాగా పాత జిల్లాల ప్రకారం భర్తీ చేయాలా! అంటూ సరికొత్త విధానాన్ని తెర మీదకు తెచ్చారని ఆయన ఆరోపించారు. న్యాయపరమైన, చట్ట పరమైన, సాంకేతికపరమైన అవరోధాలు రాకుండా చర్చించి తక్షణమే నోటిఫికేషన్ జారీ చేయాలని ఆర్.క ృష్ణయ్య డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సెప్టెంబరు 12వ తేదీ లోగా టీచర్స్ రిక్రూట్ మెంట్‌కు నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశాలు జారీ చేసిందని కాని ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా అమలు చేయకుండా సాకులు చెపుతున్నదని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లు కనిపించడం లేదని ఆరోపించారు. టీచర్ పోస్టుల భర్తీ విషయంలో ముఖ్యమంత్రి తక్షణమే స్వయంగా జోక్యం చేసుకుని నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు.

ప్రపంచకప్ వరకు పక్కా అనిపించేలా..

బ్యాట్‌తో సత్తా చాటిన ధోనీ



పి.వి.రమణ/స్పోర్ట్స్‌ప్రతినిధి: 2019 ప్రపంచకప్‌లో ఆడబోయే భారత జట్టులో మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనికి స్థానముంటుందా? ఉండదా? అన్న చర్చ ఇప్పుడు కొనసాగుతోంది. ధోనీకి చోటుపై సెలెక్టర్లు ఇప్పుడే ఏమీ చెప్పకపోయినా అతను ఉండి తీరాల్సిందేనని వీరేంద్ర సెహ్వాగ్ వంటి సీనియర్ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. ఈ చర్చ నేపథ్యంలోనే ధోని ఇటీవల శ్రీలంకతో ఆడిన రెండు, మూడో వన్డేల్లో రాణించి విమర్శకుల నోటికి తాళం వేశాడు. క్లిష్ట సమయాల్లో జట్టును విజయతీరాలకు చేర్చే బాధ్యతను తీసుకోవడంలో తనకు తానే సాటి అని మరోసారి నిరూపించుకున్నాడు. జట్టుకు తన అవసరమేంటో తన బ్యాటింగ్ ద్వారా చాటి చెప్పాడు. కీలక సమయంలో నిలకడగా ఆడి వచ్చే ప్రపంచ కప్ దాకా తనకు జట్టులో స్థానం కల్పించాల్సిన ఆవశ్యకతను చాటాడు. లంకతో జరిగిన రెండోవన్డేలో మిగతా ఆటగాళ్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టగా, ఇక గెలుపు మీద ఆశలు లేని స్థితిలో భువీతో కలిసి ధోనీ భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. రాణించకపోతే ధోనిని జట్టులోకి తీసుకునే విషయమై ఆలోచిస్తామంటూ వన్డే సిరీస్‌కు ముందు చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కె ప్రసాద్ మాట్లాడగా ఇప్పుడు తన బ్యాట్‌తో సెలెక్టర్లకు దీటైన బదులిచ్చాడు. 131పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయిన దశలో సింగిల్స్ తీస్తూ జట్టును విజయ తీరాలకు చేర్చాడు. ఈమ్యాచ్‌లో 68బంతులు ఆడిన 45 పరుగులు చేసిన ధోని ఒకే ఒక బౌండరీ బాదాడు. కాగ మరో ఎండ్‌లో భువీ కుదురుకునేందుకు తన వంతు ప్రోత్సాహం అందించాడు. భువనేశ్వర్ ఎక్కువ బంతులు ఆడుతున్నా అభ్యంతరం చెప్పని ధోనీ, పవర్ హిట్టింగ్‌ను పక్కనబెట్టి పరిస్థితులకు అనుగుణంగా సింగిల్స్ తీయడానికి ప్రాధాన్యం ఇచ్చాడు. భువీతో కలిసి 8వ వికెట్‌కు అజేయంగా 100 పరుగులు జోడించాడు. రెండో వన్డేలో ధోని నెమ్మదిగా ఆడినా, కానీ వన్డేల్లో ఛేజింగ్‌లో తనకు తానే సాటి అని మరోసారి నిరూపించాడు. మూడో వన్డేలో 218 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 61పరుగులకే టీమిండియా 4కీలక వికెట్లు పడిపోయిన దశలో ఓపెనర్ రోహిత్‌తో కలిసి ధోని 67 పరుగులు చేసి అజేయంగా నిలిచి భారత్‌ను విజయ తీరాలకు చేర్చాడు. విజయవంతంగా లక్ష్యాన్ని ఛేదించిన మ్యాచ్‌ల్లో ధోనీ సగటు 99.16 కావడం విశేషం. ఛేజింగ్ కింగ్ కోహ్లి 97.68 సగటుతో అతడి తర్వాతి స్థానంలో ఉన్నాడు. అంతేకాదు ఇప్పటివరకు ఛేజింగ్‌లో 40 సార్లు ధోని అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. కడ దాకా క్రీజులో ఉండి జట్టును గెలుపు తీరాలకు చేర్చిన ఆటగాళ్లు ప్రపంచ క్రికెట్‌లో మరొకరు లేరు. ధోని తర్వాత స్థానంలో జాంటీ రోడ్స్ (33 సార్లు) ఉన్నాడు. ప్రపంచ క్రికెట్‌లో బెస్ట్ ఫినిషర్లలో ఒకడైన ధోనీ వచ్చే ప్రపంచ కప్ వరకు జట్టులో ఉంటే, అతడి అనుభవం, బ్యాటింగ్ నైపుణ్యం జట్టుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇదే విషయాన్ని ధోనీ అభిమానులు ఇప్పుడు బలంగా ప్రస్తావిస్తున్నారు. ధోనీ విలువేంటో ఇప్పటికైనా సెలెక్టర్లకు అర్థమై ఉంటుందా?

నూతన రికార్డులను తన పేరిట లిఖించిన ధోనీ: జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు, ఓటమి దిశగా వెళ్తున్న సమయంలో తీవ్ర ఒత్తిడిని జయించి తనదైన శైలిలో ప్రశాంతంగా ఆడి జట్టుకు మంచి ముగింపు అందించడం ధోనీకి అలవాటు. అందుకే అభిమానులు అతడిని బెస్ట్ ఫినిషర్ అంటారు. అడపాదడపా మ్యాచ్‌ల్లో తప్ప అత్యధిక మ్యాచ్‌ల్లో జట్టుకు మహీ ఊహించని విజయాలు అందించారు కూడా. శ్రీలంకతో రెండో టెస్టులో అతడి ఆటతీరే నిదర్శనం. ప్రస్తుతం బ్యాట్స్‌మెన్, కీపర్‌గా రాణిస్తున్న అతడు పలు మైలురాళ్లను అధిగమిస్తూ నూతన రికార్డులను తన పేరిట లిఖించుకుంటున్నాడు.

- వికెట్ల వెనుక అత్యంత అప్రమత్తంగా ఉండే ధోని స్టంపుల్లో సరికొత్త రికార్డును అందుకోబోతున్నాడు. శ్రీలంకతో జరిగిన 2వ వన్డేలో ఆతిథ్య బ్యాట్స్‌మెన్ గుణతిలకను స్టంప్ చేయడం ద్వారా లంక మాజీ క్రికెటర్ కుమార సంగక్కర పేరిట ఉన్న (99 స్టంపులు) రికార్డును ధోని సమం చేశాడు. మరొక స్టంప్ చేస్తే అత్యధిక స్టంపింగ్ రికార్డు మహీకే దక్కుతుంది.
- పల్లెకెలె స్టేడియంలో 45 పరుగులతో, మూడో వన్డేలో 67 పరుగులతో రాణించి నాటౌట్‌గా నిలిచాడు ధోనీ. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌చరిత్రలో అత్యధిక సార్లు (121) అజేయంగా నిలిచిన తొలి క్రికెటర్‌గా కూడా ఘనత సాధించాడు. అంతకు ముందు శ్రీలంక మాజీక్రికెటర్ మురళీధరన్ (119)ను తాజాగా ధోనీఅధిగమించాడు.
- ఉత్కంఠభరితంగా సాగిన పోరులో టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించిన భువనేశ్వర్, ధోనీ జోడి 8వ వికెట్‌కు అజేయ శతక భాగస్వామ్యంతో ఆకట్టుకుంది. వన్డేల్లో శ్రీలంకతో 8వ వికెట్‌కు ఇదే అత్యధిక భాగస్వామ్యం. 2014 నవంబర్‌లో విరాట్ కోహ్లి, అక్షర్ పటేల్ జోడీ 57పరుగుల భాగస్వామ్యంతో మెరిసింది.
- విజయవంతమైన ఛేదనల్లో అజేయంగా నిలిచిన రికార్డు సైతం ధోని పేరిటే ఉంది. అతడు 40 ఇన్నింగ్స్‌ల్లో నాటౌట్‌గా నిలిచాడు. అతని తర్వాత జాంటీ రోడ్స్ 33, రికీ పాంటింగ్ 31, అజారుద్దీన్/కలిస్ 30 స్థానాల్లో ఉన్నారు.
- శ్రీలంకతో జరిగిన మూడో వన్డేలో కీలక ఇన్నింగ్స్ ఆడిన ధోనీ వన్డే కెరీర్‌లో అత్యధిక పరుగులు చేసిన నాలుగో భారత క్రికెటర్‌గా నిలిచాడు. ఈమ్యాచ్‌కు ముందు అజారుద్దీన్ తర్వాత 5వ స్థానంలో ఉన్నధోనీ ఈ మ్యాచ్‌లో 62 పరుగులు చేసి మొత్తం 9419 పరుగులతో నాలుగో స్థానానికి దూసుకెళ్లాడు.
- వన్డేల్లో అత్యధిక సార్లు నాటౌట్‌గా నిలిచిన బ్యాట్స్‌మెన్‌గా చమిందా వాస్, షాన్‌పొలాక్ సరసన ధోనీ నిలిచాడు. ఇప్పటివరకు72ఇన్నింగ్స్‌లలో నాటౌట్ గానిలవడంవిశేషం. వాస్, పొల్లాక్ ఇప్పటికే రిటైర్అయ్యారు. కాబట్టి ఈ రికార్డును కూడా భవిష్యత్తులో ధోని పేరిటే ఉండబోతుంది.



ఒక కాలు లేకున్నా ఫర్వాలేదు పాక్‌పై ఆడతానని చెప్పిన ధోనీ: ధోని ప్రపంచకప్ వరకు కొనసాగించాలా, లేదా...అని చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఇటీవల మీడియాతో మాట్లాడిన భారత క్రికెట్ జట్టు చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కె ప్రసాద్ ధోని గురించి ఆసక్తికర విషయాలు తెలిపారు. ఒక కాలు లేకపోయినా ఫర్వాలేదు నేను మాత్రం పాకిస్తాన్‌తో మ్యాచ్ ఆడి తీరుతా, ఆసియా కప్‌లో భాగంగా పాక్‌తో మ్యాచ్‌కు ముందు ధోని చెప్పాడని, ఈవిషయాన్ని భారత చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కె ప్రసాద్ వెల్లడించారు. ధోనీ అత్యంత అంకిత భావం ఉన్న ఆటగాళ్లలో ఒకడని ప్రశంసించిన ఎంఎస్‌కె పాకిస్తాన్‌తో ముందు ధోనీ ఎంత తెగువ ప్రదర్శించాడో మీడియాకు వెల్లడించాడు. లేవలేని స్థితిలో సైతం మ్యాచ్ ఆడేందుకు మహీ ఎంతటి పట్టుదల చూపాడో, ఎంఎస్‌కె మాటల్లోనే....పాకిస్తాన్‌తో మ్యాచ్ ముందు ఓ రోజు రాత్రి జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న సమయంలో ధోని గాయపడ్డాడు. బరువులు ఎత్తేటప్పుడు వెనుక భాగం పట్టేసింది. వెయిట్‌తో పాటు పడిపోయాడు. అదృష్టం కొద్దీ బరువు అతడి మీద పడలేదు. కానీ నడవడానికి మాత్రం ధోని చాలా ఇబ్బంది పడ్డాడు.మరోలా చెప్పాలంటే అతడుదాదాపుగా పాకుతూ వెళ్లాడు. మహీ అలారం మోగించడంతో మెడికల్ స్టాఫ్ వచ్చి స్ట్రెచర్‌పై అతన్ని తీసుకెళ్లారు. నేను ఢాకా చేరుకున్నాక విలేకర్లు ధోని గురించి ప్రస్తావించారు. కానీ నా దగ్గర సమాధానం లేదు. పాక్‌తో మ్యాచ్ చాలా ముఖ్యం పిచ్ పేస్ బౌలర్లకు అనుకూలించేలా ఉంది. దీంతో నేను ధోని గదికి వెళ్లాను. మహీ నన్ను చూడగానే డోంట్ వర్రీ ఎంఎస్‌కె భాయ్ అన్నాడు. తన బదులు వేరే ఆటగాన్ని ఆడించాలా అని అడిగితే..మీరేం వర్రీ కాకండి అని బదులిచ్చాడు. పెద్ద మ్యాచ్ కావడంతో మాపై చాలా ఒత్తిడి ఉంది. మరుసటి రోజు ఉదయం ధోని గది వెళ్లినప్పుడు కూడా వర్రీ కావద్దనే చెప్పాడు. కానీ ఓ సెలెక్టర్‌గా ధోని పరిస్థితి ఇబ్బందికరంగా అనిపించింది. అందుకే చీఫ్ సెలెక్టర్ సందీప్ పాటిల్‌కు పరిస్థితిని వివరించాను. వెంటనే అతడి స్థానంలో ఆడించేందుకు పార్థీవ్‌ను పంపించారు. సాయంత్రానికల్లా పార్థీవ్ జట్టుతో చేరిపోయాడు. మళ్లీ ధోని గదికి వెళ్లినప్పుడు అతడు మంచం మీది నుంచి లేవడానికి ప్రయత్నిస్తున్నాడు. అప్పుడు కూడా నేను ఆడి తీరతానని ధోనీ చాలా స్పష్టం చేశాడు. రాత్రి 11గం.ల సమయంలో మళ్లీ ధోనీ గదికి వెళ్లా. అప్పుడు అతడు గదిలో లేడు. వెతుక్కుంటే వెళితే పైన స్విమ్మింగ్ ఫూల్ పక్కన నడిచేందుకు కష్టంగా ప్రయత్నిస్తున్నాడు. నడిచేందుకే ఇబ్బంది పడుతున్నవాడు మ్యాచ్ ఎలా ఆడతాడా?అని అనుకుంటుండగా డోంట్ వర్రీ భాయ్ నేను ఆడతాను. అయినా నాకు చెప్పకుండానే పార్థీవ్‌ను రప్పించారు కదా. మీరు సేఫ్‌అన్నాడు. మ్యాచ్‌రోజు ధోనీని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. మిగతా ఆటగాళ్ల కంటే ముందే అతడు ప్యాడ్లు కట్టుకొని రెడీ అయ్యాడు. తర్వాత నన్ను డ్రెస్సింగ్‌రూంకి పిలిచి అంతగా ఎందుకు వర్రీ అవుతున్నారని ప్రశ్నించాడు. నాకు ఓ కాలు లేకపోయినా సరే, పాకిస్తాన్‌తో కచ్చితంగా మ్యాచ్ ఆడతానని చెప్పాడు. ఆ మ్యాచ్‌లో ధోని నాయకత్వంలోని భారత్ జట్టు పాక్‌పై గెలిచింది. అని ఎంఎస్‌కె ప్రసాద్ నాటి అనుభవాలను గుర్తు చేసు కున్నారు.



నేడు అర్జున అవార్డుల ప్రదానం

అవార్డు పంక్షన్‌కు పుజారా గైర్హాజరు

అర్జున అవార్డును ఊహించలేదన్న హార్మత్ ప్రీత్

న్యూఢిల్లీ: జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా మంగళవారం అర్జున అవార్డులను క్రీడాకారులకు మంగళవారం అవార్డులను రాష్ట్రపతి అందజేయనున్నారు. 17మంది క్రీడాకారులు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఈ అవార్డులని అందుకోవాల్సి ఉంది. అర్జున అవార్డులను అందుకునే వారిలో టెస్టు క్రికెటర్, మహిళా క్రికెటర్ హర్మన్ ప్రీత్ కౌర్ ఉన్నారు.

అర్జున అవార్డు పంక్షన్‌కు పుజారా గైర్హాజరు: "క్రికెటర్‌కి మైదానంలో ఆడటం కంటే మరేది అంత సంతోషాన్నివ్వదనే విషయాన్ని మరోసారి నిరూపించాడు. భారతమిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ ఛతేశ్వర్ పుజారా. టెస్టు ఫార్మట్‌లో గత కొంతకాలంగా అసమాన ప్రతిభ కనబరుస్తున్న పుజారాకి కేంద్ర ప్రభుత్వం ఇటీవల అర్జున అవార్డుని ప్రకటించిన విషయం తెలిసిందే. అర్జున అవార్డు ఎంపికవడం గొప్పగౌరవంగా భావిస్తున్నాను. కానీ...ప్రస్తుతం నేను ఇంగ్లాండ్‌లో ఒక జట్టు తరుపున కౌంటీల్లో ఆడుతున్నాను. దీని కారణంగా ఈ అవార్డుని మంగళవారం నేను స్వయంగా వచ్చి అందుకోలేను. ఆటలోని నిబద్ధతే నన్ను ఈ స్థాయికి చేర్చింది. అవార్డు కార్యక్రమానికి హాజరవడం అవార్డు అందుకోవడం గొప్ప గౌరవమే. కానీ, దొరికిన అవకాశాన్ని చేజిక్కించుకుని క్రికెట్ ఆడేందుకే నేను ఎక్కువ ప్రాధాన్యత ఇస్తా అని పుజారా వెల్లడించారు.ఈ అవార్డు దక్కినందుకు ఎంతో సంతోషంగా ఉందని, నా ఆటకు సరైన గుర్తింపు లభించిందని పుజారా అభిప్రాయ పడ్డారు. ఇటీవల శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌లో పుజారా 309 పరుగులు సాధించాడు. ఇప్పటివరకు 51 టెస్టులాడిన అతడు 4107పరుగులు చేశాడు.



అర్జున అవార్డును ఊహించలేదు: హార్మన్ ప్రీత్: కేంద్ర ప్రభుత్వం క్రీడాకారులకు అందజేసే అర్జున అవార్డు తనకి వస్తుందని ఎప్పుడూ ఊహించలేదని భారత మహిళా క్రికెటర్ హార్మన్ ప్రీత్ కౌర్ సంతోషం వ్యక్తం చేసింది. మంగళవారం అర్జున అవార్డును అందుకోనున్న నేపథ్యంలో సోమవారం హార్మన్ మీడియాతో మాట్లాడింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకం వచ్చినా, అది క్రీడాకారుల్లో ఖచ్చితంగా ఆత్మస్థైరాన్ని పెంచుతుంది. అర్జున అవార్డు అందుకోవడం నాకు తెలిసి ప్రతి క్రీడాకారుని కల. ఇక్కడే నాలో ప్రతిభ ఉందని గుర్తించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్తున్నా. భవిష్యత్తులో నేను ఇంకా మెరుగైన ప్రదర్శన చేసేందుకు శ్రమిస్తా. మహిళలకు కూడా ఐపిఎల్ లాంటి టోర్నీలు నిర్వహిస్తే బాగుంటుంది. బిసిసిఐ దీనికోసం ఇప్పటికే ప్రయత్నాలు ఆరంభించిందని అనుకుంటున్నా. కచ్చితంగా ఐపిఎల్ ద్వారా, చాలా మంది కొత్త క్రికెటర్లు వెలుగులోకి వస్తారని హార్మన్ ప్రీత్ వివరించింది. ఇంగ్లాండ్‌లో ఇటీవల ముగిసిన మహిళల ప్రపంచకప్‌లో టోర్నీ సెమీస్‌లో ఆస్ట్రేలియాపై మెరుపు ఇన్నింగ్స్‌తో హార్మన్ ప్రీత్ కౌర్ వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే.



ప్రొ కబడ్డీ టాపర్స్ వీరే

న్యూఢిల్లీ: ప్రొ. కబడ్డీ ఐదో సీజన్ ఉత్కంఠ భరితంగా సాగుతోంది. మ్యాచ్‌లు గడుస్తున్నా కొద్దీ అగ్రశ్రేణి ఆటగాళ్ల మధ్య పోటీ పెరుగుతోంది. సీజన్‌లో 50మ్యాచ్‌లు ముగిసే నాటికి పాట్నా పైరేట్స్ సారథి పర్దీప్ నర్వాల్, తెలుగు టైటాన్స్ సారథి రాహుల్ చౌదరి చెరో 83 రైడింగ్ పాయింట్లతో నువ్వా నేనా అన్నట్లు బరిలోనిలిచాడు. బెంగుళూరు బుల్స్‌సారథి రోహిత్ కుమార్ 82పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. ఇక డిఫెండర్ల విషయానికివస్తే హరియాణా స్టీలర్స్ ఆటగాడు సురేందర్ నాడా 33 టాకిల్ పాయింట్లతో దుమ్మురేపుతున్నాడు. గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ ఆటగాడు అబోజర్ మిఘాని 30 పాయింట్లతో రెండోస్థానంలో ఉన్నాడు. ఆల్ రౌండర్ల జాబితాలో దబాంగ్ డిల్లీ ఆటగాడు మిరాజ్ షేక్48 పాయింట్లతో ముందంజలో ఉండగా సందీప్‌నర్వాల్ 36తో ద్వితీయ స్థానంలో కొనసాగుతున్నాడు.



హోం మంత్రి నాయినికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ క్రికెటర్ అజరుద్దీన్

హోం మంత్రి నాయినిని కలిసిన అజర్

హైదరాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: హోం మంత్రి నాయిని నరసింహ రెడ్డిని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజరుద్దీన్ సోమవారం కలిశారు. సచివాలయానికి వచ్చిన అజరుద్దీన్ ఇదే సమ యంలో హోం మంత్రి నాయినిని ఆయన ఛాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. హోం మంత్రిని అజరుద్దీన్ మర్యాద పూర్వకంగానే కలిశారని, ఇందులోఎలాంటి రాజకీయంలేదని ఆయన వెంట వచ్చిన వారు తెలిపారు.

విజయ సూత్రం మరిచిపోయాం : కపుగెదెర

పల్లెకెలె: శ్రీలంక గెలవడం మరిచిపోయిందని ఆ జట్టు తాత్కాలికసారథి చమర కపుగెదెర అన్నాడు. బలహీనతలను అధిగమించి ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. వేరే సమస్యలేవీ లేవు. కానీ మేం విజయ సూత్రం మరిచిపోయాం అని పేర్కొన్నాడు. టీమిండియాతో జరుగుతున్న ఐదు



వన్డేల సిరీస్‌లో శ్రీలంక ఇప్పటికే వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిన సంగతి తెలిసిందే. చాలా జట్లు ఈ సమస్యతో బాధపడ్డాం చూశా. వరుస ఓటములతో సతమతమవతున్న జట్టు అవకాశం వచ్చినా గెలవలేక పోతోందంటే మేం గెలుపు సూత్రం మరిచిపోయినట్లు లెక్క..! మేం ఒక్కో మ్యాచ్ గెలుస్తూ పోవాలి. సమస్యను అధిగమించి జట్టును ఎలా గాడిన పెట్టాలో అంతర్గతంగా చర్చించాం. చివరి రెండు వన్డేల్లో మా బౌలింగ్ చక్కగా ఉంది. ఐతే మా బ్యాట్స్‌మెన్ మ్యాచ్‌ను గెలిపించేలా ఆడాల్సి ఉంది. మేం భారీ స్కోరు చేస్తే కచ్చితంగా గెలుస్తాం. ఆట మధ్యలో క్రికెటర్లు బాధ్యత తీసుకొని ఆడాలి. అప్పుడే మేం గెలవగలం. మాకు కొన్ని బలహీనతలు ఉన్నాయి. అందుకే మేం ఓడిపోతున్నాం. వచ్చే మ్యాచ్‌కు ముందే మేం వాటిని కనిపెట్టి సరిచేసుకొని బాగా ఆడాల్సి ఉందని పేర్కొన్నారు.

అభిమానుల తీరుతో చిక్కుల్లో లంక

పల్లెకెలె: మైదానంలో పేలవ ప్రదర్శనతో ఇప్పటికే తీవ్ర విమర్శలు ఎదు ర్కొంటున్న శ్రీలంక, తాజాగా అభిమానుల తీరుతో మరింత చిక్కుల్లో పడింది. భారత్‌తో ఆదివారం ముగిసిన మూడో వన్డేలో తమ జట్టు ఓటమిని జీర్ణించుకోలేక అభిమానులు మైదానంలోకి వాటర్ బాటిల్స్, వస్తువులను విసిరి మ్యాచ్‌కి అంతరాయం కలిగించిన విషయం తెలిసిందే. వారం క్రితం తొలి వన్డే ముగిసిన అనంతరం శ్రీలంక క్రికెటర్లు ప్రయాణిస్తున్న బస్సును అభిమానులు అడ్డుకుని వారికి వ్యతిరేకంగా నినాదాలు చేసి వారిని భయభ్రాంతులకి గురిచేశారు. తాజాగా అభిమానులు మ్యాచ్‌కి అంతరాయం కలిగించడంపై మ్యాచ్ రిఫరీ శ్రీలంక క్రికెట్ బోర్డుపై సీరియస్ అయ్యాడు. క్రికెటర్లకి తగిన భద్రత కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాల్సిందిగా బోర్డుని కోరినట్లు తెలుస్తోంది. దీంతో ఆగమేఘాలపై బోర్డు అంతర్గత సమావేశం ఏర్పాటు చేసి అభిమానులను శాంతింపచేసేందుకు మార్గాలను వెతుకుతోంది. భారత్ సిరీస్‌లో భాగంగా మరో రెండు వన్డేలు, ఒక టీ20 మ్యాచ్ మిగిలి ఉన్న నేపథ్యంలో ఎలాంటి భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలి, స్టేడియంలోకి ఎలాంటి వస్తువులను అనుమతించాలిలాంటి అంశాలను బోర్డు చర్చిస్తోంది. శ్రీలంక క్రికెట్ చరిత్రలో అభిమానులు ఇలా మ్యాచ్‌కి అంతరాయం కలిగించడం ఇదే తొలిసారి.



నాలో పెట్రోల్ అయిపోయిందన్న భావన కలిగింది: సైనా

గ్లాస్గో: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్లు పివి సింధు, సైనా నెహ్వాల్ రజతం, కాంస్య పతకాలను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. సెమీఫైనల్లో జపాన్ క్రీడాకారిణి నొజొమి ఒకుహర చేతిలో ఓడిన సైనా కాంస్యంతో సరిపెట్టుకుంది. అదే జపాన్ క్రీడాకారిణి చేతిలో ఫైనల్లో ఓడిన సింధు రజతం దకి ్కంచుకుంది. టోర్నీలో భాగంగా ఆది వారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్ పోరులో సుమారు 110 నిమిషాల పాటు హోరాహోరీగా సాగింది. ఈమ్యాచ్‌ని భారీ సంఖ్యలో అభిమానులు తిలకించారు.పతకం అందుకోవడానికి అక్కడే ఉన్న సైనా నెహ్వాల్... సింధు-ఒకుహర ఫైనల్ పోరును గ్యాలరీలో కూర్చుని స్వయంగా వీక్షించింది. పోరాట పటిమ, కసి, గెలుపు ఆకాంక్షతో నువ్వా నేనా అన్నట్లు సాగిన పోరును చూస్తున్న సైనాకు మాటల్లేవు. ఒక్కో పాయింట్ కోసం ప్రత్యర్థులు పోరాడిన తీరు చూసి ఆశ ్చర్యపోయిన సైనా మ్యాచ్ అనంతరం సింధు కోచ్ పుల్లెల గోపిచంద్‌ను అభినందించింది. ఈనేపథ్యంలో ఆమె ఈ మ్యాచ్ చూస్తే నాలో పెట్రోలు అయిపోయిందన్న భావన కలుగుతోంది. అని గోపిచంద్‌తో వ్యాఖ్యానించింది. దీనికి గోపిచంద్ స్పందిస్త ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక సమయంలో పెట్రోలు అయిపోవాల్సిందే. అప్పటివరకు పోరాటం మాత్రం ఆగకూడదు అని అన్నాడు. సైనా గతంలో గోపిచంద్ అకాడమీలో శిక్షణ పొందిన సంగతి తెలిసిందే.



దక్షిణాఫ్రికా జట్టు పగ్గాలు నాకివ్వండి : డుప్లెసిస్

దక్షిణాఫ్రికా వన్డే జట్టు కెప్టెన్సీ బాధ్యతలు తీసుకునేందుకు ప్రస్తుతం తాను సిద్ధంగా ఉన్నట్లు ఆ జట్టు టెస్టు, టీ20 కెప్టెన్ డుప్లెసిస్ స్పష్టం చేశాడు. మూడు రోజుల క్రితం జట్టు వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి ఎబి డివిలియర్స్ అనూహ్యంగా తప్పుకున్న విషయం తెలిసిందే. దీంతో 50 ఓవర్ల ఫార్మట్‌కి ఎవరిని కెప్టెన్‌గా ఎంపిక చేయాలనే విషయమై ఆ దేశ మాజీ క్రికెటర్లతో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు చర్చిస్తోంది. జట్టు నాయకత్వ బాధ్యతలు తనపై తీవ్ర ఒత్తిడిని పెంచిందని రాజీనామా సమయంలో డివిలియర్స్ ఆవేదన వ్యక్తం చేశాడు. మూడు ఫార్మట్లలో దక్షిణాఫ్రికా కెప్టెన్‌గా పనిచేసేందుకు నేను సిద్ధం. ఇంకా చెప్పాలంటే...నాయకత్వ బాధ్యత నాలోని అత్యుత్తమ ఆటని వెలికితీస్తోంది అని డుప్లెసిస్ వెల్లడించారు. అయితే...గతంలో మూడు ఫార్మట్లలో కెప్టెన్‌గా పనిచేసిన డివిలియర్స్ క్రమంగా ఒత్తిడి పెరుగుతోందంటూ ఒక్కో ఫార్మట్ నుంచి పక్కకి తప్పుకుంటూ వచ్చాడు. చివరికి అవిశ్రాంత క్రికెట్ కారణంగా గాయాలపాలై దాదాపు ఏడాదిన్నర నుంచి టెస్టు క్రికెట్‌కి దూరమైపోయాడు. ఈ నేపథ్యంలో మళ్లీ డుప్లెసిస్‌కి మూడు ఫార్మట్లలో పగ్గాలు అప్పగించి మరో సాహసం చేయకూడదనే ఆలోచనలో కూడా దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు ఉన్నట్లు సమాచారం.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/15-17 Air Surcharge: Delhi : 40 Ps.